ఆదివారం
గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం fb.com/vaartha
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 336 పేజీలు: 12 వెల: 6.50

ఎంఎస్‌ఎంఇ రంగానికి వెన్నెముక ఒఎన్‌డిసి: పిఎం
బీహార్, కేరళ గవర్నర్ల బాధ్యతల స్వీకారం
5లో


ప్రపంచ చెస్ విజేత గుకేష్


ఒలింపిక్స్ పతక విజేత మనుబాకర్



దీప్తీ జీవాంజి



జ్యోతి ఎర్రాజీ

## మనుబాకర్ సహా నలుగురికి ఖేల్‌రత్న

### ఇద్దరు తెలుగు అథ్లెట్లు దీప్తి జీవాంజి, జ్యోతి యర్రాజీ సహా 32 మందికి అర్జున అవార్డులు

### ఐదుగురికి ద్రోణాచార్య

### అత్యున్నత క్రీడా పురస్కారాలు ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** భారత అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవార్డులకు మనుభాకర్‌తో సహా మొత్తం 4గురిని ఎంపిక చేసింది. వీటితోపాటు, అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులను వెల్లడించింది. షూటింగ్‌లో ఒలింపిక్స్ పతక విజేత మనుబాకర్, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేత గుకేష్, హాకీ క్రీడాకారుడు హర్మన్ ప్రీత్ సింగ్, పారా ఒలింపిక్స్ స్వర్ణ పతకం విజేత ప్రవీణ్ కుమార్‌కు ఖేల్‌రత్న అవార్డులు వరించాయి. అలాగే ఈ ఏడాది అర్జున అవార్డులు కూడా కేంద్రం ప్రకటించింది. వీరిలో 17 మంది పారా అథ్లెట్లు సహా, 32 మందికి అర్జున అవార్డులకు ఎంపికయ్యారు. అర్జున అవార్డు >>2

# జోరుగా అమరావతి నిర్మాణం

### రూ. 2733 కోట్ల పనులకు కేబినెట్ ఆమోదం

### ఎస్ఐపిబి ఆమోదించిన రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు, 2,63,411 మందికి ఉద్యోగాల కల్పన అంశాలకు గ్రీన్ సిగ్నల్

### సిఆర్‌డిఎ 44వ సమావేశంలో తీసుకున్న రెండు పనులను ఆమోదించిన కేబినెట్

### మునిసిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు పచ్చజెండా

### రైతులకు కేంద్రం ఇస్తున్న రూ. 10 వేలకు మరో 10 వేలు ఇవ్వాలని నిర్ణయం


గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు

**విజయవాడ.జనవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పరంగా తీసుకునే ప్రతి నిర్ణయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ విషయంలో మంత్రి తమ శాఖల యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు ఆరు నెలల వ్యవధిలో మనం కీలక అడుగులు వేస్తున్నామన్నారు. అమరావతి నిర్మాణ పనుల జోరు పెంచామన్నారు. ఈ విషయంలో ఎక్కడా అడ్డంకులు లేకుండా మనం స్పందించాలన్నారు. కేబినెట్ సమావేశం గురువారం ఎపి సచివాలయం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 14 కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యంగా 14 అజెండా అంశాలపై ఎపి కేబినెట్ సమావేశమవగా.. సుదీర్ఘంగా చర్చల అనంతరం వీటికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
ఎపి రాజధాని అమరావతిలో రూ.2733 కోట్ల పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతిలో రెండు ఇంజనీరింగ్ కాలేజీల పనులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అలాగే భవనాలు, లేఔట్‌ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ చేసిన సవరణ ప్రతిపాదనకు ఎపి కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతిలో ఇఎస్ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంపు ప్రతిపాదనకు కేబినెట్ అనుమతినిచ్చింది. అలాగే పిఠాపురం ఏరియా డెవలెప్మెంట్ అథారిటీలో 19 నూతన పోస్టులకు అనుమతి >>2

# మెగా డిఎస్సీ ద్వారా 16,500 పోస్టుల భర్తీ

### వచ్చే విద్యా సంవత్సరానికల్లా ప్రక్రియ పూర్తి: సమాచార మంత్రి పార్థసారధి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరానికల్లా మెగా డిఎస్సీ ద్వారా 16,500 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.. గత ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధ్వంస విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో ఘోరంగా మారింది ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి దాదాపు రూ.40 వేలకోట్ల మేర పెండింగ్ బిల్లులు మరియు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి ఈ ఆరు మాసాలకాలంలో వీటన్నింటినీ చెల్లించుకుంటూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పలు కార్యక్రమాలను అమలు చేయడం జరుగుచున్నది. ఫించన్లను పెంచుతూ ఎన్టీఆర్ భరోసా పథకాన్ని అమలు చేయడం జరిగింది సామాజిక భద్రతా ఫించనును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచడం జరిగింది. వికలాంగుల ఫించన్లను కూడా పెంచడం జరిగింది కొన్ని లక్షల పేదవారి కడుపును మూడు పూట్లా నింపే విధంగా అన్నా క్యాంటీన్ల ఏర్పాటుతో పాటు ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేయడం జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించడం



గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

జరిగింది కేంద్రం ఎప్పుడైతే రైతు భరోసాను విడుదల చేస్తుందో అప్పుడే రాష్ట్ర ప్రభుత్వ కూడా తన వాటాను రైతు భరోసా పథకం క్రింద ఇవ్వడం జరుగుతుంది. మత్స్యకారులకు గత ప్రభుత్వం కేవలం రూ.10 వేలు మాత్రమే ఇవ్వడం జరిగింది. అయితే ఈ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.20 వేలను ఏప్రిల్ మాసంలో మత్స్యకారులకు అందజేయాల నిర్ణయం తీసుకోవడం జరిగింది. మెగా డిఎస్సీ ద్వారా 16,500 పోస్టులను ప్రకటించడం జరిగింది.
వచ్చే విద్యా సంవత్సరానికల్లా ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయనున్నాము ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటన దిగ్విజయానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 8 వ తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ జిల్లాలో ప్రర్యటించనున్న నేపథ్యంలో ఆ పర్యటనను విజయవంతంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.
కూటమి పార్టీల సమన్వయంతో ఒక పొలిటికల్ కమిటీని ఏర్పాటు చేసి జన సమీకరణతో పాటు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించడం జరిగింది ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో ప్రధాన మంత్రి బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతుంది సంపత్ వినాయక దేవాలయం నుండి మీటింగ్ జరిగే ఎయు వేదికవరకూ రోడ్‌షో నిర్వహించడం జరుగుతుంది పూడిమడకలో >>2

## విశాఖ, విజయవాడలో డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో: సిఎం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 66 కి.మీ మేర విజయవాడ మెట్రో, 76.90 కి.మీ మేర విశాఖ మెట్రో ప్రాజెక్టులు చేపట్టేందుకు ఇప్పటికే డిపిఆర్‌లు ఆమోదించారన్నారు. ఈ ప్రాజెక్టులకు నిధులఅంశంపై గురువారం సచివాలయంలో సిఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సమావేశంలో మెట్రో ఎండి రామకృష్ణారెడ్డి ప్రజెంటేషన్ ద్వారా మెట్రో ప్రాజెక్టు స్థితిగతులను వివరించారు. 2017లో వచ్చిన కొత్త మెట్రో పాలసీ ప్రకారం మన రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టులకు ఫండింగ్ మోడల్స్‌పై ముఖ్యమంత్రి చర్చించారు. 2017 వరకు 100 శాతం నిధులు కేంద్రం భరించే విధానంలేదు. అయితే 2017 పాలసీ ప్రకారం 100 శాతం ఈక్విటీ కేంద్రమే చెల్లిస్తూ కోల్ కత్తాలో 16 కి.మీ మేర ప్రాజెక్టు చేపట్టారు. రూ.8,565 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రైల్వే శాఖలు కోల్ కత్తా ప్రాజెక్టును చేపట్టాయి. ఇదే తరహాలో ఏపీలోకూడా మెట్రో పాజెక్టులు చేపట్టే అంశంపై కేంద్రంతో చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోకూడా రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందని సిఎం అన్నారు. ఆ చట్ట ప్రకారమయినా...లేకపోతే 2017 >>2

## రూ. 185 లక్షల కోట్లకు పెరిగిన భారత్ రుణం

### జిడిపిలో 58.2%కి చేరిన భారం

**న్యూఢిల్లీ, జనవరి 2:** భారత్ రుణభారం పరిమితులు దాటిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 185 లక్షలకోట్ల రూపాయలమేర భారత్ రుణభారం ఉన్నట్లు అంచనాలున్నాయి. 2024 మార్చి నాటికి ప్రభుత్వరుణం 171.78 లక్షలకోట్లు ఉండగా జిడిపిలో 58.2శాతానికి చేరింది. అదే ఈ ఏడాది మార్చి మాసాంతానికి ఈరుణం 185.27 లక్షలకోట్లకుచేరుతుందన్న అంచనాలున్నాయి. ప్రభుత్వ రుణం అంటే బాహ్యరుణపరపతి, ప్రభుత్వ ఖాతా, ఇతర రుణాలు, విదేశీ రుణపరపతి ద్వారా చేకూరిన మొత్తం,నగదు నిల్వలు వంటివి కూడా ఈ పరిధిలోకి వస్తాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న రుణాన్ని రీఫైనాన్సింగ్ తిరిగి చెల్లించుకునే వెసులుబాటు ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ ప్రపంచ ఆర్థిక ముఖచిత్ర నివేదికప్రకారంచూస్తే భారత స్థూల దేశీయోత్పత్తి ప్రస్తుత ధరవరల ప్రకారంచూస్తే 3.57 లక్షలకోట్ల డాలర్లుగాఉంది. కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చట్టసభలోనే ఈ >>2

## ఎస్సీ ఉపకులాల వివరాలివ్వండి

### -రాజీవ్ రంజన్ మిశ్రా

**కర్నూలు, జనవరి 2, ప్రభాతవార్త :** షెడ్యూల్ కులాల్లోని ఉప కులాల వారీగా ఆయా శాఖల వారీగా సమగ్రమైన వివరాలను ఇవ్వాలని ఏక సభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశానికి సంబంధించి ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా తొలుత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.. అనంతరం ఈ అంశంపై వ్యక్తులు, వివిధ సంస్థల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆగస్ట్ 1, 2024న వెలువరించిన సుప్రీంకోర్టు ఉత్తర్వుల ననుసరించి, ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై విచారణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏక సభ్య కమిషనన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పూర్వపు జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు ఈఅంశంపై వ్యక్తులు, సంస్థల నుండి వినతి పత్రాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఉప కులాల వారీగా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సమగ్రమైన వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఏక సభ్య కమిషన్ సిఫార్సులను చేయడం జరుగుతుందని రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. ఉప కులాల వారీగా కీలకమైన రంగలైన ఉపాధి, విద్యకు సంబంధించిన ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య అంశాలకు సంబంధించిన వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమగ్రంగా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు.. ఇందుకు సంబంధించి ప్రొఫార్మా ఇవ్వడం జరిగిందని తెలిపారు.. డేటాలో కచ్చితత్వం ఉండాలని, ఎలాంటి పొరపాట్లు ఉండకూడదని ఆయనస్పష్టం చేశారు.. చాలా జాగ్రత్తతో వివరాలను >>2



గురువారం విజయవాడ బుక్ పెస్టివల్ ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

## మాతృభాషతోనే సృజనాత్మకత

### నాకు ధైర్యాన్నిచ్చింది పుస్తకాలే

### విజయవాడ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించిన డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ, జనవరి2, ప్రభాతవార్తప్రతినిధి:** తనకు జీవితంలో నిలబడే ధైర్యాన్నిచ్చింది పుస్తకాలే అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తన తల్లిదండ్రుల వల్ల పుస్తక పఠనం అలవాటైందని, రూ.కోటి ఇవ్వడానికి ఆలోచించను గానీ పుస్తకం ఇచ్చేందుకు ఆలోచిస్తానని చెప్పారు.. విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలో పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించారు. విజయవాడ పుస్తక మహోత్సవ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై ఏర్పాటుచేసిన సభలో పవన్ మాట్లాడారు. పుస్తకం ఇవ్వాలంటే తన >>2

## రిజర్వాయర్లలో 75% నీటినిల్వలు: సిఎం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో భారీ వర్షపాతం వలన వచ్చిన నీటిని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారుల కృషి వలన 85 శాతం రిజర్వాయర్లు నిండాయని సిఎం చంద్రబాబు అన్నారు. ఎపి కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో పలు కీలకఅంశాలపై సిఎం చర్చించారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖపై సిఎం సమీక్ష జరిపారు. రిజర్వాయర్లలో 75% నీటి నిల్వలు ఇంకా ఉన్నాయని తెలిపారు. మంత్రి, అధికారులు దృష్టి పెడితే ఫలితాలు బాగుంటాయని అనేదానికి ఇదే ఉదాహరణ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 85 శాతం రిజర్వాయర్లు నింపామని సిఎం అన్నారు. అలాగే రాష్ట్రంలో డిఎస్సీ పోస్టుల భర్తీ.. వచ్చే విద్యాసంవత్సరంలోపు పూర్తి చేయాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారులు తగినఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతి వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యాసంస్థల యాజమాన్యాలతో మాట్లాడి కొత్త విద్యాసంవత్సరం ఫీజ్ రీఎంబర్స్‌మెంట్ చెల్లింపులు చేయాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ఇప్పటికే అమల్లోకి తెచ్చిన ఫించన్ పెంపు, దీపం పథకం వంటి వాటిపై ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు.



## వెంకన్నకు ప్రతినెలా 100 కోట్లు పైనే

### గతేడాది రికార్డుస్థాయి హుండీ ఆదాయం రూ.1,365 కోట్లు

**తిరుమల, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఖ్యాతిచెందినట్లే కానుకల రూపంలో హుండీ ఆదాయం కూడా రికార్డు సృష్టిస్తోంది. గత మూడు సంవత్సరాలుగా ఏటా ఏటా వడ్డీకాసులవాని హుండీ ఆదాయం రెట్టింపవుతోంది. ప్రతినెలా 120-130 కోట్ల రూపాయలు మధ్య హుండీ ఆదాయంతో 2024జనవరి నెలనుండి 2024 డిసెంబర్‌నెల వరకు వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి అత్యధిక సంపన్నవంతమైన దేవుడేనని రుజువుచేస్తున్నాడు. దేవదేవుని దర్శనానికి వస్తున్న శ్రీవారి భక్తులు తమ కానుకలుగా హుండీకి సమర్పించిన ఆదాయమే 1,365కోట్ల రూపాయలు పైమాటగానే నమోదైంది.తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బడ్జెట్‌కూడా 2024-25కి 5,142కోట్ల రూపాయలు అంచనా కాగా ఇందులో హుండీ ఆదాయమే 1,611కోట్లు రూపాయలుగా అంచనా వేశారు. ఇప్పుడు గత ఏడాది జనవరి నుండి డిసెంబర్ నెల వరకు 2.55కోట్లమంది భక్తులు ఏడుకొండలస్వామిని దర్శించుకోగా హుండీ ఆదాయం అదేస్థాయిలో భారీగా రికార్డయ్యింది. సగటున ఒక్కోనెలలో హుండీ ఆదాయం 125 కోట్లురూపాయలు కూడా నమోదైంది. ఒక్కోరోజు 4.60కోట్ల రూపాయలు కూడా హుండీకి ఆదాయం వచ్చింది. గత ఏడాది జులైలో 125కోట్లు రూపాయలు ఆదాయం లభించింది. 2021వ సంవత్సరంనుండి ప్రతినెలా వందకోట్ల రూపాయలుపైగానే కానుకల రూపంలో హుండీకి చేరుతుండటం ప్రత్యేకత.
సామాన్యుడి నుండి సంపన్నులు(లక్షలు,కోట్లు ఆదాయం గడించే)వరకు దేశవిదేశాల్లోని భక్తులు తమ ఇష్టదైవం ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని సంతృప్తికరంగా ప్రతిరోజూ 80వేలమంది వరకు దర్శించుకొంటున్నారు. ప్రతి నెలలో సరాసరి 22లక్షలమంది వరకు భక్తులు దర్శనాలు చేసుకుంటున్నట్లు గణాంకాలు తెలుస్తున్నాయి.నెలనెలా ,ప్రతి ఏటా తిరుమలేశుని దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా,స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డుసృష్టిస్తోంది.ప్రతిరోజూ తమతమ మొక్కుబడుల్లో భాగంగా తిరుమలకు చేరుకొంటున్న భక్తులు తమ కష్టాలు తీరాయని, ఆపదలు తొలగిపోయాయని కానుకల రూపంలో హుండీకి నగదు, బంగారు ఆభరణాలు, నిలువుదోపిడీలు సమర్పించుకోవడం ఆనవాయితీ. గత మూడేళ్లనుండి ఆదాయం రూపంలో టిటిడి చరిత్రలో నెలనెలకో ప్రత్యేకత సంతరించుకుంటోంది. ఇదివరకు తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలోనే నమోదుకాని హుండీ ఆదాయం >>2



కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్రపతి ముర్ముకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

# మాతృభాషతోనే సృజనాత్మకత

>> సంపద ఇచ్చినంత మదనపడతానని పవన్ కల్యాణ్ అన్నారు. కొందరు పుస్తకాలు అడిగితే కొనిస్తాగానీ తన వద్ద ఉన్న పుస్తకాలు ఇవ్వనని చెప్పారు. పుస్తక పఠనం లేకపోతే జీవితంలో ఏమయ్యేవాడినో అనిపిస్తుందని, తాను కోరుకుంటున్న చదువు పుస్తకాల్లో లేదని వ్యాఖ్యానించారు. మా అమ్మ, నాన్న వల్ల పుస్తక పఠనం అలవాటు అయ్యిందని గుర్తుచేశారు. పుస్తక ప్రదర్శనకు మున్సిపల్ స్టేడియం ఇవ్వడం లేదని తనకు చెప్పారన్నారు. వెంటనే మంత్రి నారాయణ, అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లానని చెప్పారు. పుస్తకాలు మన మైండ్‌కు శిక్షణ ఇస్తాయని.. అందుకే స్టేడియంలో శారీరక ధారుఢ్య తరహాలో.. మెదడు ధారుఢ్యం కోసం స్టేడియం ఇవ్వాలని చెప్పానని అన్నారు. మన తెలుగు భాష ఎన్నో ప్రేరణలు కలిగిస్తుంది. నా లాంటివాళ్లు ప్రాచుర్యం కలిగి ఉండవచ్చు, కానీ జ్ఞానం ఉన్న వాళ్లు ఎక్కువగా మాట్లాడరు. నాలాంటివాళ్లు అలాంటి జ్ఞానుల గురించి చెప్పాలి. పాపులారిటీ ఉన్న వారంతా మేధావులు కాదు..నాతో సహా. ఒకకథ, స్క్రీన్ ప్లే, ఒక స్పీచ్ రాయాలంటే ఎంతో వేదన పడాలి. నేను తెలుగును సరిగ్గా నేర్చుకోనందుకు చాలా బాధ పడుతున్నాను. విద్యార్థులు తెలుగు వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. ఇంగ్లీషు నేర్చుకోండి, మాతృభాష ద్వారానే పట్టు సాధ్యం. ఇంగ్లీషు వల్లే అంతా జరిగిపోదు, ఉద్యోగాలు వచ్చేయవు. మనలో సృజనాత్మకత ఉండాలంటే మాతృభాషపై పట్టు ఉండాలి.నేను రచయిత కాదు.. వారి కష్టాన్ని అర్థం చేసుకున్నా. ఇలాంటి వేదికలు లేకుంటే సాహితీ వేత్తలను కలిసే అవకాశం ఉండేది కాదు. గ్రంథాలయాలు ఏర్పాటుపై ఉద్యమంగా పోరాటం చేయాలి. పుస్తకం రాయాలి అంటే ఎంత కష్ట పడాలో తెలుసుకోండి. ఇది అర్థం చేసుకుంటే మనకు రచయితలపై గౌరవం పెరుగుతుంద్థి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్వతీపురం మన్యంలో తాను పర్యటించేందుకు కేశవరెడ్డి రచించిన అతడు అడవిని జయించాడనే పుస్తకం ప్రోత్సహించిందన్నారు. పుస్తక పఠనం అలవాటుగా మారడం ద్వారా మన సంస్కృతి పట్ల అవగాహన కలుగుతుందన్నారు. అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు డాక్టర్ మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన ఆలోచనలకు పుస్తక పఠనమే ప్రేరణనన్నారు. చదవడం ప్రారంభమైతే గెలవడం ప్రారంభమవుతుందని పత్రికా సంపాదకులు ఎం. నాగేశ్వరరావు అన్నారు. రామోజీరావు 50 ఏళ్లపాటు అక్షర తపస్సు చేశారని, ఆయన స్మృతిలో వేదికకు నామకరణం చేయడం అభినందనీయమన్నారు.

**విజయవాడలో ఆవిష్కృతమైన పుస్తక ప్రపంచం**

విజయవాడ నగరంలో పుస్తక ప్రపంచం ఆవిష్కృతమైంది.అధ్యయన అభిరుచి దండిగా ఉన్న పుస్తకప్రియులను ఈ ప్రపంచం వినమ్రంగా ఆహ్వానిస్తోంది.ఎన్నో వింతలు,విచిత్రాలు,విజ్ఞాన విషేశాలు. సశేషాలు సమగ్రంగా మీ అరచేతిలో పెడతానంటుంది. 11 రోజులపాటు 270కిపైగా స్టాళ్లలో వేలాది పుస్తకాలు అందుబాటులో ఉండనున్నాయి. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తోన్న 35వ పుస్తక మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రేపటి నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో పుస్తక మహోత్సవాన్ని ఉచితంగా సందర్శించి, సదస్సులు, సమావేశాలు, పుస్తక ఆవిష్కరణల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు. పుస్తక ప్రదర్శనలో ఉండే స్టాళ్లలో ప్రతి పుస్తకంపై తప్పనిసరిగా 10శాతం రాయితీ ఇస్తారు.

# ఉపకులాల వివరాలివ్వండి

>> సేకరించా లని, అలాగే త్వరితగతిన పంపాలని సూచించారు.. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ఎన్ని ఉన్నాయి? ఉపకులాల వారీగా వారి వివరాలు ఇవ్వాలని డిఆర్డిఏ పిడిని ఆదేశించారు..అలాగే అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ది పొందిన వారి వివరాలను కూడా సమగ్రంగా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయా సంస్థలు,వ్యక్తుల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన ప్రొఫార్మా లో పూర్తి వివరాలతో పొందుపరచి పూర్తి స్థాయి విశ్లేషణతో పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. వినతుల స్వీకరణ.... షెడ్యూల్డ్ కులాల్లోని ఉపకులాల వర్గీకరణ కు సంబంధించి వ్యక్తులు, వివిధ సంస్థల నుంచి వినతులను ఏక సభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా స్వీకరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి తులసీ దేవి తదితరులు పాల్గొన్నారు.

# నలుగురికి ఖేల్‌రత్న

>> గ్రహీతల్లో తెలంగాణ పారా అథ్లెట్ దీప్తి జివాంజి కూడా ఉంది. వీటితో పాటు, మరో 5 గురికి ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈ అత్యున్నత అవార్డులను ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఈ నలుగురు కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక అర్జున అవార్డుకు ఎంపికైన అథ్లెట్లలో జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్), అన్నూ రాణి (అథ్లెటిక్స్), నీతూ (బాక్సింగ్), సావీటీ (బాక్సింగ్) వంటికా అగర్వాల్ (చెస్), సలీమా టెటే (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), సుఖజీత్ సింగ్ (హాకీ), రాకేష్ కుమార్ (పారా ఆర్చరీ), ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్), జీవన్‌జీ దీప్తి (పారా అథ్లెటిక్స్), అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్), సచిన్ సర్జేరావు ఖిలారీ (పారా అథ్లెటిక్స్), ధరంబీర్ పారా (అథ్లెటిక్స్), ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్), హెచ్ హోకాటో సెమా (పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవదీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసిమతి మురుగేషన్ (పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), మనీషా రామదాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోనా అగర్వాల్ ( పారా షూటింగ్), రుబీనా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్), స్వప్నిల్ సురేష్ కుసలే (షూటింగ్), సరబ్జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాష్ జ (స్విమ్మింగ్), అమన్ (రెజ్లింగ్) ఉన్నారు.

## ఖేల్ రత్న, అర్జున అవార్డుల పట్ల సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** క్రీడాకారులకు ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డులను భారత ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఈ అవార్డుల ప్రకటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌వేదికగా హర్షం వ్యక్తంచేశారు. ఎయిర్ గన్ షుటింగ్‌లో ఒలింపిక్స్ పతక విజేత మను భాకర్, భారతీయ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్, హాకీలో ఒలింపిక్ పతక విజేత టీమ్ సభ్యుడు హాకీ క్రీడాకారుడు హర్మన్ ప్రీత్ సింగ్, పారా అథ్లెటిక్స్‌లో ఒలింపిక్ పతక విజేత ప్రవీణ్ కుమార్, అర్జున అవార్డు గ్రహీతలు విశాఖకు చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ, వరంగల్‌కు చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తిలను ఈ సందర్భంగా అభినందిచారు.

## ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్త కావాలి!

### మోరగుడి సభలో కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్



గురువారం జమ్మలమడుగులో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి జితేంద్రసింగ్

**కడప, జనవరి 2 :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డా. జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధి పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డా. జితేంద్ర సింగ్.. గురువారం సాయంత్రం జమ్మలమడుగు మండలం మోరగుడి ఎస్.ఆర్. ఫంక్షన్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని.. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధనకు కృషి చేస్తోందన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహకారంతో.. ఆర్థిక పరిపుష్టిని సాధించాయన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే.. జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకుని.. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు..... ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి.. వారిని ఈ కామర్స్ బిజినెస్ లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణ కూడా ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే.. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎన్నో మహిళా సంఘాలు వివిధ రకాలుగా స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో జమ్మలమడుగు మండలం వంద శాతం పురోగతిని సాధిస్తుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించడంలో జమ్మలమడుగు ముందంజలో వుందన్నారు. అనంతరం.. మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలతో.. ఎస్బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణం కోసం శిలా ఫలకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు.



మహాకుంభ్ సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో ఒంటెలపై ఎక్కివస్తున్న సాధువులు

# ప్రతినెలా100 కోట్లు పైనే

>> గడచిన ఏడాదిలో అత్యధికంగా రెట్టింపయ్యింది. రానున్న టిటిడి వార్షిక బడ్జెట్‌లో కూడా బడ్జెట్ అంచనాలకు మించి భక్తుల మొక్కుబడుల రూపంలో కానుకల ద్వారానే దాదాపు 1,700కోట్ల రూపాయలు ఆదాయం దాటే సూచనలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ అంచనాలకు తగ్గట్లు భక్తుల కానుకల ద్వారా హుండీ ఆదాయం కూడా రికార్డుస్థాయిలోనే లభిస్తోంది. ఇప్పుడు గత ఏడాదికి 1,365కోట్లు రూపాయలు పైమాటే చేకూరడం ప్రత్యేకత. ఇక వెంకన్న లడ్డూ ప్రసాదాలు కూడా నెలవారీగా కోటివరకు లడ్డూలు విక్రయించగా ఏడాదిలో 12.14కోట్లు లడ్డూలు భక్తులు కొనుగోలుచేశారు.

**భక్తుల కానుకలద్వారానే ఆదాయం!:**

దేశవిదేశాల్లోఉన్న కోట్లాదిమంది హిందూ భక్తులు నమ్మికొలిచే ఏడుకొండల వేంకటేశ్వరునికి ముడుపుకట్టి సమర్పించుకునే హుండీ కానుకల ద్వారానే వడ్డీకాసులవాని ఆదాయం గణనీయంగా రెట్టింపవుతుంది. టిటిడి ఉద్యోగుల వేతనాలు, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించడం,ఇతరత్రా అభివృద్ధిపనులు వంటివి చేపట్టడం హుండీ ఆదాయం ద్వారానే. అలాంటిది గత ఏడాది నుంచి భక్తులు మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించే కానుకలు భారీగా చేకూరాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి జూన్,జులై,ఆగస్టు నెలల్లో ఎప్పుడు వీలైతే అప్పుడు హుండీలో కొంత భారీ మొత్తంలో దాతలు, ధనవంతులు, సామాన్యభక్తులు కానుకలు నగదు పెద్ద మొత్తంలో సమర్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. భక్తుల కానుకల హుండీ ఆదాయం 2024 జనవరిలో 116.46కోట్ల రూపాయలు, ఫిబ్రవరిలో 111.71కోట్లు, మార్చిలో 118.49కోట్లు, ఏప్రిల్‌లో 101.63కోట్లు, మేనెలలో 108.28కోట్లు, జూన్‌లో 113.64కోట్లు రూపాయలు,జులైలో 125.35కోట్లు రూపాయలు, ఆగస్టులో 125.67కోట్లు, సెప్టెంబర్‌లో 114.11కోట్లు రూపాయలు, అక్టోబర్‌లో (వార్షిక బ్రహ్మోత్సవాలసయమయం)107.30కోట్లు, నవంబర్‌నెల్లో 111.30కోట్లు, డిసెంబర్‌లో 111.27కోట్లు ఇలా వరుసగా వందకోట్లుపైగానే ఆదా యం రావడం విశేషం.

# పెరిగిన భారత్ రుణం

>> వివరాలను వెల్లడించారు. ఇక ప్రైవేటు వినియోగ వ్యయం చూస్తే స్థిరమైన ధరలప్రకారం 6.8శాతంగాను, 2023-24లో నాలుగుశాతంగాను ఉన్నాయి. ఇక ప్రైవేటు తుదివిడత వినియోగదారుల వ్యయ అంచనాలనుచూస్తే జిడిపిలో 60.3శాతంగా ఉంది. ఇక సాధారణ నికర రుణపరపతి పరిమితి జిడిపిలో 4శాతానికి మించకూడదని 15వ ఆర్థిక సంఘం ప్రకటించింది. 2021-22 ఆర్థికసంవత్సరంలో రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తిఇలో రుణాలు నాలుగుశాతంగానే ఉన్నాయి. అంచనావేసిన జిడిపికి 0.50శాతం అటూ ఇటూగా కూడా రాష్ట్రాలు రుణసమీకరణలుచేస్తాయి. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం మొత్తం 2100 కోట్ల ఆర్థికసాయాన్ని నడు వెనుకబడిన జిల్లాలకు అందించాలని సిఫారసుచేసింది. ఒక్కోజిల్లాకు 300 కోట్లుచొప్పున మొత్తం 2100 కోట్లు ఇవ్వాలని 15వార్థికసంఘం సూచించింది. అలాగే నీతి ఆయోగ్‌కూడా ఈప్రతిపాదనలను సమర్థించింది. ఈచట్టంపరిధిలోనే నీతి ఆయోగ్ సిఫారసులను అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు 1750 కోట్లు విడుదల చేసారని ఏడు వెనుకబడిన జిల్లాలకు ఈ నిధులు వినియోగించాలని నిర్దేశించినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి తెలిపారు.

# డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో

>> మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్ర సాయం చేయాలన్నారు. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు రెండు చోట్లా డబుల్ డెక్కర్: విశాఖ, విజయవాడలలో చేపట్టే మెట్రో ప్రాజెక్టుల్లో డబుల్ డెక్కర్ విధానం అమలు చేయబోతున్నారు. హైవే ఉన్న చోట్ల డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో ప్రాజెక్టును నిర్మిస్తారు. ఈ విధానంలో కింద రోడ్డు దానిపైన ఫ్లైవోవర్ ఆపైన మెట్రో వస్తుంది. విశాఖలో మొదటి స్టేజ్ లో చేపట్టే మధురవాడ నుంచి తాడిచెట్లపాలెం వరకు 15 కి.మీ, గాజువాక నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ వరకు 4కి.మీ డబుల్ డెక్కర్ మోడల్ లో మెట్రో నిర్మించనున్నారు. అలాగే విజయవాడలో రామవరప్పాడురింగ్ నుంచి నిడమానూరు వరకు 4.7 కి.మీ డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో నిర్మాణం చేపడతారు. ఇప్పటికే ఈ తరహా మోడళ్లు పలు నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. కాబట్టి మన రాష్ట్రంలోనూ ఈ తరహా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కేంద్రంతో త్వరితగతిన సంప్రదింపులు పూర్తి చేసి మెట్రో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. 4 ఏళ్లలో రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, బిసి జనార్థన్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోస్టుల భర్తీ

>> ఎన్.టి.పి.సి. ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ కు దేశ ప్రధాని శంకుస్థాపన చేయడం జరుగుతుంది ఈ ప్రాజక్టు ద్వారా రూ.65,370 కోట్ల పెట్టుబడులను మూడు దశల్లో పెట్టడం జరుగుతుంది. కృష్ణపట్నం ఇండస్ట్రీయల్ హబ్‌ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు రూ.1518 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును తొలి దశలో 2,500 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుంది ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయి అదేవిధంగా నక్కపల్లిలో 2001.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.1876.66 కోట్ల విలువైన బల్కు డ్రగ్ పార్కును ఏర్పాటు చేయడం జరుగుచున్నది ఈ పార్కులో రూ.11,542 కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని, తద్వారా 54 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ఆశించడం జరుగుచున్నది విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 03-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
చవితి రా.11.40
ధనిష్ఠ రా.10.21
వర్జ్యం : తె.5.15-6.48
దు.ఉ.8.59-9.43, 2) మ.12.42-1.26
శుభసమయం : ఉ.7.00-07.40,
సా.4.35-5.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ఈ రోజు సాధ్యమైనంతవరకు ప్రయాణాలను వాయిదా వేయండి. శ్రమ అధికం.

**వృషభం :** కుటుంబంలోని వారి కోసం చేసే కొనుగోలు అంచనాలకు మించి ధనవ్యయం సూచిస్తోంది.

**మిథునం:** మీ వినయ విధేయతలు, స్నేహితులను భాగస్వాములను, ఆత్మీయులను ఆకట్టుకుంటాయి.

**కర్కాటకం :** అధిక శ్రమ, త్రిప్పట ఎదురు కావచ్చు. ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

**సింహం:** అంతర్గత శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కన్య :** శుభాశుభ మిశ్రితంగా ఉంది. కుటుంబసభ్యులతో సఖ్యత ఏర్పడుతుంది.

**తుల :** స్థిరాస్థుల అమ్మకమునకు సరియైన సమయం కాదు. గోప్యతకు ప్రాధాన్యత ఇవ్వండి.

**వృశ్చికం:** పెద్దగా పరిచయం లేని వారి వలన పనుల పూర్తికావడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**ధనుస్సు:** సంఘసేవ కార్యక్రమాలకు మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు.

**మకరం:** ఎంతో కాలంగా మీరు మానసికంగా ఆలోచిస్తున్న ఒకానొక కార్యక్రమం ఈ రోజు సానుకూలమవుతుంది.

**కుంభం:** ఇంటా బయటా ఈ రోజు ఆరంభంలో మంచి వాతావరణంలో ఆనందాన్ని పొందుతారు.

**మీనం :** మీ నిర్వహణ, ప్రతిభాపాటవాలు తెలివితేటలు అనుభవానికి తగిన అవకాశాలు వస్తాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జోరుగా అమరావతి నిర్మాణం

>> మంజూరు చేస్తూ మంత్రి మండలిలో ఆమోదం తెలిపారు. గుంటూరు జిల్లా, పత్తిపాడు మండలం, నదింపాలెం గ్రామంలో ఆరున్నర ఎకరాలు స్థలాన్ని 100 బెడ్ల ఇఎస్ఐసి ఆసుపత్రి నిర్మాణానికి ఇస్తూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు ఎజెండా పూర్తయ్యాక పలు కీలక అంశాలపై మంత్రులతో సిఎం చర్చించారు. ఎస్ఐపిబి ఆమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 2,63,411 మందికి ఉద్యోగాలు కల్పించే అంశంపై కూడా కేబినెట్‌లో చర్చించారు. ఎస్ఐపిబి ఆమోదించిన పెట్టుబడులకు మంత్రివర్గ బేటీ అమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,174 కోట్ల పెట్టుబడులకు ఆమోదించింది. రైతులకు కేంద్రం ఇస్తున్న రూ.10 వేలతో పాటు.. ఏపీ ప్రభుత్వం మరో రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. మత్స్యకారులకు ఫిషింగ్ హాలిడే సమయంలో.. రూ.20 వేలు ఇవ్వాలని ఎపి కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 5 సంస్థలు క్లీన్ ఎనర్జీలో 83 వేల కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం అమోదం తెలిపింది. పలు కీలకమైన ప్రాజెక్టులపై కూడా కేబినెట్‌లో చర్చకు వచ్చింది. ముఖ్యంగా నెల్లూరుజిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బిపిసిఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో రూ. 83 వేలకోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది.సూపర్ సిక్స్ పథకాలకు ఎపి కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2025-26 విద్యా సంవత్సరంలోపు తల్లికి వందనం అమలు చేయాలి అని ఆర్థికశాఖకు ఆదేశాలు జారీచేసింది. మంత్రివర్గ సమావేశం ముగిశాక తాజా రాజకీయ పరిణామాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. పాఠశాలలు పునప్రారంభంలోపు తల్లికి వందనం అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే పాఠశాలల పునప్రారంభంలోపు మెగా డీఎస్సీ అమలు చేయాలని స్పష్టం చేశారు. రైతులకు కేంద్రం నిధులు మంజూరు చేసిన వెంటనే రాష్ట్ర నిధులు జోడించి అన్నదాత సుఖీభవ అమల్లోకి తీసుకురావాలన్నారు. రెవెన్యూ సదస్సులు జరుగుతున్న తీరుతెన్నులు, జలవనరులు, ఆర్థిక ఇబ్బందులపై సుదీర్ఘ చర్చ జరిగింది. వివిధ సమస్యల ఉదాహరణలు మంత్రులు, సిఎం చర్చించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ, ఫైనాన్స్, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రులతో ఉపసంఘం ఏర్పాటుకు నిర్ణయించారు. రెవిన్యూ, ఆర్థిక,మున్సిపల్, శాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. గోదావరి బనకచర్ల అనుసంధానంపై మంత్రులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కొత్త ప్రాజెక్టుకు ఎలా నిర్మించాలి, నిధుల సమీకరణపై చర్చించారు. కుప్పం, చిత్తూరుకు అదనంగా నీరు ఇచ్చేందుకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, యోగి వేమన నుంచి హంద్రీనీవా లింక్ ద్వారా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నదుల అనుసంధానం వెనుకబడిన ప్రాంతాల ప్రయోజనాల కింద నిధుల ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని సీఎం తెలిపారు. పట్టిసీమ వల్ల రాయలసీమకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగిన లబ్ధిపై మంత్రి పయ్యావుల వివరించారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులపై ఫైనాన్స్ శాఖ ప్రెజెంటేషన్ ఇచ్చింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలు చేసి తీరుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బకాయిలు ఎన్ని ఉన్నాయని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీయగా.. లక్ష 30 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు.

చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించాల్సిన స్థలంపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. క్లీన్‌ఎనర్జీలో పెట్టుబడులపై చర్చించారు. విశాఖలో టీసీఎస్ ఏర్పాటుపై చర్చించారు.. జనవరి 8న వైజాగ్ కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్నారు.

ప్రధాని రాష్ట్ర పర్యటనపై క్యాబినెట్‌లో చర్చ జరిగింది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు చేయాల్సిన అంశాలపై కూడా చర్చ జరిగింది. ప్రధాని పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో పలు పరిశ్రమలకు భూ కేటాయింపులు చేస్తూ ఆమోదం తెలిపింది క్యాబినెట్. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుపై మంత్రివర్గానికి సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమయంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించకపోతే నిర్మాణ అంచనా వ్యయం ఏడాదికి 40 వేలకోట్లు పెరుగుతుందని తెలిపారు. కేంద్రాన్ని మెప్పించి, ఒప్పించేందుకు సలహాలు ఇవ్వాలని కోరారు. సీఆర్‌డీఏ 44వ సమావేశంలో తీసుకున్న రెండు పనులకు మంత్రివర్గం ఆమోదం. మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గ్రీన్ సిగ్నల్, భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల జారీ అధికారం మున్సిపాలిటీలకు బదలాయించేలా చట్ట సవరణకు ఆమోదం, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు పచ్చజెండా,నంద్యాలతోపాటు వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అంగీకారం, రైతులకు కేంద్రం ఇస్తున్న 10 వేలతో పాటు రాష్ట్ర కూడా అదే సమయంలో మరో 10 వేలు ఇవ్వాలని నిర్ణయం, మత్స్యకారులకు ఫిషింగ్ హాలిడే సమయంలో రూ.20 వేలు ఇవ్వాలని నిర్ణయం, అమరావతిలో రెండు ఇంజనీరింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేబినెట్, లే అవుట్ల విషయంపై కీలకనిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీల పరిధిలోని లేఅవుట్ల అనుమతు లను ఇప్పటినుండి మున్సిపాలిటీలకే అప్పగిస్తూ ఆర్డినేట్ చట్టంను సవరణ చేసే దిశగా కేబినెట్ భేటీలో ప్రతిపాదన జరిగింది. కొత్త ఏడాదిలో తొలి సారిగా జరిగిన కేబినెట్ భేటీకి హాజరైన మంత్రులు ఒకరినొకరు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌లకు సైతం శుభాకాంక్షలు తెలిపారు.

**పవన్ కల్యాణ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సిఎం**

కేబినెట్ సమావేశం సందర్భంగా సీఎం చంద్రబాబు ఎంతో హుషారుగా కన్పించారు.నూతన సంవత్సరంలో జరిగిన ఈ తొలి మంత్రి మండలి సమావేశానికి హాజరైన మంత్రులు అధికారులకు ఆయన హ్యాపీ న్యూ ఇయర్ తెలిపారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆయన ప్రేమ పూర్వకంగా ఆలింగనం చేసుకుని మరి శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖల నిర్వాహణలోను,ఇతర బాధ్యతలు అభివృద్ధి పనుల పట్ల చూపుతున్న శ్రద్ధకు అభినందించారు.మీ అనుభవం,అనుసరిస్తున్న విధానాల స్ఫూర్తితోనే తాను అడుగులు ముందుకు వేస్తున్ననంటూ డిపూటీ సిఎం పవన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పలు అంశాల విషయంలో పవన్ ముందుగా సమాచారం తెలుసుకుంటూ ఆ దిశలో నిర్ణయాలు తీసుకుంటున్నారని,ఇది మంచి లక్షణమని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**మంత్రులతో విడివిడిగా చర్చించిన సిఎం చంద్రబాబు**

కేబినెట్ ముగిసిన తర్వాత మంత్రులతో సిఎం విడిగా సమావేశం అయ్యారు. జనవరి 8న ప్రధాని మోడీ వైజాగ్‌కు రానున్నారు. ఈ సందర్భంగా ప్రధాని రాష్ట్ర పర్యటనపై కేబినెట్‌లో చర్చించనట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 8వ తేదీన వైజాగ్ రానున్న విషయంపై సైతం కేబినెట్ భేటీలో సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రధాని పర్యటనను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు కూటమి నేతలందరూ కృషి చేయాలని సిఎం చంద్రబాబు సూచించారు.

గతంలో ప్రధాని పర్య టన ఖరారై రద్దయిన విషయం తెలిసిందే. మరల జనవరి 8వ తేదీన ప్రధాని మోడీ వైజాగ్‌కు రానున్న సందర్భంగా, భారీ భద్రతా చర్యలు చేపట్టాలని సైతం సిఎం సూచించారు.ఇక మంత్రులకు సిఎం చంద్రబాబు పలు మార్గ దర్శకాలు జారీ చేసారు.శాఖా పరంగా అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

# నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం: సిఎం చంద్రబాబు



ప్రొబెషనరీ ఏఎస్పీలు, డీఎస్పీల సమావేశంలో సీఎం చంద్రబాబు

### గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై ఉక్కుపాదం

### శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కఠినంగా ఉండాలి

### ప్రొబెషనరీ ఏఎస్పీలు, డీఎస్పీలతో ముఖ్యమంత్రి సమావేశం

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** నేరాల నియంత్రణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.గత ఐదేళ్లు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.మళ్లీ శాంతి భద్రతలను గాడిలో పెట్టాలని శిక్షణ పూర్తిచేసుకున్న ప్రొబెషనరీ ఏఎస్పీలు, డీఎస్పీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరేందుకు సిద్ధంగా వున్న ఎస్పీలు, డీఎస్పీలు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. వారితో సమావేశంలో ముఖ్యమంత్రి పలు ఆదేశాలు ఇచ్చారు."గతంలో రౌడీలు రాజకీయ పార్టీల్లోకి వచ్చినా పార్టీలు మద్దతు తెలిపేవి కావు. కానీ నేడు నేరస్తులే రాజకీయ ముసుగు వేసుకున్నారు. మొన్నటివరకు సోషల్ మీడియాలో ప్రత్యర్థులనువారి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇప్పుడు నియంత్రిస్తున్నాం. గత ఐదేళ్లలో కొందరు కళింకిత పోలీసు అధికారులు కూడా ఇష్టారీతిన వ్యవహరించి వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చారు. పోలీసులను శాంతి భద్రతల కోసం కాకుండా రాజకీయ నేతలపై కక్ష తీర్చుకోవడానికి గత ప్రభుత్వం ఉపయోగించుకుంది. గంజాయి, డ్రగ్స్ రాష్ట్రాన్ని హబ్‌గా మార్చేసింది. రాష్ట్రం నుంచే అన్ని చోట్లకు పంపిణీ జరిగేది. దీంతో నేరాల సంఖ్య పెరిగిపోయింది. గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయడంపైనా దృష్టిపెట్టాం. మీరు కూడా ఎక్కడా విధుల్లో రాజీ పడొద్దు. గంజాయి రవాణా, బెల్ట్ షాపులు నిర్వహణ, ఇసుక అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకోండి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సైబర్ నేరగాళ్లు కూడా రానున్న రోజుల్లో మీకు ఒక సవాల్ గా మారతారు. వారికంటే మెరుగ్గా ఆలోచించినప్పుడే నేరాలను అరికట్టగలుగుతారు. నేరస్తులకు మీరు ఎక్కడా అవకాశం ఇవ్వొద్దు. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు, తద్వారా ఉద్యోగాలు వస్తాయి. నా అంచనాలకు అనుగుణంగా మీరు పని చేయాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండాలి. గతంలో పోలీసులకు టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చాం. బాడీ ఓన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, వంటి పరికరాలు తెచ్చాం. తద్వారా నేరస్తులను గుర్తించడంతో నేరాల సంఖ్య తగ్గింది. కానీ గత ఐదేళ్లు వాటిని నిర్వీర్యం చేశారు. మహిళలు, చిన్నారులపై కొందరు మానవత్వం మరిచి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలి. అసాంఘిక కార్యకలపాలను కట్టడి చేయాలి అని సీఎం చంద్రబాబు చెప్పారు.

# ఉప్పుమిల్లిలో ఏడు కుటుంబాలను వెలివేసిన గ్రామ పెద్దలు

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 2(ప్రభాతవార్త):** కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో తు ట్టా దుర్గాప్రసాద్, కొన్ని కుటుంబాలను గ్రామంలో పెద్దలు దైవ కార్యక్రమాలకు పిలువకుండా వెలివేశారు. అనంతరం బాధితులు కాకినాడ జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లపాలెం ఎస్ఐ ఎం మోహన్, కాజులూరు మండలం ఎమ్మార్వో ఎల్ శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామ పెద్దలతో కలిసి చర్చలు జరిపి ఇరువర్గాల మధ్య రాజీ చేశారు. గ్రామంలో ఎటువంటి విభేదాలు లేకుండా తామంతా కలిసి ఉంటామని పోలీసులు సమక్షంలో హామీ ఇచ్చారు.


# నైరుతిలో రైలు మార్గం పనులు

### - అమరావతి ఎక్స్‌ప్రెస్ హుబ్లీ-వాస్కోల వరకు పాక్షిక రద్దు

**గుంతకల్లు రైల్వే,జనవరి 2,ప్రభాతవార్త** రాష్ట్రం మీదుగా వారానికి నాలుగురోజుల పాటు షాలిమార్-వాస్కోడగామా-షాలిమార్ మధ్య తిరిగే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను 52రోజుల పాటు హుబ్లీ-వాస్కోడగామా-హుబ్లీల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్,క్యాజల్ రాక్-కూలెం స్టేషన్ల మధ్య 26కి.మీ రైలుమార్గం మార్పిడికి సంబంధించిన పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నందున షాలిమార్-వాస్కోడిగామా-షాలిమార్ మధ్య తిరిగే నెంబర్ 18047/48అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను హుబ్లీ-వాస్కోడిగామాల మధ్య రైల్వే శాఖ పాక్షికంగా రద్దు చేసింది. షాలిమార్ నుంచి వాస్కోడిగామా వెళ్లే నెంబర్ 18047అమరావతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16నుంచి ఏప్రిల్ 15వరకు హుబ్లీ-వాస్కోడగామాల మధ్య పాక్షికంగా రద్దు చేయగా,వాస్కోడగామా నుంచి షాలిమార్ వెళ్లేనెంబర్ 18048అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 19నుంచి ఏప్రిల్ 18వరకు వాస్కోడగామా- హుబ్లీల మధ్య పాక్షికంగా రద్దు చేశారు. దీంతో ఈ రైలు సర్వీసులు షాలిమార్-హుబ్లీ-షాలిమార్ మాత్రమే తిరుగుతాయి.

# తిరుమల సమాచారం

## ప్రాణదానట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందించి పేదలకు వైద్యసేవలు అందించేందుకు సహకరిస్తున్నారు. గురువారం తిరుపతికి చెందిన రైల్వేవిభాగం మాజీ సిటిటిఐ కుప్పాల గిరిధర్‌కుమార్ 10లక్షలు రూపాయలు విరాళాలను టిటిడి ఎస్వీ ప్రాణ దానట్రస్ట్‌కు అందించారు. ఈ విరాళాల డిడిని ఆయన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. టిటిడి ఎందరికో విశిష్ట వైద్యసేవలు,ఆరోగ్యప్రసాదినిగా ఉన్న స్విమ్స్‌కు ఈ విరాళాలు వ్యయం చేయడానికి వినియోగించనుంది.

## 15నుండి 'కౌసల్యాసుప్రజా రామా' సుప్రభాతం పునఃప్రారంభం

### - వేకువజామున శ్రీనివాసుడిని మేల్కొలపనున్న అర్చకులు

**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారు జామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్ర నుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ బుధవారం నుండి పున: ప్రారంభం కానుంది. ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపధ్యంలో 15వతేదీ కనుమపర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తతే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవను గృహస్థ భక్తులను అనుమతినిస్తారు. అలాగే 15వతేదీ బుధవారం తిరుమలలోని పార్వేటమండపంలో పార్వేట ఉత్సవం జరుగుతుంది. కనుమపండుగ రోజు శ్రీనివాసుడు వేటకు వెళ్ళడం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని తిరుమల ఆలయ అర్చకులు కొనసాగిస్తారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుపతి,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం నిర్వహించారు. 10వతేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి అన్నిటినీ పవిత్ర జలంతో శుద్ధిచేశారు,. ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 9.30గంటలనుండి సర్వదర్శనంలో స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఏపి శ్రీనివాసదీక్షితులు, ఆలయ ఎఇఒ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## మళ్లీ వెంకన్న ఆలయంపై విమానం - భక్తుల ఆగ్రహం

**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నిలయమైన ఆనందనిలయంపై విమానాలు ప్రయాణించరాదని నిబంధనలు ఉన్నా ఇవేమీ పట్టవన్నట్లు విమానయానశాఖ చూస్తూ ఉండటంతో ఇటీవల కాలంలో రోజూ విమానాలు ఆలయం మీదుగా ప్రయాణిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం ఓ విమానం శ్రీవారి ఆలయం మీదుగా ప్రయాణించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఖానస ఆగమం ప్రకారం తిరుమల ఆలయ భద్రత దృష్ట్యా, నిబంధనల ఏరకు విమానాలు ఆలయంమీదుగా వెళ్ళరాదు. గతంలో విమానయానశాఖ కూడా ఈ నిబంధనలు పాటించేది. గత ఐదేళ్ళగా ఇప్పుడు కూడా తిరుమల ఆలయంపై విమానాలు వెళ్ళడంభద్రత కారణాలు లేకపోలేదని చెబుతున్నారు. గురువారం విమానం వెళ్లడాన్ని ఆలయ అర్చకులు, పండితులు, భక్తులు తప్పుపట్టారు.రాష్ట్రానికి చెందిన కేంద్ర విమానయానశాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ఈ విషయంపై అధికారులతో చర్చించి ఆలయం మీదుగా విమానాలు వెళ్ళకుండా చూడాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

# కోటి మంది కార్యకర్తల బీమాకు అవగాహన ఒప్పందం

### - యునైటెడ్ ఇండియాతో పార్టీ తరపున లోకేష్ ఎంఒయు

### - జనవరి 1నుంచే ఇన్సూరెన్స్ కవర్ అయ్యేలా అగ్రిమెంట్




**మంగళగిరి,జనవరి 2,ప్రభాతవార్త :** మరికొద్దిరోజుల్లో సభ్యత్వ నమోదు చారిత్రాత్మక మైలురాయిని చేరుకోబోతున్న నేపధ్యంలో కోటిమంది కార్యకర్తలకు ప్రమాద భీమా కలి ్పంచేలా పార్టీ జాతీయ ప్రధనా కార్యదర్శి నారా లోకేష్ ఇన్సూరెన్స్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు మంత్రి లోకేష్,యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్,ప్రాగ్మాటెక్ ఇన్సురెన్స్ బ్రోకింగ్ ప్రతినిధులు ఎంఒయు పై సంతకాలు చేశారు.కోటిమంది కార్యకర్తల కోసం ఒకేమారు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రధమం,ఒప్పందం ప్రకారం జనవరి 1,2025 నుంచి డిసెంబర్ 31,2025 వరకు కోటిమంది కార్యకర్తల భీమాకోసం తొలివిడతలో రూ.42కోట్లు పార్టీ చెల్లించింది.వచ్చే ఏడాది కూడా దాదాపు ఇదే మొత్తం ప్రీమియం సొమ్మును పార్టీనే చెల్లిస్తుంది.ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద భీమా లభిస్తుంది.కార్యకర్తల సంక్షేమనిధి సారధిగా యువనేత నారా లోకేష్ బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు.కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటివరకు రూ.138కోట్లు ఖర్చుచేశారు.గత అరాచక ప్రభుత్వం కేసుల్లో ఇరుక్కున్న కేడర్ కోసం న్యాయవిభాగాని ్న ఏర్పాటుచేశారు.వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్ ను ఏర్పాటుచేశారు.మృతి చెందిన కార్యకర్తల పిల్లలకోసం హైదరాబాద్‌తో పాటు కృష్ణాజిల్లా చల్లిపల్లిలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున రెసిడెన్షియల్ స్కూళ్ళు ఏర్పాటుచేసి ఉచితంగా విద్య నందిస్తున్నారు.కుటుంబ సభ్యుల మాదిరి పార్టీ కేడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు లోకేష్ చేస్తున్న కృషిపై కార్యకర్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి,

# ఒక్క రోజే రూ.200కోట్లు లిక్కరు లాగించేసిన మద్యం ప్రియులు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం ఏరులై పారింది. డిసెంబర్ 31వ తేదీ ఒక్క రోజే మందుబాబులు దాదాపు రూ.200 కోట్ల రూపాయల విలువైన మద్యాన్ని తాగేశారు. 60 లక్షల మద్యం క్వార్టర్లు, 18 లక్షల బీర్లు ఖాళీ చేసేశారు. మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బుల్లో నిర్దేశిత సమయం కంటే అదనంగా మరో 2 గంటలపాటు విక్రయాలకు ఈ సారి ప్రభుత్వం అనుమతిచ్చింది. మొత్తంగా 14 గంటలపాటు మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ లెక్కన గంటకు సగటున దాదాపు రూ.14.28 కోట్ల విలువైన మద్యం అమ్మారు. నూతన సంవత్సర వేడుకల కోసం సాధారణంగా మూడు రోజుల ముందు నుంచే డిపోల నుంచి మద్యాన్ని దుకాణాలకు చేరవేస్తుంటారు. అందులో భాగంగా ఈ సారి డిసెంబర్ 30, 31వ తేదీల్లో రూ.331.85 కోట్ల విలువైన మద్యం దుకాణాలకు చేరింది. 4,10,192 కేసుల ఐఎంఎల్, 1,61,241 కేసుల బీర్లు చేరాయి. అందులో 2.50 లక్షల ఐఎంఎల్ కేసులు, 75,000ల బీరు కేసులు 31వ తేదీ ఒక్క రోజు అమ్ముడైనట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దాని విలువ దాదాపు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణంగా రోజుకు రూ.80 కోట్ల రూపాయల విలువైన మద్యంను డిపోల నుంచి దుకాణాలకు తరలిస్తారు. కానీ నూతన సంవత్సరం సందర్భంగా అందుకు రెండు రెట్లు అధికంగా మద్యాన్ని తరలించారు. జిల్లాల్లో మద్యం దుకాణాలు, బార్లు, స్టార్ హోటళ్లు 236 ఉన్నాయి. నూతన సంవత్సరం వేడుకలు పురస్కరించుకుని నిబంధనలను సడలించి డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు అనుమతి ఇవ్వడంతో మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. రోజూ జరిగే విక్రయాల కంటే రెట్టింపు స్థాయిలో నమోదయ్యాయి. రెండు జిల్లాల్లోని మద్యం దుకాణాల్లో 39,481 ఐఎంఎఫ్‌ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) కేసులు విక్రయించారు. 10,006 బీరు కేసులు లాగించేశారు. వీటి విలువ రూ.36.74 కోట్ల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# అసౌకర్యం లేకుండా భక్తులకు దర్శనాలు

### - పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణపై పరిశీలన



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వతేదీ నుండి 19వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను భక్తులకు సౌకర్యవంతంగా కల్పించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు, అదనపు సౌకర్యాలు కల్పించడంలో టిటిడి విజిలెన్స్,టిటిడి ఉద్యోగులు పోలీసులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ఈ ఏడాది భక్తులకు అదనంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలా స్థలాలను సిద్ధంచేయడం, టిక్కెట్, టోకెన్ కలిగిన భక్తులను క్యూలైన్లలోనికి నిర్ధేశిత సమయం ప్రకారం అనుమతించడం అంశాలపై గురువారం ఉదయం తిరుమలలో టిటిడి సివిఎస్ఒ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, టిటిడి విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్ ,అల్లం సురేంద్ర, సిఐలు విజయకుమార్, రాముడు సిబ్బందితో కలసి పరిశీలించారు. పదిరోజులు ముక్తిద్వారం కోసం తరలివచ్చే భక్తులకు సురక్షిత దర్శనం, ప్రశాంత వాతావరణం కల్పించడంలో పోలీసులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వాహనాల పార్కింగ్, చిన్న వాహనాల ప్రవేశానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, దర్శనం కోసం వచ్చిన భక్తులకు సాఫీగా క్యూలైన్ల నిర్వహణ, రద్దీ ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది నియామకం, భక్తుల రద్దీ చేరినా తగినట్లు సామర స్యంగా వ్యవహ రించి నియం త్రించడం, టోకెన్, టిక్కెట్ లేని భక్తులను తిరు మలపైకి మాత్రమే అనుమతించడం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈ పదిరోజులు ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది అంకిత భావంతో నిబ్ధదతో పనిచేయాలని, వైకుంఠద్వార దర్శనాలను ప్రశాంతంగా ముగించేలా చూడాలని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి కోరారు.ఆలయంలో భక్తులకు మహాలఘు దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్దం చేశామని, అందుకు తగ్గట్లు పనిచేయాలన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో సామాన్యభక్తులకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.40లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను పదిరోజులకు 16,500 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేయడం జరిగిందన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వారం తెరచి ఉంచే జనవరి 10నుండి 19వరకు పదిరోజులు పాటు సిఫార్సులేఖలు స్వీకరించడం లేదని టిటిడి ప్రకటించింది. తదనుగుణంగా సామాన్యభక్తులకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తున్నారు. అంతేగాక టిక్కెట్, టోకెన్లు లేని భక్తులను ఆలయం లోపలకు అనుమతించరు.

# ఖో ఖో ప్రపంచ కప్ పోస్టర్ ఆవిష్కరించిన క్రీడల మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### - ఢిల్లీలో అట్టహాసంగా మొట్ట మొదటి ఖోఖో ప్రపంచ కప్ వేడుక



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఖోఖో అసోషియేషన్ సభ్యులు

**విజయవాడ, జనవరి,02,ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్ వేదికగా జనవరి 13-19వ తేదీల మధ్య ఖో ఖో ప్రపంచ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సచివాలయంలోని రవాణా, యువజన, క్రీడాలశాఖ మంత్రి వారి కార్యాలయంలో అద్దంకి మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఖో ఖో అసోసి చైర్మన్ బీ.సీహెచ్ గరటయ్య అధ్వర్యంలో ఖో ఖో ప్రపంచ కప్ పోస్టర్ ను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. దేశ రాజధానిలో ప్రపంచ కప్ ఖోఖో నిర్వహిస్తుండటాన్ని మంత్రి ప్రశంసించారు. ఈ ఆట ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుండటం చూసి ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు విశేష ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.క్రీడాకారులకు ఉద్యోగ,విద్యావకాశాలు ప్రత్యేకతలను కల్పించినట్లు తెలిపారు.ఖోఖో శారీరక దారుఢ్యాన్ని పెంచడంతో పాటు,మానసిక వికాసాన్ని అందిస్తోందన్నారు.ఆటగాళ్ళ సమయ స్ఫూర్తికి ఈ ఆట ఒక నిదర్శనమన్నారు.అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే జాతీయ జట్టులో మన వాళ్ళు పాల్గొనడం జరిగిందన్నారు.ఈ ఆటలో రాష్ట్ర క్రీడాకారులు మంచి ప్రతిభ కలిగిన వారున్నారన్నారు. వారం రోజుల పాటు జరిగే ఖో ఖో ప్రపంచ కప్‌లో టోర్నమెంట్‌లో 21 పురుషుల, 20 మహిళల జట్లు పోటీపడతాయి. మొత్తం 24 దేశాల జట్లు టోర్నమెంట్ కోసం భారత్‌కు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖో ఖో అభిమానులకు ఈ ఆటలోని అనుభవాన్ని ఈ టోర్నమెంట్ అందించనుందని, ఆటగాళ్లందరికీ సమాన అవకాశాలను అందించడంపై దృష్టి సారిస్తోందని అందుకే, పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన వేదికను ఏర్పాటు చేశామని ఛైర్మన్ తెలిపారు.అనంతరం మంత్రిని ఖోఖో అసోషియేషన్ బాధ్యులు సన్మానించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జమ్మూ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్

### - భారతీయ రైల్వే చిత్రపటంలో మరో డివిజన్

### - డిపిఆర్ సమర్పించమని ఆదేశించిన కేంద్రం

**గుంతకల్లు రైల్వే,జనవరి 2,ప్రభాతవార్త** భారతీయ రైల్వే రికార్డు పుట్టల్లో మరో కొత్త డివిజన్ ఎక్కనుంది. ఇందుకు సంబంధించిన రైల్వే మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు సమగ్ర నివేదికను(డిపిఆర్)ను సిద్ధం చేసి పంపమని నార్థన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే ప్రస్తుతం భారతీయ రైల్వే 17జోన్లు ఉండగా వీటిలో మొత్తం 68డివిజన్లు ఉన్నాయి. నార్థన్ రైల్వే జోన్ పరిధిలో అంబలా,ఢిల్లీ, ఫిరోజ్‌పూర్,లక్నో,మురాదాబాద్ డివిజన్‌లు పనిచేస్తున్నాయి. వీటిలో పంజాబ్,జమ్ముకాశ్మీర్,హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి మొత్తం 1,849.95రూట్ కి.మీ ఫిరోజ్‌పూర్ డివిజన్ పనిచేస్తోంది. కొత్తగా జమ్మూడివిజన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే నిర్ణయించడంతో రైల్వే బోర్డు సమర్థత,పరిశోధన విభాగం ప్రత్యేక సంచాలకులు సంజీవ్ కుమార్ ఈమేరకు నార్థన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత జమ్మూ రైల్వే డివిజన్‌లో,ఫిరోజ్ పూర్ డివిజన్ పరిధిలోని 742.1కి.మీను విడదీసి జమ్మూకేంద్రంగా కొత్తగా రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పునర్ వ్యవస్థీకరణలో ప్రస్తుతం ఫిరోజ్ డివిజన్ పరిధిలో 21సెక్షన్‌లు ఉండగా వాటిలో నుంచి పఠాన్ కోట్-జమ్ము-ఉద్ధంపూర్-శ్రీనగర్- బారాముల సెక్షన్‌లోని 423రూట్ కి.మీతో పాటు భోగ్‌పూర్-సర్వాల్-పఠాన్ కోట్ సెక్షన్‌లోని 87.21రూట్ కిలోమీటర్లు, బటలా-పఠాన్ కోట్ సెక్షన్‌లోని 68.17రూట్ కి.మీలు,పఠాన్ కోట్-జోగింధర్ నగర్(నారోగేజ్)సెక్షన్‌లోని 163.72రూట్ కి.మీలు వెరసి మొత్తం 742.1కి.మీతో జమ్మూ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు. నార్థన్ రైల్వే జోనన్ పరిధిలో ప్రస్తుతం ఐదు డివిజన్‌లు ఉండగా కొత్తగా ఏర్పడనున్న జమ్మూ డివిజన్‌తో వీటి సంఖ్య ఆరుకు చేరనుంది. ఇందుకుగాను భౌగోళిక సరిహద్దులతో సమగ్ర సమాచారం వివరాలతో కూడిన నివేదికను(డిపిఆర్)ను సమర్పించమని ఆయన నార్థన్ రైల్వే జీఎంను ఆదేశించారు. ఇదిలా ఉండగా కొత్త డివిజన్ ఏర్పాటుతో గ్రూప్-సి,గ్రూప్-డి క్యాడర్ ఉద్యోగుల సంఖ్యలో ఆప్షన్స్,బదిలీలు తప్ప పెద్దగా మార్పు ఉండదు. అయితే అధికారుల సంఖ్య మాత్రం పెరుగుతుంది. డిఆర్ఎం,అదనపు డిఆర్ఎం, కమర్షియల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ నిర్వహణ, ఎలక్ట్రికల్ టిఆర్‌డి,ఎలక్ట్రికల్ టిఆర్ఎస్ఓ,విద్యుత్ లోకో, మెకానికల్ సిఅండ్‌డబ్ల్యు,మెడికల్, ఆపరేటింగ్, పర్సనల్,అకౌంట్స్,భద్రతా, స్టోర్స్ ,సెక్యూరిటీ, ఎస్అండ్‌టీ,నిర్మాణాలు వంటి వాటితో కలిపి దాదాపుగా 17విభాగాలకు సంబంధించిన జేఏగ్రేడ్,సీనియర్ స్కేల్, గ్రూప్-బి అధికారుల పోస్టుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

# పోలీస్ ఫిజికల్ టెస్టులో తీవ్ర విషాదం

### పరుగు పందెంలో యువకుడు మృతి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధిం** కృష్ణా జిల్లాలో కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహించిన పోలీస్ ఫిజికల్ టెస్టులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మచిలీపట్నంలో నిర్వహించిన పరుగు పందెంలో ఓ యువకుడు మృతి ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరుకు చెందిన దారావత్తు చంద్రశేఖర్(25) 1600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# మిషన్ వాత్సల్య పథకం అమలుకు రాష్ట్ర, జిల్లా, పట్టణ, గ్రామ స్థాయిల్లో కమిటీలు:సూర్యకుమారి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మిషన్ వాత్సల్య పథకం అమలు కోసం రాష్ట్ర, జిల్లా, పట్టణ,గ్రామ స్థాయిల్లో పలు కమిటిలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ అధ్యక్షతన మరో 13 మంది సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ ఉంటుందని, ఈ కమిటీ పథకం అమలు, ఇతర అంశాలను ప్రతి 6 నెలలకోసారి సమావేశమై పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన మరో 13 మంది సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర శిశుసంక్షేమ, రక్షణ కమిటీ ఉంటుందన్నారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై పథకం అమలుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు, ఆర్థిక, వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 15 మంది సంబంధిత శాఖల అధికారులతో జిల్లా శిశు సంక్షేమ, రక్షణ కమిటీని ఏర్పాటవుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఉంటే స్టాండింగ్ కమిటీ/సబ్ కమిటీలు ఈ పథకం అమలును పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన అధికారులు, వార్డు స్థాయిలో పర్యవేక్షించాలి.

వార్త

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.

న-ప్లినీ

# రైతు నామ సంవత్సరమేనా?

ఆలస్యంగానైనా కర్షకుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ముందుకు అడుగులు వేయడం హర్షించదగ్గ పరిణామం. ఆంగ్లసంవత్సరాది ఆరంభం నుంచే కేంద్రం అన్నదాతలను ఆదుకునేందుకు కొత్త నిర్ణయాలు ప్రకటించింది. ఒకపక్క ఢిల్లీ, పంజాబ్ సరిహద్దుల్లో రైతులు ఆందోళన చేస్తున్న సమయంలో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు రైతులకు ఊరటనిచ్చేవిగా కన్పిస్తున్నాయి. కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ కేబినెట్ వివరాలను బుధవారం మీడియాకు వివరించారు. వ్యవసాయానికి కీలకమైన డై అమోనియా ఫాస్ఫేట్ ఎరువుపై అదనపు రాయితీ కింద మూడు వేల ఎనిమిదివందల యాభై కోట్ల రూపాయలు వన్‌టైమ్ ప్యాకేజీగా ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ అన్నదాతలకు ఎంతో ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా రైతులకు బాగా అవసరమయ్యే డిఎపి ధరలు పెరుగుతాయని ప్రచారం జరుగుతున్న దశలో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం కారణంగా బస్తా పదమూడువందల యాభై రూపాయలకే అందుబాటులో ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ధర భారం రైతుల మీద పడకుండా రాయితీ రూపంలో ఆ భారాన్ని ప్రభుత్వమే భరించబోతున్నది. ఈ నిర్ణయం బుధవారం నుండే అమలులోకి వచ్చి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు అమలులో ఉంటుందని మంత్రి ప్రకటించారు. ప్రధానమంత్రి పంటల బీమా పథకం (పిఎంఎఫ్‌బివై) పునర్వ్యవస్థీకృత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలును 15వ ఆర్థిక సంఘం పదవీకాలానికి అనుగుణంగా కొనసాగించేందుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికోసం 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం మధ్యకాలానికి కేటాయింపులను అరవైతొమ్మిదివేల కోట్లకుపైగా పెంచింది. ఈ పథకం అమలు చేస్తున్న రాష్ట్రాల్లో పండించే పంటలకు ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించేందుకు వీలవుతుంది. పంటల బీమా పథకం అమలులో పారదర్శకత పెంచి క్లెయిమ్ పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ఎనిమిది వందల ఇరవైనాలుగు కోట్లతో 'నవకల్పనలో సాంకేతిక నిధి' ఏర్పాటు చేయడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాలు మాత్రమే ఉపయోగిస్తుండగా మిగితా రాష్ట్రాలకు కూడా దీన్ని విస్తరించనున్నారు. బుధవారం కేబినెట్‌లోతీసుకున్న నిర్ణయాలు అమలైతే రైతన్నలకు ఎంతో కొంత ఊరట లభిస్తుంది. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే రైతులు మనకు గర్వకారణమని, 2025 యేడాదిలో మొదటి కేబినెట్ భేటీని రైతుల శ్రేయస్సుకు అంకితం చేశామని, వారి విషయంలో కీలకనిర్ణయాలు తీసుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఎక్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెలిబుచ్చారు. వాస్తవంగా ఎన్నో ఆటుపోట్లతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్న వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ఈప్రయత్నాలను సమర్థించాల్సిందే. అయితే ఏమేరకు ఈ నిర్ణయాలు త్రికరణశుద్ధిగా అమలవుతాయి? నష్టాల ఊబినుండి వ్యవసాయరంగం బయటపడుతుందా? లాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మానవ జీవన పోరాటంలో విశ్వాసం అనేది ఎంతో ముఖ్యమైంది. ఆ విశ్వాసం దెబ్బతినే దేశంలో అన్నంపెట్టే రైతన్నలేఆత్మ గౌరవంచంపుకోలేక తమను ఆదుకునేవారు లేరనినిరాశ నిస్పృహలతో తమలో తాము కృశించి, మరోగత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఆత్మాహుతులైపోతున్నారు. గతంలో ఎందరో నేతలు ఎన్ని మాటలుచెప్పినా, ఎన్ని వాగ్దానాలు చేసినా ఈ మారణహోమం ఆగడంలేదు. రైతుల సంక్షేమమేపాలకుల ధ్యేయమని ఎంతగా చెప్తున్నా మరెన్ని కార్యక్రమాలు చేపడుతున్నా రైతులు అంతగా విశ్వసించలేకపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ లాంటి పథకాలు ఏ మేరకు ప్రవేశ పెట్టినా, ఎన్నివేల కోట్లు వెచ్చించినా రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోతున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం మెరుగుపడకపోగా మరింత దిగజారుతుంది. రోజురోజుకు అన్నదాతలు అప్పుల సుడిగుండంలో దిగబడిపోతున్నారు. వాతావరణంలోసంభవిస్తున్న మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మానవ పీడిత చర్యలవల్ల పర్యావరణ విధ్వంసం చోటు చేసుకోవడంతో ఆ పరిణామాలు మానవాళిపై పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయరంగం కోలుకోలేకుండాపోతున్నది. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర గిట్టుబాటు కావడంలేదు. పెరిగిన పెట్టుబడి ధరలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పొంతన లేకుండాపోతున్నది. ఏదిఏమైనా విధానాల అమలులో ఉన్న లోపాల కారణంగా వ్యవసాయరంగం కుదేలవుతున్నమాట కాదనలేని వాస్తవం. ఒకపక్క అభివృద్ధిచెందిన సాంకేతిక పరి జ్ఞానం, పరికరాలు, లెక్కకు మించిన ప్రోత్సాహకాలతో ఆయాదేశాల రైతులు ఉత్పత్తుల్లో ముందుకు దూసుకుపోతుంటే మనదేశంలో కాలం చెల్లిన వంగడాలు, ప్రోత్సాహకాల కొరతతో రైతులు కుదేలవుతున్నారు. పథకాలు ప్రకటించడంలోనే కాదు అవి రైతులకు ఏమేరకుప్రయోజనకరంగా ఉన్నాయో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా వారికున్న ఒక్క ఉపాధిని వారి పాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

> దిగజారడం ప్రారంభించనేకూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.



హెచ్.లాంగ్‌ఫెలో

> చేయక తప్పని పనిలో కూడా జాప్యం చేస్తే కాలం ఆ పనిని నిస్సారంగా మార్చివేస్తుంది.



జి.ముర్రే

# ప్రజావాక్కు



### సీనియర్ సిటిజన్ల సమస్యలు తీర్చాలి

సంవత్సరాలు కాలగర్భంలోకలిసిపోతున్నాయి.సీనియర్ సిటిజన్లన్యాయమైన కోరికలుకొండెక్కిపోతున్నాయి. ముఖ్యంగా కొన్నింటిని కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలి.మొదటిది రైళ్లలోతిరిగి టిక్కెట్ ధరలలో రాయితీలుపునరుద్ధరించాలి.రెండవదిఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణాలో మాత్రం డెలివరీ కావడం లేదు. పక్కనున్న ఆంధ్రలోఇస్తున్నారు.ఇక అతి ముఖ్యమైనది, జీవించడానికి అవసరమైనది ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 95వలన గతపాతికేళ్లగా పొందుతున్న వెయ్యి రూపాయల పెన్షన్ను పదివేలకు పెంచాలి. ఇందుకోసం ఎన్నో విన్నపాలు ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వంలో ఏ మాత్రంకదలిక రాలేదు.ఈనూతన సంవత్సరంలో సీనియర్‌సిటిజన్లకుఅంతామంచేజరుగుతుందని ఆశిస్తున్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అమలు అవుతున్న పురా ప్రణాళిక

2007లో కలాం ప్రతిపాదించిన పురా ప్రణాళిక అమలు అవుతున్నట్టే కనిపిస్తున్నది.అంతమాత్రమేకాదు దేశంలోని పల్లెలకుఅనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణం పెద్ద ఎత్తున ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో జరగడం ఒకగుణాత్మకమార్పు.ఇకపోతే ఇది వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసమే తెచ్చిన ఎలెక్ట్రోనామిక్ నాము మార్కెట్లు పథకంకి వస్తుంది. ఇక నియోజవర్గాలలో మెడికల్ కాలేజీల ఫార్మేషన్ ఇంజనీరింగ్ కాలేజీలు ఫార్మేషన్ చేయడం ద్వారా విద్యకిందిస్థాయీ లేదా గ్రామీణస్థాయీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారావిద్య అందుబాటులోకి రావడంద్వారా నైపుణ్యఅభివృద్ధి కేంద్రాల స్థాపనతోమౌలికసదుపాయాలుగ్రామాలకూడా విస్తరించాయి.

-భారత అవినాష్, జనగామ

### క్షేత్ర స్థాయి పర్యటనలు అవశ్యం!

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌నెలలో పద్నాలుగు రోజులు పేషీసిబ్బందితో సహాక్షేత్రస్థాయిపర్యటనలకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. పదవిచేపట్టిన ఆరు నెలలలోనే క్షేత్రస్థాయిలో పర్యటనలుచేస్తేనే సమస్యలు పరిష్కారంఅవుతాయన్న వాస్తవాన్నితెలుసుకోవడం సంతోషకరం.ముఖ్యమంత్రితో సహామంత్రులందరూ ఈ విధంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### మితిమీరిన వేగం

ఈ మధ్య కాలంలో యువత బైక్ లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేకప్రమాదాలకు కేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్ర రవాణా శాఖ వారు ఎన్ని పెట్టినా వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయువేగంతో తమమోటార్ బైక్‌లను నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.దీనితోపాటు వేగ నిబంధనలను అతిక్రమించడం,సెల్‌ఫోన్ డ్రైవింగ్, ముగ్గురు, నలుగురు ప్రయాణించడం వంటివి సర్వసాధారణమైపోయాయి. ఇటువంటి విన్యాసాల వలన అటు వారి ప్రాణాలను ప్రమాదపు అంచుల్లోకి తీసుకుపోవడమే గాక ఇటు రోడ్డు మీద నడిచే పాదచారులను, వాహనాలపై ప్రయాణించే ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టి వేస్తుండటం శోచనీయం. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తుల కోసం ప్రభుత్వం మరింత కఠినమైనచట్టాలను ఆమోదించాలి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### తీరు మారని యాజమాన్యాలు

జీహెచ్ఎంసీ ఆహార భద్రతా అధికారులు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఎన్నిసార్లు తనిఖీలుచేసినా వాటి తీరుమారటం లేదు. కుళ్లిపోయిన కూరగాయలు, కుళ్లినమాంసం, కాలంచెల్లిన మసాలాలు వాడుతున్నారు. కొన్ని ఆహార పదార్థాలలో సింథటిక్ ఫుడ్ కలర్స్ కలుపుతున్నారు. కిచెన్‌లో బొద్దింకలు, యధేచ్ఛగా సంచరిస్తున్నాయి. కిచెన్ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండి అక్కడే ఆహారాన్ని తయారుచేస్తున్నారు. హోటళ్ల యాజమాన్యాలు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారు.కనీసం ఇప్పటికైనా తీరు మార్చుకొని కస్టమర్లకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి ఇవ్వాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### కబ్జాకు గురైన ఇళ్ల స్థలాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశం ఈ జనవరి 4వ తేదీన జరగనున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగుల ఇండ్లస్థలాలనుకబ్జాచేసిన వారినుండి తిరిగి ఇప్పించాలి. వికలాంగుల ఇండ్ల స్థలాలలో దౌర్జన్యంగా మరుగుదొడ్లు స్నానపు గదులునిర్మించారు. అయినా కూడా 2 సంవత్సరాలు గడుస్తున్నా కూడా భూకబ్జాదారులు నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించడం లేదు.

-రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చదువుల భారంతో పెరుగుతున్న ఆత్మహత్యలు!

**విద్యార్థుల ప్రవర్తనను, వారి కదలికలను, ఆలోచన సరళిని అనుక్షణం గమనిస్తుండాలి. వారి బలాలను బలహీనతలను గమనించి వారికి సరైన దిశలో ప్రోత్సాహం కల్పించాలి. భాషా శాస్త్రాలను గుర్తెరిగేలా చేయాలి. సంగీతం, నాట్యం, చిత్రలేఖం లాంటి కళలు వారికి మానసిక వికాసాన్ని కలుగజేస్తాయి. వాటిలో తప్పని సరిగా ప్రతి విద్యార్థి పాల్గొనేలా చేయాలి. కళాశాల విద్యా స్థాయికి వచ్చిన విద్యార్థులకు కూడా దినపత్రికలు చదవడం లేదా మంచి పుస్తకాలు చదవడం అలవాటు కావడంలేదు.విద్యార్థి ఆసక్తులు అభిలాషలను గుర్తించి ఆ విషయాల్లో వారికిశిక్షణ ఇవ్వాలి. లేకపోతే విద్యార్థి ఎటు కాకుండా అవుతాడు. కొన్నిసార్లు సమాజానికి భారం అవుతాడు. సంఘవ్యతిరేక శక్తి కూడా కావచ్చు. అలాంటి విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత నేటి ఉపాధ్యాయులదే.**

శ్రీశ్రీ కుమార్

నేటి సమాజంలో మారుతున్న పరిణామ క్రమంలో సామాన్యుడికి లేదా మధ్య తరగతి మానవుడికి ఎక్కువగా విద్య మీదనే ఖర్చు చేయవలసి వస్తుంది. దీని కోసం ఎన్నీ అప్పులైనా చేయడానికి ప్రజలు వెనకాడడం లేదు. విద్య మానవ వనరులను పెంచేది కానీ కొంతకాలంగా అది ప్రాణాలను తుంచి వేయడల మనం చూస్తున్నాం. విద్యార్థులు అనేక కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డం సమాజానికి చేటు కాగా వారి తల్లిదండ్రులకు తీరని లోటు. ఎన్నో ఆశలు ఆకాంక్షలు పెట్టుకొని తమ పిల్లలను చదివిస్తుంటే వారు తమ చేతికి అందక చదువు తనువు చాలించితే ఆ తల్లిదండ్రుల కడుపు తీపీ తీర్చడం ఎవరి తరంకాదు. తమ పిల్లలు వృద్ధిలోనికి రావాలనుకోవడం తప్పుకాదు. కానీ వారి స్థాయికి మించి ఒత్తిడి పెంచితే వచ్చే వికృత ఫలితమే ఆత్మహత్య, పుట్టిన ప్రతివాడుఐఐటి చదవలేడు లేదా డాక్టర్ కాలేడు. కానీ తల్లిదండ్రులు పిల్లల చిన్ననాటి నుండివారిపై ఆ రకమైన ఆలోచన రుద్దటం ఆరోగ్యకరం కాదు. పిల్లవాడి స్థాయి, ఆశయాలు కూడా చాలా ముఖ్యమైనవి అని తల్లిదండ్రులు గుర్తించాలి. ఎక్కడైతే పిల్లల ఆశయాలు తల్లిదండ్రుల ఆశలు విరుద్ధంగా ఉంటాయో దాని పర్యవసానం మనం చూస్తున్న దుష్ఫలితాలే. పాఠశాల లేదా కళాశాలలో పరిస్థితులు లేదా ఒత్తిడి కూడా కొన్నిసార్లు తీవ్ర పరిణామాలకు దారితీయడం మనం చదువుతున్నాం. ట్రిపుల్ ఐటీ బాసరలో 25మంది దాకా విద్యార్థులు రకరకాల కారణాలకు బలయ్యారు. దీనికి ఎక్కువగా పరిపాలనాపరమైన, వ్యవస్థాపరమైన కారణాలు ఉన్నాయి. కానీ వాటిఫలితంగా విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్తు మొగ్గ దశలోనే తుంచి వేయబడుతున్నది. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన స్పర్థఉండాలి గానీ అవి మనస్పర్థలకు, తీవ్ర పరిణామాలకు దారి తీయకూడదు. అదేవిధంగా దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలలో కూడా విద్యార్థులు తమపై ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు మనకు విదితమే. కారణాలుఏమైనా కావచ్చు కానీ రాలు తున్నవి మాత్రం విద్యార్థుల విలువైన ప్రాణాలు. ఇక గురు కుల విద్యాలయాల్లో కూడా ప్రతి సంవత్సరం మరణాలు సంభవిస్తున్నాయి. నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుందని ఆశతోను తమ పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుం దన్న ఆకాంక్షతోను గురుకులాల్లో అక్కడి కలుషిత ఆహారం, సౌకర్యాలు లేమి, చిన్న వయసులోనే హాస్టల్ జీవితానికి అలవాటు పడలేక విద్యా కుసుమాలు రాలిపోతున్నాయి. కొన్నిచోట్ల ర్యాగింగ్ విద్యార్థులమధ్య ఘర్షణలు కూడా కారణభూతం కావడం దారుణం. కార్పొరేట్ విద్య ప్రతి సంవత్సరం విద్యార్థుల ఆత్మహత్యలకు దారి తీస్తున్నది. అప్పు చేసి తల్లిదండ్రులు లక్షలకొద్ది ఫీజులు చెల్లిస్తూ తమ పిల్లల భవిష్యత్తును ఊహించుకుంటున్నారు. సమయానికి డబ్బులు చెల్లించకపోతే కళాశాల



యాజమాన్యం బెదిరింపులు, హాల్ టికెట్ ఇవ్వడానికి నిరాకరించడం పరీక్షల ముందు విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నా యి. పరీక్షా ఫలితాల తర్వాత కూడా మనం కొన్ని దుర్మరణాలు చదువుతాం. తాము అనుకున్న మార్కులు రాలేదనో, తల్లిదండ్రుల భయం, తోటి విద్యార్థులమధ్య అవహేళన అవుతామని ఆందోళన కానీ వారు తీవ్రమైన చర్యకు ఒడికట్టడం శోచనీయం. రాజస్థాన్ కోటలో ఉన్న ప్రసిద్ధ కోచింగ్ సెంటర్లో ప్రతి సంవత్సరం గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు దుర్మరణాలకు పాల్పడుతున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సులకు విపరీతమైన గిరాకీ. ఇక ఐదులేదా ఆరోతరగతి నుండి అలాంటి కోచింగ్ సెంటర్ వెలుస్తున్నాయి. వాటిలో చదివించడానికి తల్లిదం డ్రులు వెంపర్లాడుతున్నారు. వీరి ఆశలను సొమ్ము చేసుకోవ డం ఎలాగో కార్పొరేట్ విద్యాసంస్థలకు బాగా తెలుసు. విద్యార్థికి అతని వయసు, మానసిక స్థాయి పరిపక్వతకు మించిన విద్యా విషయాలను అతడిపై రుద్దే ప్రయత్నం జరుగుతుంది. రాబోయే సంవత్సరం సిలబస్ ఈ సంవ త్సరమే చెప్పడం ప్రారంభిస్తారు. విద్యార్థులకు ఆటపాటలు ఉండవు. వేరే రకమైనటువంటి కార్యక్రమాలు ఉండవు. సాంస్కృతిక కార్యక్రమాలు తెలియవు. తద్వారా మానసిక ఉల్లాసం, వికాసం కొరబడతాయి. స్నేహితులతో సరదాగా గడపడం, పెళ్లిళ్లకు హాజరు కావడం లాంటివి వారిపై ఒత్తిడి తగ్గిస్తాయి. వారు ఆహ్లాదకరంగా గడపగలుగుతారు. అప్పుడు వచ్చే మానసిక ఉత్తేజం వారిని చదువులో కూడా రాణింప చేస్తుంది. మిగిలిన రాష్ట్రాల్లో సామాజిక శాస్త్రాలు చదువులు బావులకు దారితీయడం సమాజం సిగ్గుపడాల్సి న విషయం. విద్య మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దాలి.అతన్ని పతనం చేయకూడదు. చిన్నతనం నుండి పిల్లలకు నీతి బోధలు నీతి కథలు చెప్పడం లేదు. వారిలో మానసిక ధైర్యం నూరిపోయడం లేదు.భాషలు ముఖ్యంగా మాతృభాష వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. కానీ మాతృభాషనుచిన్న చూపు చూడ్డం, సామాజిక శాస్త్రాల అవసరం లేదని ఒక దుష్టసంస్కృతి మూడు దశాబ్దాలుగా ప్రబలింది. ఫలితంగా విద్యార్థులలో నైతిక విలువలు, సామాజిక విలువలు పతన మవుతున్నాయి. మానవుడు సంఘజీవి అనే విషయం మరుగున పడింది. శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం అవసరమే అంత మాత్రాన ఇతర విషయాలను నిర్లక్ష్యం చేయమని కాదు. ఏవో కొన్నిచోట్ల మొక్కుబడిగా కౌన్సిలింగ్ క్లాసులు నిర్వహిస్తారు కానీ విద్యార్థి మానసిక వికాసానికి చర్యలు ఏమి చేపట్టరు. కొంతమంది విజయ గాథలు చెప్పి చేతులు దులుపుకోవడంకాదు. విద్యార్థుల ప్రవర్తనను, వారి కదలికలను, ఆలోచన సరళిని అనుక్షణం గమనిస్తుం డాలి. వారి బలాలను బలహీనతలను గమనించి వారికి సరైన దిశలో ప్రోత్సాహం కల్పించాలి. భాషాశాస్త్రాలను గుర్తెరిగేలా చే యాలి. సంగీతం, నాట్యం, చిత్రలేఖం లాంటి కళలు వారికి మానసిక వికాసాన్ని కలుగజేస్తాయి. వాటిలో తప్పని సరిగా ప్రతి విద్యార్థి పాల్గొనేలా చేయాలి. కళాశాల విద్యా స్థాయికి వచ్చిన విద్యార్థులకు కూడా దినపత్రికలు చదవడం లేదా మంచి పుస్తకాలు చదవడం అలవాటు కావడంలేదు. విద్యార్థి ఆసక్తులు అభిలాషలను గుర్తించి ఆ విషయాల్లో వారికిశిక్షణ ఇవ్వాలి. లేకపోతే విద్యార్థి ఎటుకాకుండా అవుతాడు.కొన్ని సార్లు సమాజానికి భారం అవుతాడు. సంఘ వ్యతిరేక శక్తి కూడా కావచ్చు. అలాంటి విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత నేటి ఉపాధ్యాయులదే. ●

# ప్రభుత్వ పథకాలతో రైతన్నకు ఊరట లభించేనా?

డాక్టర్ కందగట్ల శ్రవణ్ కుమార్

కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మంచి కార్యక్రమాలను చేపట్టాలని నూతన సంవత్సరం సందర్భంగా కేబినెట్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం. కొత్త సంవత్సరంలో మొదట రైతులకు సంబంధించినటువంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్ల రైతులకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత తెలుస్తుంది. ఇదే స్ఫూర్తిని ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కూడా తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ ఇటీవలి నిర్ణయాలలో ప్రధానంగా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఆరు నుంచి పదివేలకు పెంచడం,అదేవిధంగా ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా స్కీమ్‌లని కూడా పొడిగించడం 3850 కోట్లతో వన్ టైం ప్రత్యేక ప్యాకేజీ ఇలాంటి ప్రధానమైనటువంటి క్యాబినెట్ నిర్ణయాలు రైతులకు మరింత ఉపయోగపడే విధంగా ఉన్నాయని అర్థమవుతుంది. మన దేశానికి వెన్నెముక రైతే కాబట్టి రైతు సంక్షేమానికి ఎంత కృషిచేసినా, ఎన్ని నిధులను కేటాయించిన తక్కువనే చెప్పాలి. కానీ ప్రభుత్వం ఎప్పుడు రైతు సంక్షేమానికి కట్టుబడి ఉండాలని అదేవిధంగా భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టే విధంగా రైతుల ఆదాయాలు రెట్టింపు చేసేవిధంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రతి రైతు కోరుకుంటున్నాడు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం కూడా మంచి పరిణామంగా చెప్పవచ్చు. కేంద్ర నిర్ణయాలలో ఎరువులకు సంబంధించినటువంటి డిఏపిపై సబ్సిడీ పొడిగించాలని, ప్రతి డీఏపీ బస్తాపై పడే అదనపు భారాన్ని కేంద్రం భరించాలని, పంటల నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించే పసల్ బీమా యోజనను 2025-26 వరకు పొడిగించాలని నిర్ణయాలు తీసుకోవడం, టెక్నాలజీతో పంట నష్టాన్ని అంచనా వేసే విధానాన్ని కూడా తీసుకురావడం, ఇప్పటికే ఇది ఈ టెక్నాలజీ విధానం ఏపీ, అస్సాం, హర్యానా, యూపీ లాంటి తొమ్మిది రాష్ట్రాల్లో అందుబాటులో ఉంది. ఈ విధానం దేశంలో అన్ని రాష్ట్రాలకు విస్తరించే విధంగా తీసుకువచ్చే విధంగా కృషి చేయాలి. దేశంలో రైతులు పండిస్తున్నటువంటి వివిధ రకాలైనటువంటి పంటలకు మద్దతు ధరలు మరింత పెంచాల్సినటువంటి అవసరం ఉంది. అదేవిధంగా రైతులకు సంబంధించినటువంటి



ఆదాయాలను రెట్టింపు చేసే విధానాలను, మరిన్ని కార్యక్రమాలను కూడా చేపట్టాల్సినటువంటి అవసరం ఉంది. దేశ జనాభాలో రానురాను వ్యవసాయంపై ఆధారపడేటువంటి జనాభా శాతం తగ్గుతుంది. కానీ దేశ జిడిపిలో వ్యవసాయం పాత్ర అత్యంత కీలకమైనది. అదేవిధంగా గ్రామీణ అభివృద్ధిలో కూడా వ్యవసాయం పాత్ర అతి ముఖ్యమైనది. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పలు పంటల మద్దతు ధరలని పెంచింది. అదేవిధంగా రైతుల పెట్టుబడి, ఖర్చులు పెరిగాయి కాబట్టి రైతుల పరిస్థితులు అభిమతం బట్టి అన్ని పంటల మద్దతు ధరని మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్నటువంటి సంబంధాల ఆధారంగా గతంలో పి.యం కిసాన్ సమ్మాన్ నిధి మినహా కొన్ని కేంద్ర ప్రభుత్వ సంబంధించినటువంటి పథకాలు కార్యక్రమాలు కొన్ని రాష్ట్రాల్లో అమలు కాలేదు. కాబట్టి ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సఖ్యతతో రైతులకు సంబంధించినటువంటి అన్ని రకాల పథకాలను అమలు అయ్యేవిధంగా ప్రతి రైతుకి లబ్ధి చేయకూర్చే విధంగా అమలు చేయాలి. కొన్నికొన్ని పథకాలపై రైతులకి అవగాహన లేదు. ఎందుకంటే అవి మనరాష్ట్రంలో గతప్రభుత్వం హయంలోఅమలు కాలేదు, అమలు అయితే వాటిపై రైతులకి సమా చారం, అవగాహన ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పలు కేంద్ర పథకాల్ని అమలు చేయడంలో ప్రధానమైన దృష్టి పెట్టాల్సిన అవసరంఉంది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం కేంద్ర పథకాల్ని అమలు చేయడానికి కృషి చేస్తుంది. కానీ ప్రతి కేంద్ర ప్రభుత్వ పథకం కార్యక్రమం క్షేత్రస్థాయిలో అమలు చేసేవిధంగా చర్యలు అవసరం. అదేవిధంగా రాష్ట్రంలో రైతు భరోసా వెంటనే అమలు చేయాలి. అందుకు సంబంధించిన అంశాల రూపకల్పనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా సంబంధించినటువంటి విధివిధానాలను విడుదల చేసి రైతులకు ప్రతి సీజన్లో ఆర్థిక సాయం అందించే విధంగా ఎటువంటి షరతులులేకుండా రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా విధానాలు రూపొందించాలి. గతంలో జరిగినటువంటి రైతుబంధులో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ నాయకులకు,సినిమా నటులకి, ఎక్కువ డబ్బున్నటువంటి ధనవంతులకు రైతు భరోసాఇవ్వకుండా సన్న, మధ్యకారు పెద్ద రైతులను దృష్టిలో పెట్టుకొని పండించే వారికి రైతు భరోసా అందించి, రైతులకి అన్ని విధాలా మరింత సహకరించాలి. ●

# చేగువేరా, వివేకానంద బాటలోనే పవ'నిజం'!



ఫిజిక్స్ అరుణ్ కుమార్

జయాపజయాలకు సంబంధం లేకుండా దాదాపు మూడు దశాబ్దాలుగా సామాన్య ప్రజానీకం మొద లు, సినీరాజకీయ ప్రముఖులతోపాటు నేటి మనదేశ ప్రధాని దాకా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి విస్తృత ప్రచారంలో ఉన్న ఓ అభిప్రాయం ఇది. 2019 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో శాసన సభ్యునిగా పోటీ చేసి రెండుస్థానాల్లో ఓటమి చెందినా, జనసేన పార్టీ ఘోర పరాజయం పాలైన ఆనాటి ప్రభుత్వ పాలనపై నిరసనగా ర్యాలీల్లో, సభల్లో, సమావేశాల్లో పవన్ పిలుపుకు లక్షల్లో జనం కదిలిరావటం ఆయనకున్న క్రేజ్‌కు ఓ నిదర్శనం. సినిమాల్లో వేషాలేసుకునేవారికి రాజకీయాలు ఎందుకని కొందరు,రాజకీయాలు నడుపుతూ సినిమాలు ఎందుకని మరికొందరు మాటల తూటాలతో దాడిచేస్తున్నా పవన్ తన ప్రయాణాన్ని మాత్రం రెండు రంగాల్లో విజయవంతంగానే కొనసాగిస్తున్నారు.పేదప్రజలకు తన 'పవర్'తో బాసటగా నిలుస్తూనే తన అభిమానులకు 'స్టార్'గానే ప్రకాశిస్తున్నారు. మొత్తానికి ప'వన్' పవర్ స్టార్ గానే కొనసాగుతున్నారు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ నాయ కత్వంలోని జనసేన పార్టీ సృష్టించిన ప్రభంజనం అందరికీ తెలిసిందే. 100 సక్సెస్ రేటుతో రాజకీయంగా ఆసక్తిని కల్గించింది. చంద్రబాబు నాయుడు రాజకీయ చతురతను, అనుభవాన్ని గౌరవిస్తూ పవన్ తనే స్వయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పేరును సవి నయంగా ప్రతిపాదించారు. తదనంతరం ప్రస్తుతం డిప్యూటీ సీఎం హోదాలో పవన్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి తాగునీటి సరఫరా శాఖతోపాటు పర్యావరణ, అటవీశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి ప్రముఖ శాఖలకు మంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తనదైన పంథాలో ముందుకు సాగుతుండగా పవన్ తన మార్క్ రాజకీయ సినిమాతో అడుగులు వేస్తున్నారు. ఆద్యంతం ప్రజాసేవలో ప్రజా సమస్యలపై తన సమయాన్ని సద్వినియోగం చేస్తున్నారు. గ్రామాలే ఈ దేశపు పట్టుకొమ్మలు అన్న మహాత్ముడి మాటలను నమ్మి తన ఆలోచనలను, ఆదర్శాలను గ్రామ స్థాయి నుంచి తీసుకువెళ్ళాలనే దార్శనికతతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే సామాన్యునికి సైతం సైన్స్ అండ్ టెక్నాలజీ అందాలనే లక్ష్యంతోనే పవన్ కీలకమైన మంత్రిత్వ శాఖలను బాధ్యతగా తీసుకున్నారని చెప్పవచ్చు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక ప్రభుత్వ బడ్జెట్‌తోపాటు తన సొంత డబ్బులను ఖర్చుచేస్తున్నారు. అన్నీకోల్పోయి ఆవాసం లేక, ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులను ఆదుకునే సందర్భంగా కూడా ఎప్పటిలానే తనలోని మానవత్వంను చూపి అందరికీ ఆదర్శమయ్యారు. అడవుల పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలకోసం వ్యూహాలు రచిస్తున్నారు. గత ప్రభుత్వంలో తప్పిపోయిన అమ్మాయిలను వారి కుటుంబాలకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ముఖ్యంగా ఆడవారిపై ఇష్టానుసారంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిపై, మాదకద్రవ్యాల సరఫరా వినియోగంపై రియల్ హీరోలా ఉక్కుపాదం మోపుతున్నారు. ఎంతటి వారైనా సరే వదిలేదే లేదు అనేలా 'లా అండ్ ఆర్డర్' విషయంలో పవన్ చాలా సీరియస్‌గా వున్నట్లు స్వయంగా చంద్రబాబే అసెంబ్లీ సమావేశాల సాక్షి గా ప్రకటించారు. ఇక ఈ మధ్య కాకినాడ పోర్ట్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఆయన నడత, నడకమాట తీరు దృశ్యాలు సోషల్ మీడియాలో ఒరెంజ్‌లో వైరల్ అయ్యాయి. అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయి.ఓ ప్రక్క జనసేన పార్టీను ప్రజలకు దగ్గర చేస్తూనే, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కూడా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగిస్తూ తనదైన పవ'నిజాన్ని' ప్రదర్శిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా ప్రధానమంత్రి మోడీకి సన్నిహితుడైన వ్యక్తిగా కూడా పవన్ దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో పవన్ పోషించిన పాత్రపై జాతీయ మీడియా ప్రత్యేకంగా ప్రశంసించింది. మోడీ నాయకత్వాన్ని దశాబ్దంకు పైగా సంపూర్ణంగా సమర్థిస్తూ వస్తున్న 'పవన్' నీతి, నిజాయితీ సమర్థత పైన మోడీకి ప్రత్యేక అభిమానం వుంది. ముఖ్యంగా పవన్‌లోని దేశభక్తి, నిరాండంబర జీవన విధానం, పేదప్రజల జీవితాల్లో మార్పు కోసం ఆయన పడే తాపత్రయం వంటి తదితర అంశాల వల్ల ఆయనంటే మోడీకి ప్రత్యేక అభిమానం.అందుకే నేటి దేశ రాజకీయాల్లో సంచలనంగా మారిన "సనాతన ధర్మం"అంశంపై పవన్ స్పందన దేశ రాజకీయాలను సైతం ఆకర్షించింది. మా దేవాలయాలను కాపాడుకుంటూ,మా ధర్మాన్ని అనుసరిస్తూ జాతి సమగ్రతను కాపాడుతూ దేశ రాజ్యాంగాన్ని గౌరవిస్తామని పవన్ చేసిన ప్రసంగాలు నేటిఆధునిక యువత ఆలోచనల్ని ప్రభావితం చేస్తున్నాయి.స్వేచ్ఛ,సమానత్వాలపై చేగువేరా, భగత్ సింగ్ ఆదర్శాలతో పోరాటం చేస్తూనే వివేకానంద, గాంధీజీ, అంబేద్కర్ వంటి మహానుభావుల కలలసౌధం కోసం తన వంతు అలుపెరగని ప్రయత్నంచేస్తున్నారు.అప్పట్లో సినిమా రంగంలో అశేషప్రజానీకం అభిమానం పొందుతూనే,తెలుగు వారి ఆత్మగౌరవం పేరిట ఎన్‌టిఆర్ తెలుగు దేశం పార్టీ స్థాపించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండు రూపాయల బియ్యంతో పేదోడి ఆకలిని తీర్చి,దేశ రాజకీయాల్లో సంచలనంగా మారారు. అదేవిధంగా సినిమాల్లో కనీసం కొంతసేపైనా పవన్ కనిపిస్తేచాలు అని కొన్ని సంవత్సరాలు వేచి చూసే అసంఖ్యాక అభిమానులు,కోట్లమంది ప్రేక్షకులు ఇష్టపడే 'చిరంజీవి' స్థాయి వున్న సినీహీరో అన్నీ వదిలేసి ప్రజాసేవకై జనసేన పార్టీని స్థాపించి ఎన్నో అవరోధాలను, అవమానాలను,అపజయాలను అధిగమించి నేడు డిప్యూటీ సీఎంగా వుంటూ దేశ రాజకీయాల్లో ప్రముఖంగా కనిపిస్తున్నారు. తెలంగాణలో కూడా భాజపాతో కలిసి పవన్ జనసేనను ప్రజల్లోకి తీసుకెళ్తారని, త్వరలోనే కేంద్ర కేబినేట్ లో కూడా చేరుతారనే ఊహాగానాలు వివిధ ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్నాయి. ఏంజరుగుతుందో కాలమే నిర్ణయించాలి. పవన్ నటించిన ఓ సినిమాలోవిలన్ పాత్ర పవన్ పాత్ర నుద్దేశించి 'ఏ సామాన్య జనం కోసం నువ్వు పోరాడుతున్నావో ఆ జనమే నిన్ను ఒంటరిగా వదిలేసి వెళ్లిపోతారు అంటాడు! అప్పుడు పవన్‌పాత్ర స్పందిస్తూ వాళ్ళు నావెంట వున్నా,లేకున్నా నేను వారికోసం వాళ్ల వెంటే వుంటా! అంటాడు. అందుకనేమో రెండు స్థానాల్లో ఓడించినప్పటికీ కోట్లు సంపాదించే తన విలువైన సమయాన్ని తనను ఓడించిన ప్రజలకోసమే కేటాయించాడు. ప్రస్తుతం బాధ్యతగల పదవిలో వున్న పవన్‌ప్రజాసేవలోరాజధాని పనులు పూర్తి గాని రాష్ట్రం కోసం,2047 వికసిత భారత్ కోసం ఎంతవరకు శ్రమిస్తారో, పేదరికపు చావులు లేని ఈ దేశ నిర్మాణంలో ఎలాంటి పాత్రపోషిస్తారో వేచిచూద్దాం. ●

## ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ రుణభారం

# 102 లక్షల కోట్ల డాలర్లు

### 36 లక్షలకోట్ల డాలర్లతో అగ్రస్థానంలో అమెరికా

### ఏడో స్థానంలో భారత్ 3.23 లక్షలకోట్ల డాలర్ల రుణభారం

### ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదలచేసిన ఐఎంఎఫ్




**న్యూయార్క్,జనవరి 2:** ప్రపంచదేశాల రుణభారం 2024లో 102 లక్షలకోట్ల డాలర్లకు పెరిగిపోయింది. ప్రపంచ దేశాల్లో ప్రభుత్వ రుణభారం 2024 చివరినాటికి 102 బిలియన్ డాలర్లకు చేరితే అమెరికా, చైనాదేశాలకే ఎక్కువ రుణ భారం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క 2023లోనే ఐదు లక్షలకోట్లడాలర్ల పెరుగుదల నమోదయింది. ప్రభుత్వాల విధివిధానాలు, డెట్ రిస్క్‌లపై చేపట్టిన కార్యాచరణ, వృద్ధజనాభా పెరుగుదల, పెరుగుతున్న హెల్త్‌కేర్ వ్యయం వంటివి ఇందుకు ప్రధాన అంశాలుగా ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఉన్న అమెరికాలో రుణభారం పెరుగుతోంది. ప్రపంచ రుణభారంతో పోల్చుకుంటే 34.6శాతంగా ఉంది. ఇక నికర వడ్డీ చెల్లింపులు కూడా 2024 ఆర్థికసంవత్సరంలో 892 బిలియన్ డాలర్లుగా ఉనానయి. రానురాను 2034 నాటికి చూస్తే ప్రపంచ వ్యాప్తంగా చెల్లింపులు మొత్తాలు 1.7 లక్షలకోట్ల డాలర్లకు పెరుగుతాయని సర్వేలు స్పష్టంచేస్తున్నాయి. వచ్చే దశాబ్దకాలంలో మొత్తంగా నికర వడ్డీ వ్యయం 12.9 లక్షలకోట్లు డాలర్లుగా ఉంటుందని అంచనా. 2022 ఫిబ్రవరి నాటికి అమెరికా ఫెడ్‌రిజర్వు డేటా ప్రకారం ప్రభుత్వ రుణం 30 లక్షలకోట్ల డాలర్లను అధిగమించింది. 2023తో అమెరికా బాహ్యరుణ భారం దేశ జిడిపిలో 93.7శాతంగా ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు అమెరికా ఆర్థికవాటా ఎక్కువఉంది. 117 బిలియన్ డాలర్లు సమకూరుస్తోంది. సప్లిమెంటరీ ఫండింగ్‌కింద మరో 44 బిలియన్ డాలర్లు సమకూరుస్తోంది. అమెరికా తర్వాత జపాన్ రుణభారం 1.1 లక్షల కోట్లుగా ఉంది. చైనా రుణభారం 749 బిలియన్ డాలర్లుగా ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్ 690.2 బిలియన్ డాలర్లుగా ఉంది. లగ్జెంబర్గ్ 373.5 బిలియన్ డాలర్లు, కెనడా 328.7 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు అంతర్జాతీయ ద్రవ్యనిది సంస్థ ఆర్థిక నివేదిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిడిపిలో ప్రభుత్వరుణ నిష్పత్తిని చూస్తే 121శాతంగాఅమెరికా అగ్రస్థానంలో ఉంది. అదే చైనా 90.1శాతం, జపాన్ 251.2శాతం, యుకె 101.8శాతం, ఫ్రాన్స్ 112.3 శాతం, ఇటలీ 136.9 శాతంతో ఉంటే భారత్ ఏడోస్థానంలో ఉంది. 83.1శాతం జిడిపినిష్పత్తిలో ఉంది. ఇక జర్మనీ పరంగాచూస్తే జిడిపిలో 62.7శాతం, కెనడాపరంగాచూస్తే జిడిపిలో 106.1శాతం, బ్రెజిల్ 87.6శాతంతో టాప్ పదిస్థానాల్లో ఉన్నాయి. భారత్ కొంత మెరుగైన స్థితిలో ఉండటం ఆశాజనకంగా ఉంది. 2019 నుంచి చూస్తే 74శాతంపెరిగింది. అయితే పటిష్టమైన ఆర్థికవృద్ధి, ప్రభుత్వ ఆర్థిక విధివిధా నాలు కొంతమేర రాబడులను పెంచుతుండ టంతో రుణభారం సమస్య అధిగమించవచ్చని నిపుణుల అంచనా. జిడిపితో రుణనిష్పత్తిని పరి శీలిస్తే 2024లో 83.1శాతంగా ఉంది. అదే 2028 నాటికి 80.5శాతానికి పెరుగుతుందని అంచనా. యూరోప్‌పరంగాచూస్తే బ్రిటన్ 3.65 లక్షలకోట్ల రుణభారంతో ఉంది. జిడిపిలో 101.8శాతం వాటా. 2024లో ఆదేశ జిడిపిలో 77.4శాతం ఉన్న రుణభారం రానురాను బ్రిటన్‌లో పెరిగిపోయింది.

## దల్లేవాల్ దీక్షపై

# తప్పుడు ప్రచారం

### సుప్రీం బెంచ్ ఆగ్రహం



**న్యూఢిల్లీ, జనవరి 2:** దేశవ్యాప్తంగా రైతుల పంటలకు గిట్టుబాటుధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌చేస్తూ నిరవధిక దీక్షచేస్తున్న రైతు నాయకుడు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్ దీక్షను బ్రేక్‌చేసేందుకు కొందరు కుట్రలుచేస్తునారంటూ జరుగుతున్న ప్రచారంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కొందరురైతు నాయకులు, పంజాబ్ అధికారులు సైతం కొందరు ఇలాంటి ప్రచారంచేస్తున్నారని సుప్రీం అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ ఉజ్జల్‌భూయాన్‌లతో కూడిన బెంచ్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసింది. దల్లేవాల్ దీక్షను బ్రేక్‌చేయాలని సుప్రీం కోర్టు ఎప్పుడూ ఎవ్వరికీ సూచనలుచే యలేదని కేవలం ఆయన ఆరోగ్యం క్షీణి స్తుండటంవల్లనే తాము ప్రభుత్వంనుంచి నివేదికలు కోరామన్నారు. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ పంజాబ్ ప్రభుత్వం, కొందరురైతు నాయకులు కూడా బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది ఎంతమాత్రం తగదని వాఖ్యానించారు. దల్లేవాల్‌పట్ల ఇలాంటి వ్యాఖ్యలుచేస్తున్న రైతు నాయకులను గుర్తించాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని సుప్రీం ఘాటుగా స్పందించింది. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్‌సింగ్ ఇలాంటి చర్యలను ఎప్పుడూ తీసుకోలేదని, భవిష్యత్తులో కూడా అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని, దల్లేవాల్‌ను వైద్య చికిత్స తీసుకునేవిధంగా ఆయన్ను బుజ్జగించి అంగీకరింపచేసేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డిజిపిలు ఈ కేసులో వర్చువల్‌గా కోర్టుముందు హాజరవుతున్నారు. డిసెంబరు 20వ తేదీ తాము ఇచ్చిన ఉత్తర్వుల మేర తీసు కున్న చర్యల నివేదికను అఫిడవిట్ దాఖలు చేయాలనికోరింది. కోర్టు తన ఉత్తర్వుల్లో దల్లే వాల్‌ను సమీపంలో ఏర్పాటుచేసిన వైద్య కేంద్రా నికి తరలించాలని ఆదేశించింది. తదుపరి వాయి దాను ఈనెల 6వతేదీకి వేసింది. టాప్ కోర్టు కేంద్రానికి సైతం తాజా పిటిషన్ దాఖలు చేయా లని ఆదేశించింది. కనీస మద్దతుధరకు చట్టబద్ధ తపై తీసుకున్న చర్యలను వివరించాలని కోరింది. 2021లో నిరసన చేస్తున్న రైతులకు ఇచ్చిన హామీలు అమలులో ప్రగతినివేదికలు కూడా దాఖలుచేయాలని ఆదేశించింది.

# ఎంఎస్ఎంఇ రంగానికి వెన్నెముక ఓఎన్డీసి

### ఇ-కామర్స్‌లో విప్లవాత్మక మార్పులు: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జనవరి 2:** చిన్న వ్యాపారాలను చిన్న వ్యాపారస్తులనుప్రోత్సహించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డిసి) మంచి ఫలితాలిస్తోందని ప్రధానిమోడీ అన్నారు. ఈకామర్స్‌రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. ఈరంగంలో చిన్న పరిశ్రమలకు మరింత మెరుగైన ప్రోత్సాహం లభిస్తున్నదని, ఓఎన్‌డిసి వృద్ధి మరింతగా పెరుగుతుందని అన్నారు. ఓఎన్‌డీసి వ్యవస్థ ప్రభుత్వం ఇతోధిక ప్రోత్సాహం ఇస్తున్న నెట్‌వర్క్ అని ఉత్పత్తుల డిస్కవరీ, విక్రేతలు, రవాణా విభాగాలు మొత్తం ఈకామర్స్ లావాదేవీలతోనే నడుస్తాయని అన్నారు. ప్రస్తుతం ఈనెట్‌వర్క్‌ను ఆహార ఉత్పత్తుల పంపిణీ, ఈ రిటైల్ ఆర్డరింగ్; క్యాబ్ సేవలు, ఆటో రైడ్‌లకు వినియోగిస్తున్నారని, ఊబేర్, ఓలాకు ప్రత్యామ్నాయంగా కూడా ఈ ఓఎన్‌డిసి ఉపయోగపడుతుందని అన్నారు. ఓఎన్‌డిసిలో ఇపుడు 200కిపైగా యాప్స్ ఉన్నాయని, వాటిలో బయ్యర్లు, సెల్లర్ల యాప్‌లు కూడా ఉన్నాయని తెలిపారు. 2021లో ఈకామర్స్ రంగాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా ఓఎన్‌డిసిని మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు ప్రధానిమోడీ అన్నారు. దేశ ఈ కామర్స్ రంగాన్ని ఓఎన్‌డిసి ఎంతో ప్రభావితం చేసిందని, ఎంఎస్ఎంఇ రంగానికి ఓఎన్‌డిసి ఇపుడు ఎంతో ప్రయోజనకారిగా ఉందని అన్నారు.

గడచిన మూడేళ్లలో ఓఎన్‌డిసి 150 మిలియన్ల లావాదేవీలు నిర్వహించిందని, సుమారు 200 నెట్‌వర్క్‌లపై కార్యకలాపాలు కొనసాగాయన్నారు. ఏడులక్షలకుపైగా విక్రేతలు, సేవల కల్పన సంస్థలు ఈ నెట్‌వర్క్‌లోకి వచ్చా రని, దేశంలోని 600కుపైగా నగరాలుపట్టణా లకు సైతం ఓఎన్డీసీ విస్తరించిందన్నారు. సుమారు 1100కుపైగా నగరాల్లోని వినియోగ దారులు నెట్‌వర్క్‌ద్వారానే ఇపుడు లావాదేవీలు చేస్తుండటం శుభపరిణామంగా అన్నారు. అలాగే ఏడువేలకుపైగా రైతు ఉత్పత్తుల సంస్థలు ఈ ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చాయని మొత్తం 35 లక్షలమంది రైతులు భాగస్వాములవడం సంతోషకరమని పియూష్‌గోయల్ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇలోని 50శాతం లబ్దిదారులు ఈ నెట్‌వర్క్‌ను ఆధారంగాచేసుకున్నారని, ఎంఎస్ఎంఇ టీమ్(ఎంఎస్ఎంఇ టీమ్ ఎనేబుల్‌మెంట్ అండ్ మార్కెటింగ్ ఇనీషియేటివ్) ఇపుడు ఐదులక్షల ఎంఎస్ఎంఇ సంస్థలను ప్రోత్సహిస్తోందని, ప్రత్యేకించి మహిళలే యజమానులుగా ఉన్న సంస్థలను ప్లాట్‌ఫామ్‌పైకి ప్రోత్సహిస్తుండటం మహిళా పారిశ్రామిక వేత్తలను మరింత ప్రోత్సహించినట్లవుతుందని కేంద్ర వాణిజ్యమంత్రి అన్నారు.

## జల్గావ్‌లో కారు హారన్ మోగించడంపై ఘర్షణ

### వాహనాలు, దుకాణాలకు ఆందోళనకారుల నిప్పు

**ముంబయి, జనవరి 2:** కారు హారన్ మోగించడంపై రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అల్లర్లు చెలరేగాయి. పలు షాపులు, వాహనాలకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ విధించారు. ఈ ఘర్షణకు సంబంధించి ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. న్యూ ఇయర్ సందర్భంగా పలాధి గ్రామంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి కారు డ్రైవర్ హారన్ మోగించి దారి ఇవ్వాలని కోరాడు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం తీవ్రమై ఘర్షణకు దారి తీసింది.

ఈ నేపథ్యంలో పలు షాపులతో పాటు వాహనాలకు ఆందోళనకారులు నిప్పంటించారు. కాగా, ఈ సమాచారం తెలుసు కున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకున్నారు. అదనపు పోలీసు సిబ్బంది, స్టేట్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌తోపాటు అల్లర్ల నియంత్రణ బృందాలనుమోహరించారు. ఆ ప్రాంతంలో మూడు రోజులపాటు కర్ఫ్యూ విధించారు. ఈ ఘర్షణలకు సంబంధించి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.

మరోవైపు మంత్రి గులాబ్‌రావ్‌పాటిల్ కాన్వాయ్‌లోని కారు డ్రైవర్ హారన్ మోగించడం ఈ ఘర్షణకు కారణమని మహారాష్ట్రలోని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ గొడవకు ఆ మంత్రి బాధ్యత వహించాలని, ఈ సంఘటనపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశాయి.



## బీహార్, కేరళ గవర్నర్ల బాధ్యతల స్వీకారం

**పాట్నా/తిరువనంతపురం, జనవరి 2:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఐదు రాష్ట్రాలకుకొత్త గవర్నర్లను నియమించిన సంగతి తెలిసిందే. వీరిలో కేరళ గవర్నర్ మహ్మద్ ఆరిఫ్‌ఖాన్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించింది. గురువారం ఆరిఫ్ మొహ్మద్‌ఖాన్ బీహార్‌గవర్నర్‌గా పదవీప్రమాణం చేసారు. అలాగే బీహార్ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించడంతో అర్లేకర్ కూడా గురువారం రాజ్‌భవన్‌లో ప్రమాణం చేసారు. దేశంలోని ఐదు రాష్ట్రాలకు కేంద్రం గవర్నర్లను నియమించింది. బీహార్ గవర్నర్‌గా ఆరిఫ్ మహ్మద్‌ఖాన్; కేరళ గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు, మిజోరమ్ గవరనర్‌గా జనరల్ విజయ్ కుమార్ సింగ్,మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లాను నియమించింది. గతనెల 24న రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్ కూడా జారీచేసినసంగతి తెలిసిందే.

## రూ. ఆరువేల కోట్ల పోంజీ స్కామ్‌లో చిక్కుకున్న క్రికెటర్లు

**అహ్మదాబాద్, జనవరి 2:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోంజీస్కీం స్కామ్ ఇపుడు క్రికెటర్లను సైతంచుట్టుకుంటున్నది. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని ప్రజలను మోసం చేసి రూ. 6వేల కోట్లను సేకరించిన బిజెడ్‌గ్రూప్ సిఇఒ భూపేంద్రసింగ్‌ఝలాను ఇప్పటికే గుజరాత్ సిఐడి అదుపులోకి తీసుకుంది. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తోపాటు సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, మోహిత్‌శర్మ వంటి పలువురు క్రికెటర్లు ఈ స్కీంలో పెట్టుబడులు పెట్టినట్లు బయటకు పొక్కింది. బిజెడ్ గ్రూప్ రూ.450 కోట్లకు సంబంధించిన లావాదేవీలపై ఇపుడు సిఐడి ఆరాతీస్తోంది. గుజరాత్ క్రికెటర్లకు సమన్లు జారీచేయాలని నిర్ణయించింది. అహ్మదాబాద్ మిర్రర్ అనే పత్రిక ఈ కుంభకోణం వెలికితీసింది. ఈమొత్తంలో గిల్ రూ.1.95 కోట్లు పెట్టుడిపెట్టినట్లు వివరించింది. మిగిలిన క్రికెటర్లుకూడా తక్కువ మొత్తాలు ఇన్వెస్ట్‌చేసారు. ప్రస్తుతం శుభ్‌మన్‌గిల్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. అది ముగిసి భారత్‌కు వచ్చాక గిల్‌కు సమన్లు జారీచేసి విచారణ చేపడతారు. గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలప్రజలను ఎక్కువ వడ్డీ ఇస్తామని నమ్మించి కోట్లరూపాయలు సమీకరించినట్లు భూపేంద్రసింగ్‌పై అభియోగాలను సిఐడి నమోదుచేసింది.

# రైతులను మాఫియాగా చూస్తున్న కేంద్రం

### ఉపన్యాసాలకే పరిమితం అవుతున్న బిజెపి: ఢిల్లీ సిఎం అతిశి మోర్లేనా ధ్వజం



**న్యూఢిల్లీ, జనవరి 2:** పంజాబ్ సరిహద్దుల్లో నిరవధిక దీక్ష నిర్వహిస్తున్న రైతు నేత దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుంటే వారికిచ్చిన డిమాండ్లను నెరవేర్చాల్సి ందిపోయి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని కేంద్రంపై ఢిల్లీ సిఎం అతిశి మోర్లేనా ధ్వజమెత్తారు. వెంటనే రైతు నాయకులతో చర్చలుజరిపి దల్లేవాల్ నిరవధిక దీక్షను వెంటనే విరమింపచేయాలని డిమాండ్ చేసారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విడుదలచేసిన లేఖపై ఆమె స్పందించారు. బిజెపిహయాంలో రైతులకు ఎదురైన సమస్యలు గతంలో ఎన్నడూలేవని రైతు పరిస్థితి అత్యంత దయనీయంగా బిజెపి హయాంలోనే ఉందని అన్నారు. రైతులను మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం తరహాలో పరిగణిస్తోందని, అహింసపై ఉపన్యాసాలిస్తున్న కేంద్రం రైతు నేత నిరవధిక దీక్షపై ఎందుకు ఫోకస్ పెట్టలేదని అన్నారు. చౌహాన్ తన లేఖలో ఆప్ ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని తప్పుపట్టారు. ఆప్‌ప్రభుత్వం ఢిల్లీలో రైతుల సమస్యలపట్ల ఎన్నడూ శ్రద్ధ చూపించలేదన్న చౌహాన్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన అతిశి పంజాబ్‌లో రైతులు ఆమరణ దీక్షను కొనసాగిస్తున్నారని వారి సమస్యలపై కేంద్రం తీసుకున్న చర్యలేమిటని ఆయన ప్రశ్నించారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాల సంయుక్త ఆధ్వర్యంలో పంజాబ్ ఢిల్లీ మధ్య శంభు, ఖన్నౌరి సరిహద్దుల్లో గత ఏడాది ఫిబ్రవరి 13వ తేదీనుంచి నిరవధిక దీక్షను నిర్వహిస్తున్నారని ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంవల్లనే వారు దీక్షను కొనసాగించాల్సి వస్తోందని అతిశి పేర్కొన్నారు.

## కేంద్రం వత్తాసుతో అక్రమ చొరబాట్లను అనుమతిస్తున్న బిఎస్ఎఫ్

### బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఆరోపణ



**కోల్‌కత్తా, జనవరి 2:** సరిహద్దుల్లోకి అక్రమ చొరబాటుదారులను బిఎస్ఎఫ్ దళాలు అనుమతిస్తున్నాయని, దీనివల్ల పశ్చిమ బెంగాల్‌ను నిస్తేజపరిచే కుట్రలుజరుగుతున్నాయని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మణిపూర్ ఇతర ఈశాన్యప్రాంతాల్లోను, బెంగాల్ సరిహద్దుల్లో ఉన్న బిఎస్ఎఫ్ దళాలు దేశంలోకి అక్రమ దళాలను అనుమతిస్తున్నాయని ఆరోపించారు.

బిఎస్ఎఫ్ సిబ్బంది దేశ సరిహద్దుల్లో ఉన్న ఇస్లామ్‌పూర్; సీతాయి, చోప్రా ఇతర సరిహద్దు ప్రాంతాలనుంచి బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతిస్తున్నారని, వీరిసాయంతో రాష్ట్రాన్ని మరింత నిర్వీర్యం చేయాలని కుట్రలుచేస్తోందని ఆమె అన్నారు. రాష్ట్ర సచివాలయంలో పాలనాపరమైన సమీక్ష నిర్వహించిన మమతా అక్రమ చొరబాట్లపై తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న బ్లూప్రింట్ సాయంతోనే ఇదంతా జరుగుతోందని, అయితే గూండాలు భారత్‌లో ప్రవేశిస్తున్నాయని, సరిహద్దుల్లో రెండువైపులా కూడా శాంతియుత వాతావరణం కోరుకుంటున్నామని, బంగ్లాదేశ్‌తో మనకు మంచి సంబంధాలున్నాయని ఆమె అన్నారు. డిజిపి రాజీవ్‌కుమార్‌ను ఆదేశిస్తూ వెంటనే కఠిన కార్యాచరణ అమలుచేయాలని ఆదేశించారు. అలాగే కేంద్రానికికూడా ఘాటుగా లేఖలు రాయాలని నిర్ణయించారు.

టిఎంసి ప్రభుత్వంపై బాధ్యతను వేస్తూ కేంద్రం బిఎస్ఎఫ్‌ను పురిగొలుపుతోందని, డిజిపి వెంటనే ఈ అక్రమచొరబాటుదారులు వస్తున్న చోట కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

## చిన్మయ్‌కృష్ణదాస్‌కు బెయిల్ నిరాకరణ

**చట్టోగ్రామ్, జనవరి 2:** ఇస్కాన్ మాజీ నేత, చిన్మయ్ కృష్ణదాస్‌కు చట్టోగ్రామ్‌లోని కోర్టు బెయిల్ నిరాకరించింది. గురువారం చట్టోగ్రామ్ మెట్రోపాలిటన్ సెషన్‌కోర్టులో పటిష్ట భద్రత మధ్య ఈకేసులో విచారణ జరిగింది. విధ్వంసం కేసులో ఇరుపక్షాల మధ్య దాదాపు అరగంట సేపు వాదోపవాదాలు జరిగిన తర్వాత మెట్రోపాలిటన్ సెషన్స్‌జడ్జి మహ్మద్ సైఫుల్ ఇస్లామ్.. చిన్మయ్ కృష్ణదాస్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించినట్లు మెట్రోపాలిటన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడ్వోకేట్ మోఫిజుర్ హక్ భూయియాన్ పేర్కొన్నారు. కాగా, గురువారం ఉదయం 11 గంటలకు చిన్మయ్ కృష్ణదాస్ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా 11 మంది సుప్రీంకోర్టు న్యాయవాదులు హాజరయ్యారు.

అంతకుముందు గత నెల 3న సెషన్స్‌కోర్టులో జరిగిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా చిన్మయ్‌కృష్ణదాస్ తరఫున న్యాయవాది లేకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి కోర్టు నిర్ణయించింది. గత యేడాది అక్టోబరు 25న చిట్టగాంగ్‌లో బంగ్లాదేశ్ జాతీయ పతాకం పైన కాషాయ పతాకాన్ని ఎగురవేశారన్న ఆరోపణపై ఇస్కాన్ చిన్మయ్ కృష్ణదాస్‌పై దేశద్రోహం కేసు పెట్టడంతో బంగ్లాదేశ్‌లో అల్లర్లకు, అశాంతికి కారణమైంది. ఈ సందర్భంగా గత నవంబర్ 25న కృష్ణదాస్ అరెస్టుతో నిరసనలు, ఆందోళనలు చెలరేగాయి. అలాగే చిన్మయ్ కృష్ణదాస్ మద్దతుదారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చెలరేగి విధ్వంసానికి దారితీసాయి. అదే నెల 27న చట్టోగ్రామ్ కోర్టు భవన సముదాయం బయట ఓ న్యాయవాది మరణిం చారు. దాంతో పరిస్థితులు మరింత విషమిం చడంతో ఆదిపురుష్ శ్యామ్‌దాస్, రంగనాథ్ దాస్‌బ్రహ్మాచారి అనే మరో ఇద్దరు సన్యాసులను అదుపులోకి తీసుకున్నారని కోల్‌కతాకు చెందిన ఇస్కాన్ వర్గాలు తెలిపాయి.

## అరెస్టు నేపథ్యంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు తన మద్దతు దారులకు సందేశం..

**సియోల్, జనవరి 2:** దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఎమర్జెన్సీ వివాదం నేపథ్యంలో ఇప్పటికే అభిశంసనను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనను అరెస్టు చేసేందుకు దర్యాప్తు అధికారులు కోర్టు నుంచి అంగీకారపత్రాన్ని తెచ్చుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో యూన్ తన మద్దతుదారులకు సందేశమిచ్చారు. జనవరి 6 లోపు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేస్తామని దర్యాప్తు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో యూన్ మద్దతుదారులు సియోల్‌లోని ఆయన నివాసం ఎదుట భారీగా మొహరించారు. వారిని ఉద్దేస్తూ యూన్ మాట్లాడారు. తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి దేశాన్ని ప్రమాదంలో పడేసేందుకు పనిచేస్తున్న శక్తులపై చివరివరకు పోరాడతానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. మరోవైపు యూన్‌ను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన తరఫు న్యాయబృందం హెచ్చరించింది. యూన్ సుక్ యోల్ మార్షల్ లా ప్రకటించడం పైనా దర్యాప్తు కొనసాగుతోంది. న్యాయవాదులతో పాటు పోలీస్, రక్షణ మంత్రిత్వశాఖ, అవినీతి నిరోధక శాఖల అధికారులతో కూడిన జాయింట్ టీమ్ అధ్యక్షుడిని విచారిస్తోంది. కాగా మూడు సార్లు విచారణకు పిలిచినా ఆయన హాజరు కాకపోవడంతో అధికారులు అరెస్ట్ వారెంట్ కోరుతూ కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం అంగీకరించింది. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ దక్షిణ కొరియా అధ్యక్షుడు ఇటీవల ఎమర్జెన్సీ మార్షల్ లా విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రకటనను విరమించు కున్నప్పటికీ ఆయన తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# గాజాపై మళ్లీ జరిగిన దాడుల్లో పది మంది మృతి

### ముగ్గురు చిన్నారులు, మహిళలు, సైనిక అధికారులుసైతం మృతి



**గాజాసిటీ, జనవరి 2:** గాజాస్ట్రిప్‌లో ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో పదిమంది చనిపోయారని పాలస్తీనా అధికారులు తెలిపారు. వారిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని, మరో ఇద్దరు హమాస్ అధీనంలోని పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఉన్నతాధికారులు కూడా చనిపోయినట్లు ధృవీకరించింది. గురువారం ఉదయం వేళల్లోనే జరిగిన వైమానిక దాడిలో ఒక టెంట్‌ను ధ్వంసంచేసారని, ఇజ్రాయెల్ డిక్లేర్ చేసిన మానవతా ఆశ్రయం జోన్ మువాసిలో అక్కడ వందలాది మంది నిరాశ్రయులయినవారు నివసిస్తున్నట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ దాడిలోముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు, మరో ముగ్గురు చిన్నారులు కూడా చనిపోయారని గాజా పోలీస్ డిప్యూటి బ్రిగేడియర్ జనరల్ హోస్సన్ షావాన్ తెలిపారు. ఇజ్రాయెల్ మిలిటరీనుంచి ఈ ఆరోపణలపై తక్షణ స్పందన కూడా ఏమీ రాలేదు. గాజాలో హమాస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో ఘర్షణకు ముందునుంచి కూడా సుపరిపాలన అందిస్తున్నట్లు బ్రిగేడియర్ తెలిపారు. అయితే ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో అనేక ప్రాంతాల్లో పోలీసులు పూర్తిగా తొలగిపోయారు. దీనితో సాదా దుస్తుల్లో ఉన్న హమాస్ సెక్యూరిటీ సిబ్బంది ఇప్పటికీ ఈప్రాంతంలో గస్తీ తిరుగుతున్నట్లు ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయిల్‌పై నిర్వహించిన హమాస్ దాడిలో 1200 మంది చనిపోయారు. వీరిలో ఎక్కువమంది పౌరులే ఉన్నారు. అంతేకాకుండా 250 మందికిపైగా కిడ్నాప్‌చేసింది. వారిలో ఇప్పటికీ గాజా అధీనంలోనే ఉన్నారు. వారిలోమూడోవంతు మందిచనిపోయి ఉంటారని ఇజ్రాయెల్ అనుమానిస్తోంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్‌నిర్వహించిన దాడుల్లో 45 వేల మంది పాలస్తీనియన్లు చనిపోయారు. వీరిలో ఎక్కువగా మహిళలు, చిన్నారులే ఉన్నారు.

## ట్రాఫిక్ జామ్ నగరాల్లో బెంగళూరు టాప్!

**బెంగళూరు, జనవరి 2:** దేశంలోట్రాఫిక్‌జామ్ అంటే ముందుగా మనకు కర్ణాటక రాజధాని బెంగళూరునగరమే గుర్తొస్తుంది. స్వల్పదూరం వెళ్లడానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యకృత్యం. ఆసియాలోనే టాప్ పదినగరాల జాబితాలో ట్రాఫిక్‌జామ్ పరంగా బెంగళూరునగరం అగ్రస్థానంలో ఉంది. టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ పది నగరాల జాబితాలో బెంగళూరు తొలిస్థానంలో ఉంది. పీక్ అవర్స్‌లో కేవలం పది కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయంపడుతోంది. టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా సుమారు 132గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. దక్షిణ, ఉత్తర భారత దేశంలోని చాలా రాష్ట్రాలప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళతారు. ఐటి కంపెనీల్లో ఉద్యోగాలుచేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీనితో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలు చెక్‌పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలుచేసినప్పటికీ ఫలితాలు రావడంలేదు. పీక్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్ తప్పించుకోవడం అంటే లాటరీ గెలిచినంత సంబరంగా ఉంటుంది. బెంగళూరు తర్వాత పూణె రెండోస్థానంలో ఉంది. పదికిలోమీటర్ల దూరానికి 27.50 నిమిషాలుపడుతోంది. ఆ తర్వాత ఫిలప్పీన్స్‌లోని మనీలా 27.20 సెకన్లు, తైవాన్‌లోని తైచుంగ్ నగరంలో 26.50 నిమిషాలు, జపాన్‌లోని సప్పోరోలో 26.50 నిమిషాలు, తైవాన్‌లోని కావోసియుంగ్ నగరం 26 నిమిషాలు,జపాన్‌లోని నగోయా నగరం 24.20 నిమిషాలు, ఇండోనేసియాలోని జకార్తా నగరంలో 23.20 నిమిషాలు వరుసగా తర్వాతస్థానాల్లో ఉన్నాయి.

# ఒక టీమ్‌లా పనిచేసి ప్రజల జీవితాలు మారుద్దాం

## అధికారుల సమావేశంలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,డిసెంబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారులు సహకరిస్తేనే ఏ ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సృజనాత్మక ఆలోచనా దృక్పథంతో ప్రభుత్వం మంచి ఫలితాలను సాధిద్దామన్నారు. రాష్ట్ర ప్రగతికి ఎన్నో ఆలోచనలు మేము చేస్తాం, వాటిని కార్యచరణలో పెట్టేదిశలో అధికారులు తమ అభిప్రాయాలను నిర్భయంగా తమతో పంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల్లోని కీలక అధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరం సందర్భంగా కొద్ది సేపు ముచ్చటించారు. రోజువారీ సమీక్షలకు భిన్నంగా.... అధికారులతో నూతన సంవత్సరం సందర్భంగా అధికారులతో ఆయన సంభాషణ జరిపారు. తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలను సీఎం చంద్రబాబు అధికారులకు వివరించారు. అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించారు. మనమంతా ఒక టీం.. కలిసి పనిచేద్దాం.. ప్రజల జీవితాలు మారుద్దాం అని వారికి సూచించారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మీరు నాలో కొత్త సీఎంను చూస్తారు. ఏ నిర్ణమైన మీతో నేను చర్చిస్తాను, సాధ్యాసాధ్యాలపై మీ అభిప్రాయాలు తీసుకుంటున్నాను. మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని అధికారులకు సిఎం ఉద్బోదించారు. సిఎస్, డీజీపీ, సిఎంవో అధికారులతో పాటు. వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ఆయా అధికారులకు, వారి శాఖలో పనిచేసే ఉద్యోగులకు ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అని

**- పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణల అమలు**
**మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు**
**- కొత్త సంవత్సరం సందర్భంగా అధికారులతో ముఖ్యమంత్రి**

పిలుపునిచ్చారు. ఒక పాజిటివ్ ఎనర్జీతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సిఎం అధికారులతో అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాలసీలకు సంబంధించి తన అనుభవాలను ముఖ్యమంత్రి గుర్తుచేసి వారిని మోటివేట్ చేశారు. 2025 సంవత్సరం లక్ష్యాలు ఏంటి, పనితీరు ఎలా ఉండాలనేది వారికి వివరించి కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖలో కూడా రిజల్ట్ ఓరియంటెడ్ గా పని జరగాలని సిఎం అభిప్రాయపడ్డారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ ఖిఖిఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో సంస్కరణలు అంటే పేదలకు వ్యతిరేకం అనే ప్రచారం ఉండేది. కానీ నాడు ధైర్యంగా సంస్కరణలు అమలు చేశాం. వెనుకడుగువేయకుండా కొత్త పాలసీలు తీసుకువచ్చి అమలు చేశాం. సంస్కరణలు పేదలకు వ్యతిరేకం కాదు.. పేదల జీవితాలు మార్చేవి అని నాడు తీసుకున్న నిర్ణయాలు నిరూపించాయి. అందుకే పేదల జీవితాలను మార్చే సంస్కరణల అమలులో ఎప్పుడూ చొరవ చూపుతాను. వాజ్ పేయి ప్రధాని గా ఉన్న సమయంలో రాష్ట్రంలో కూడా సంస్కరణలు మొదలుపెట్టాం. నేషనల్ హైవేల విషయంలో నాడు తీసుకున్న నిర్ణయంతో స్వర్ణచతుర్భుజి రోడ్లు వచ్చాయి. ఓపెన్ స్కై పాలసీ వల్ల విమానయాన రంగంలో అనూహ్య మార్పులు వచ్చాయి. పిపిపి విధానం వల్ల సంపద సృష్టి జరిగింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. నాడు హైదరాబాద్ లో చేసిన ప్రతి అభివృద్ధి నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంద్ది అని సిఎం అన్నారు. ఆయా నిర్ణయాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శలను కూడా గుర్తుచేసుకున్నారు. అయినా సరే మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయాల విభజన తరవాత మళ్లీ ఎపిలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. 2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే రాష్ట్రం ఎంతో పురోగతి సాధించేది. రాష్ట్రాల అభివృద్ధిలో సుస్థిర ప్రభుత్వం అనేది కూడా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ప్రజలకు మేలు జరుగుతుంది"అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. "2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగు లేని తీర్పు నిచ్చారు. ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వీటిని నెరవేర్చే క్రమంలో అనేక నిర్ణయాలు తీసుకున్నాం.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సిఎస్ విజయానంద్

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కె.విజయానంద్ డీ.సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర పాలనా యంత్రాంగం, వివిధ పథకాల అమలు తదితరంశాలపై ఆయనతో చర్చించారు. పలు అంశాలను సీఎస్‌ను అడిగి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలుసుకున్నారు. ఇక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సి.ఐ.డి. విభాగం అడిషనల్ డీజీపీ డా.ఎ.రవిశంకర్, ఆయన బృందం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసింది. ఈ సందర్భంగా రవిశంకర్ సి.ఐ.డి. టీమ్ సభ్యులను ఉప ముఖ్యమంత్రివర్యులకు పరిచయం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన నీరబ్ కుమార్ ప్రసాద్ గారు ఈ రోజు సాయంత్రం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ ప్రసాద్ గారికి జ్ఞాపిక అందించి సత్కరించారు.



# సాంస్కృతిక వైభవ పునరుద్ధరణ కోసం

# కళలను ప్రోత్సహించాలి

## జాతీయస్థాయి నాటికల పోటీలలో వక్తలు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతిపనిధి:** అంతరించిపోతున్న భాషలను కాపాడటంతోపాటు భారతీయ, సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని కాపాడటమే లక్ష్యంగా కళలను ప్రోత్సహిద్దాం లక్ష్యంగా అజోవిభ కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కఅతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తుంది. గురువారం నుండి విజయవాడలో ప్రారంభమైన ఈ పోటీలు ఈ నెల ఐదవ తేదీ వరకు జరుగుతాయి. వీటికి అనుసరణగా సాహిత్య సదస్సులు, విశిష్ట వ్యక్తులకు గౌరవ పురస్కారాల ప్రదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అజో విభకందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (యుఎస్ఎ) తెలిపారు. 1993లో ఏర్పడిన అజోవిభ కందాళం ఫౌండేషన్ అప్పటి నుండి అనేక సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తోందన్నారు. 32 సంవత్సరాలుగా "ప్రతిభా మూర్తి జీవితకాల సాధన సత్కారోత్సవంలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో నిర్వహిస్తున్నామన్నారు. సృజనాత్మక ప్రతిభను కనబర్చిన ప్రతిభామూర్తులను సత్కరించుకోవడం తమకు గర్వకారణమన్నారు. 2003 నుంచి సంస్కృతాంధ్ర భాషల్లో కృషి చేసిన వారికి "విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కారం, "సరిలేరు నీకెవ్వరు విశిష్ట పురస్కారంలను అందజేస్తున్నామన్నారు. అజోవిభకందాళం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.వి.రామానుజాచార్యులు మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతి మరింత వ్యాప్తికోసం కృషిని కొనసాగిస్తున్నామన్నారు. తెలుగు సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి కృషి చేస్తున్నామన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణరావు మాట్లాడుతూ అజోవిభ కందాళం ఫౌండేషన్ తమ సంస్థతో కలిసి విజయవాడలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. 32 మంది నిష్ణాతులైన సాహితీవేత్తలు, విశేష నటనా అనుభవం ఉన్న ఎందరో కళాకారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. తెలుగు డ్రామా నిర్వాహకులు డి.రామకోటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ కోసం, సాంస్కృతిక రంగానికి ఆరు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, ఆచార్య డిఎస్ఎన్‌మూర్తిలను గురువారం ఉదయం 11 గంటలకు బాలోత్సవ భవనంలో ఘనంగా సత్కరిస్తున్నామన్నారు. రంగస్థల ప్రముఖులు, సినీ ఆర్టిస్ట్ వైఎస్ కృష్ణేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని కేంద్రమైన విజయ వాడలో ఇంత పెద్దఎత్తున సాంస్కృతిక ఉత్స వాలు ఏర్పాటుచేయటం అభినందనీ యమ న్నారు. ఉత్సవాల ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ జి.వి. రంగారెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న భాషలు, సాంస్కృతిక వైభవాలను కాపాడటానికి అజోవిభ కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతిక వేదికలు కృషిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ ప్రతినిధి చలసాని కృష్ణప్రసాద్ పలువురు నాటక రంగ, సినీ, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు. విజయ వాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె చుక్కపల్లి పిచ్చయ్య ఎసి ఆడిటోరియం)లో గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభ సభ జరిగింది. సాయంత్రం. 6.30 గంటలకు హైదరాబాద్‌కు చెందిన కళాంజలి కళాకారుల "అన్నదాత నాటిక ప్రదర్శన రాత్రి 8 గంటలకు రెండో ప్రదర్శనగా వేదాంతం నాటిక ప్రదర్శించారు.

# పెన్నేపల్లి వద్ద స్టీల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

## - ఒకరు మృతి.. మరో ఇద్దరి పరిస్థితి విషమం

**నాయుడుపేట (పెళ్లకూరు), జనవరి 2 ప్రభాతవార్త:** పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామ సమీపంలో ఉన్న అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని బాయిలర్లు పేలిపోవడంతో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురు కార్మికులు చికిత్సలు పొందుతున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలోని కార్మికులు హాహాకారాలు చేశారు. అయితే ఈ ఘటనలో మొత్తం ఆరుగురు గాయపడ్డారు. వీరిలో సిపాయిలాల్, రవిబార్వాస్, సోను అనే కార్మికుల పరిస్థితి విషమంగా ఉండటంతో నాయుడుపేట ప్రభుత్వాసుత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం నెల్లూరుకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సల నిమిత్తం చెన్నైకి తరలించారు. వీరిలో సిపాయిలాల్ (30) అనే కార్మికుడు చెన్నైలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రవిబార్వాస్, సోను అనే కార్మికుల పరిస్థితి విషమంగా ఉంది. సుమారు 25 టన్నుల సామర్థ్యం ఉన్న కాలం చెల్లిన ఫర్నెస్ బాయిలర్ ప్రమాదవశాత్తు భారీ విస్ఫోటనం చెంది, దాని నుంచి పెద్దపెద్ద శబ్దాలతో మంటలు ఎగిసిపడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న విస్ఫోటనంతో మంటలు, శబ్దాల కారణంగా గ్రామంలోని ఇళ్లలో వస్తుసామగ్రి కింద పడిపోయి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, సిఐ సంగమేశ్వరరావులు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు.

# రజకవృత్తిదారులకు అండగా ఉంటాం

## - ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సి. సావిత్రి



రజక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్,డైరెక్టరుల ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

**విజయవాడ,జనవరి2,ప్రభాత వార్తప్రతినిధి:** రజకు వృత్తిదారుల అభివృద్ధి బాటలో పయనించేలా వారికి అండగా ఉంటానని ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సి. సావిత్రి తెలిపారు. నగర శివారుల్లో గొల్లపూడి బీసీ భవన్ లో గురువారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రజక ,సంక్షేమఅభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఛైర్ పర్సన్ సి. సావిత్రి మాట్లాడుతూ రజకులకు ఈ రోజు సుధినమని దానికి కారణం ఎంపికైన 15 మంది డైరెక్టర్ల చేత ఛైర్ పర్సన్ గా నేను ప్రమాణ స్వీకారం చేయించడమేనన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క కార్పొరేషన్ చైర్మన్ కూడా ఇలా ఎంపికైన డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించలేదన్నారు. మా అందిరిపై ఎంతో గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు రజకులకు అందించి వారికి సమాజంలో ఒక గుర్తింపును తీసుకొస్తానన్నారు. అంతేకాకుండా రజకుల సంక్షేమానికి, ఉపాధికి సంబంధించి ఉన్న జీవోలను ప్రభుత్వం అమలు చేసి వారిని వృత్తి పరంగా మరింత ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సంక్షేమ హాస్టల్స్ లో బట్టలు ఉతికే పనిని రజకులకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దీని కోసం ఉన్న జీవోలను పట్టిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే అన్ని అభివృద్ధి ఫలాలు రజకులకు చేరితే ఆ జాతి అభివృద్ధి బాట లో పయనిస్తుందన్నారు. రజకుల స్థలాల్లో లాండ్రీ షాపులు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రజకుల కులస్తులకు కూటమి సర్కార్ ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రజక కుల వృత్తులకు చెందిన పనిముట్లు వారికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిట్ట చివరి రజక బిడ్డ వరకు ప్రభుత్వ సహాయం అందేలా చూస్తానన్నారు. శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అధివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. బీసీ లతో మమేకమైన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, అనేక సంక్షేమ పథకాల ద్వారా బీసీ లను ఉన్నత స్థాయికి ముఖ్యమంత్రి చేర్చారన్నారు. 201419 మధ్య రజకులకు రజక భవనాలతోపాటు అనేక సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి అందించారన్నారు. బీసీలకు రూ. 39,000 కోట్లు బడ్జెట్ లో కేటాయించారన్నారు. 2019 లో వచ్చిన ప్రభుత్వం బీసీ ల అభివృద్ధిని తుంగలో తొక్కిందన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి కల్యాణ, రథోత్సవాలను వైభవంగా నిర్వహించాలి:ఎమ్మెల్యే వరప్రసాద్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 2, ప్రభాతవార్త..** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ ్మనరసిం హస్వామి కళ్యాణ రథో త్సవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధికారులకు సూచించారు. అంతర్వేది శ్రీలక్ష్మీ ్మనరసింహస్వామి వారి కల్యాణం షెడ్డులో గురువారం ఏర్పాటుచేసిన ఉత్సవాల సమీక్షా సమావేశం అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఉత్సవ ఏర్పాట్లపై గురువారం సమీక్షి ం చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రసంగిస్తూ ఫిబ్రవరి 4 నుండి 13 వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాల ఏర్పాట్లలో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ ప్రతీ భక్తునికి స్వామివారి కల్యాణం తిలకించడంతో పాటుగా స్వామి వారిని దర్శించుకుని సురక్షి తంగా ఆధ్యాత్మిక భావంతో ఇంటికి వెళ్లే విధంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిబ్రవరి 7 న కల్యాణం, ఫిబ్రవరి 8న రథోత్సవం, ఫిబ్రవరి 12న చక్రస్నానం (సము ద్ర స్నానం,) ఫిబ్రవరి 13న తెప్పోత్సవం వంటి ప్రధాన ఘట్టాలపై సమీక్షి ంచారు. ఆర్డీవో కె. మాధవి మాట్లాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా విధుల కోసం కాకుండా భక్తి సేవా దృక్పథంతో చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆమె సూచించారు. ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం, దర్శనాలకు భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. దక్షి ణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీ ్మ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 4 నుంచి ఫిబ్రవరి 13 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించా లన్నారు. ప్రతి ఏటా మాఘ మాసం శుద్ధ సప్తమి నుంచి బహుళ పాడ్యమి వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, మాఘ శుద్ధ దశమి నాడు స్వామివారి కళ్యాణం, ఏకాదశి నాడు స్వామి వారి రథోత్సవం జరుగు

# ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

**- మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం**
**- అడవిలోని మరికొంత మంది కోసం టాస్క్ ఫోర్సు తీవ్రంగా గాలింపులు**

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 2 ప్రభాతవార్త :** శ్రీవారిమెట్టు సమీపంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలు టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ పి. శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్‌ల మార్గనిర్దేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ టి. విష్ణువర్దన్ కుమార్ టీమ్ బుధవారం చంద్రగిరి మండలం, బాకరాపేట రేంజిలోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. వీరు శ్రీవారిమెట్టుకు పడమర వైపుకు చేరుకునే సరికి ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టే సరికి ఒక వ్యక్తి దుంగను పడేసి పారిపోగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేశారు. అక్కడ మూడు దుంగలను సేకరించి, అరెస్టు చేసిన ఇద్దరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. వీరిపై టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయగా, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

# హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్గించాలి: చట్టాలు చేయాలి

## శ్రీకాళహస్తిలో చైతన్య ర్యాలీ

**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త** హిందూ దేవాలయాలకు స్వయంప్రతి పత్తి కల్గించాలని ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని ధర్మాచార్యులు రూపొందించిన విధి విధానాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 5 విజయవాడలోజరుగు హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఈ సభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించాలని కోరూతూ చైతన్య ర్యాలిని గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించారు. భారీ ర్యాలిని కోలా ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. హిందువుల మనోభావాలను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి: సమాజంలో అత్యధిక శాతం ఉన్న హిందువుల మనోభావ వాలను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలని కోలా ఆనంద్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఇటీవల టిటిడిలో పవిత్రమైన లడ్డు ప్రసాదాలకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా హిందువులకు దిగ్భ్రాంతిని కల్గించిందన్నారు. దేవాలయాల నిర్వహణలో హైందవేతరులను భాగస్వాముల్ని హిందువుల విశ్వాలను దెబ్బతీస్తున్నారన్నారు.

# మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

## - కృష్ణా జిల్లా పరిధిలో ప్రజలకు ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృష్ణా జిల్లా పరిధిలో ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ను గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి గారి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్) సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ. 2 కోట్ల నిధులతో ఈ వాహనాన్ని ఏర్పాటు చేసింది. ఈ వాహనం కృష్ణా జిల్లా పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు సేవలు అందించనుంది. మహిళల్లో క్యాన్సర్ లక్షణాలు గుర్తించేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్క్రీనింగ్ టెస్టులు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ వాహనంలో ఏడు రకాల పరికరాలు అమర్చారు. వారంలో మూడు రోజులపాటు ఒక మండల పరిధిలోని గ్రామాల్లో సంచరిస్తూ అల్ట్రా సౌండ్, మెమోగ్రామ్, రక్త పరీక్షలు, ఎక్స్ రే, కెమికల్ అనాలసిస్, కొలనోస్కోపీ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్యాన్సర్ ను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వ్యాన్ ద్వారా ఏడాదికి 40 వేల మరణాలు అరికట్టవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. సామాజిక బాధ్యతతో ప్రజల కోసం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిన భెల్ కంపెనీ ప్రతినిధులను, చొరవ చూపిన ఎంపీ వల్లభనేని బాలశౌరి గారిని ఈ సందర్భంగా ప్రవన్ కళ్యాణ్ గారు అభినందించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి తక్షణం చికిత్స అందించేందుకు ఈ వాహనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర గారు, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ గారు, మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ గారు, వర్ల కుమార రాజా గారు, శ్రీ కాగిత కృష్ణప్రసాద్ గారు, శ్రీ వెనిగెండ్ల రాము గారు, శ్రీ బోడే ప్రసాద్ గారు, యార్లగడ్డ వెంకట్రావు గారు, కృష్ణా జిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీ గారు, రాష్ట్ర మెడికల్ డెవలప్మెంట్ సర్వీసెస్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారులు, జిల్లా జనసేన నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జనవరి2, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో పాలనపరంగా సాంకేతిక ఆవిష్కరణలకు అవకాశం కల్పించిన దివంగత మాజీ ప్రధాని నరసింహారావు చారిత్రక పురుషుడని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సీనియర్ జర్నలిస్ట్ అప్పరుసు కృష్ణారావు, మాజీ ప్రధానమంత్రి శ్రీ పీ.వీ.నరసింహారావు దేశానికి చేసిన సేవలు, ఆయన రాజకీయ జీవితం గురించి తెలిసేలా రచించిన పాములపర్తి వెంకట నరసింహారావు పుస్తకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా చంద్రబాబు సమకాలీన చరిత్రలో చెప్పుకోదగ్గ రాజకీయ నేత, ఆర్థిక సంస్కర్త అయిన పీవీ నరసింహారావు 18 భాషలు తెలిసిన మేధావి అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఆయన గురించి ఈ తరం తెలుసుకునేలా సరళమైన భాషలో సంక్షిప్తంగా రాశారంటూ అప్పరుసు కృష్ణారావు గారిని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభినందించారు. సీఎంకు పుస్తకం అందజేసిన వారిలో అప్పరుసు కృష్ణారావుతో పాటు సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు గారు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఉన్నారు.



# మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలలో కుంభాభిషేకం



**శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో వచ్చేనెల 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఇందుకు పూర్తి అయిన మండపాలు, దేవాలయాల కుంబాభిషేకం ఈ నెల 20 నిర్వహించుటకు ఆలయ అర్చకులు సూచించారని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి గురువారం వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిందన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత అనుబంధ ఆలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉండేదన్నారు. అయితే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డి చొరవ చూపి కాంట్రాక్టర్లను చైతన్యవంతుల్ని చేసి పనులు పూర్తి చేయించారని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగ పట్టణ నడిబొడ్డులో ఉన్న కుమారస్వామి తిప్పవద్ద దిగువ భాగాన వినాయక మండపం పురాతనమైనది కాబట్టి దానిని తొలగించి రూ.24లక్షలతో మండపం పునర్నిర్మాణం జరిగిందన్నారు. దానిని ఈ నెల 20 న కుంబాభిషేకం జరపనున్నట్లు వివరించారు. అలాగే సుమారు 10 సంవత్సరాల నుంచి నిర్మాణానికే పరిమితమైన రూ.1.25కోట్లు అంచనాల వాహనాల మండపంను పూర్తి చేయించారన్నారు. ఈ మండపం శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్లను ప్రతిష్టించి అక్కడ నుంచి వాహనాల్లో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి అన్నారు. ఈ మండపం నిర్మాణం పూర్తి అయ్యిందని దానిని ఈనెల 20 న కుంబాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

కాగా శ్రీకాళహస్తీశ్వరుని అనుబంధమైన హార హార తీర్థంలో పురాతన కాలం నాటి స్వామి అమ్మవార్ల ఆలయాలను రూ.50లక్షలతో జీర్ణోద్ధారణ గావించారని వాటి కుంబాభిషేకం కూడా నిర్వహించుటకు ఆలయ అర్చకులు వివరించారు.

వెంటనే ఏర్పా టుకు ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశించామన్నారు. ఈ నెల 19, 20వ తేదుల్లో కుంభాభిషేకాల సంబరాలు ఏర్పాటు చేసినట్లు ఇఓ టి.బాపిరెడ్డి వివరించారు.

ఇందుకు సన్నాహాలు చేపట్టినట్లు వివరించారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# వైభవంగా ఎమ్మెల్యే సత్యప్రభ నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

**- వేలాదిగా తరలివచ్చిన కూటమి నాయకులు,రాజన్న అభిమానులు**



**ప్రత్తిపాడు , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో స్థానిక ఎమ్మెల్యే వరపుర సత్యప్రభ నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న ప్రత్తిపాడు,ఏలేశ్వరం శంఖవరం,రౌతులపూడి మండలాల నుండి కూటమి నాయకులు,వరుపుల రాజన్న అభిమానులు, వివిధ శాఖల అధికారులు వేల సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు.

ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్తిపాడులో తన భర్త దివంగత నేత స్వర్గీయ వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ప్రత్తిపాడు వారి ఇంటి వద్ద ఏర్పాటు సభావేదికపై కుటుంబ సభ్యులతో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ప్రారంభించారు. నియోజవర్గ నలుమూలల నుండి నుండి పెద్ద సంఖ్యలో రాజా కుటుంబ అభిమానులు,ఎన్డీఏ కూటమి శ్రేణులు,ప్రజలు, మరియు వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఎక్కువగా భోజనం స్టాల్స్ ఏర్పాటు చేసి విందు ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే నానాజీ ఇంటి వద్ద ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**కాకినాడ రూరల్ , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ స్వగృహం వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి కూటమి పార్టీ నాయకులు. కార్యకర్తలు. జనసైనికులు,అభిమానులు , ప్రభుత్వ అధికారులు.వేలాదిగా తరలి వచ్చి పూల బొకేలు,గజమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యం తో కలిసిమెలిసి ఐకమత్యంగా జీవించాలని , ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతుందన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని,కొత్త సంవత్సరంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరెన్నో నూతన కార్యక్రమాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.కాకినాడ రూరల్ ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## హైందవ శంఖారావ సభను పై గ్రామాల్లో విస్తృత ప్రచారం



**శంఖవరం , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

హిందూ దేవాలయాల సంరక్షణ కోసం నిర్వహిస్తున్న హైందవ శంఖారావ సభ గురించి గ్రామాల్లో విస్తృత ప్రచార నిర్వహిస్తున్నారు. మండలలోని పలు గ్రామాల్లో ధర్మ జాగరణ సమితి సభ్యుడు జీలకర్ర చక్ర కామేశ్వరరావు, బొండాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం ఆటోలకు స్టిక్కర్లు అంటించడం వంటి చర్యలు చేపట్టారు అదేవిధంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి హైందవ శంకరావసభ స్టిక్కర్లు నటించి సభలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరుతున్నారు ఈ సందర్భంగా చక్ర కామేశ్వరరావు, సత్యనారాయణ లుమాట్లాడుతూ దేవాలయాల్లో పూజ ప్రసాద కైంకర్యా అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించేలా చూడాలని, దీని ఉల్లంఘన పాల్పడితే దోషులను కఠినంగా శిక్షించేలా ఉండాలని, దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా హిందూ దైవ భక్తులు మాత్రమే ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో జిలకర శ్రీను కంద దివాణం జీలకర్ర చందర్రావు కోలా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## రబీ సాగుపై కలెక్టర్ సమీక్ష

**రాజమహేంద్రవరం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :** స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రస్తుత రబీ సీజన్ పంటల సాగు విస్తీర్ణం, కార్యాచరణ ప్రణాళికపై క్షేత్ర స్థాయి అధికారులతో అంశాల వారీగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ విధానంలో మార్పులు, పంట మార్పు, ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడం, అంతర పంటల సాగు చేపట్టడం ద్వారా మరింత సమర్ధవంతంగా వ్యవసాయ దిగుబడులు సాధించడంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ విధానంలో మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు విజన్ డాక్యుమెంటరీ రూపొందించినట్లు తెలిపారు. వాటిని ఆచరణ సాధ్యం చెయ్యడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించడం కోసం సైద్ధాంతిక విధానంలో కాకుండా, ఆచరణాత్మక విధానంలో ఉండాలన్నారు. ఫసల్ బీమా యోజన పథకం అమలులో తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# నూత్న రీతిలో ఆనంద నిలయం విద్యార్ధుల నడుమ నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా అందరి భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించి, దేశ రాష్ట్ర అభివృద్ధిలో కాకినాడ జిల్లా కీలక భూమి గ్రహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థుల నడుమ జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి జేడీ జీ. శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. వినూత్న రీతిలో ఆనంద నిలయం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పండ్లు ఇతర వస్తువులు అందించి నూతన సంవత్సర శు



భాకాంక్షలు తెలియజేసారు. అనంతరం నూతన సంవత్సరం 2025 సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో పరస్పర శుభాకాంక్షలతో జరిగాయి. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకట రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు కలెక్టరేట్ ఏవో, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లాకు చెందిన పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నాతాధికారులు, పలువురు రెవిన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, పలువురు మండలస్థాయి అధికారులు, ప్రజలు పెద్దఎత్తున జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కు పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, టవల్స్ ఇతర కాస్మటిక్స్ వస్తువులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పురోహి తులు, వేద పండితులు జిల్లా కలెక్టర్ కు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కొత్త ఆశ యాలు, కొత్త అవకాశాలతో సరికొత్త ఆనం దాలతో అందరి జీవితాలు వెల్లి విరియాలని ఆయన ఆకాంక్షించారు.



## దివ్యాంగుల మధ్య నూతన సంవత్సర వేడుకలు



**అమలాపురం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

అమలాపురంలోని శ్రేయా దివ్యంగుల ప్రత్యేక పాఠశాలలో ఆంగ్లనూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి .ఈకార్యక్రమానికి ముందుగా కే వి ఆర్ రీసర్చ్ ఫౌండేషన్ అధ్యకులు,శ్రేయా స్కూలు డైరెక్టర్ డా.కె.శ్రీమన్నారాయణరావు అధ్యకులుగా కొత్త సంవత్సర ఆశలు,ఆశయాలు గూర్చి ముఖ్యంగా దివ్యాంగుల కార్యక్రమాలు గురించి,వారి అభివృద్ధి గురించి వివరించారు. ఇందుకు పలుకార్యక్రమాలు రూపొందించారు.ఈకార్యక్రమం లో ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు డా.వై అనంతలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు,దివ్యాంగుల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి వారి పురోగాభివృద్ధికి కృషి చేస్తూ తోర్పడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రేయా స్కూలు ప్రిన్సిపాల్ కొర్లపాటి దశరథ రామయ్య,ఉపాధ్యాయులు తులసి, పుష్ప , పద్మ,ప్రభా, కృష్ణవేణి,నాగలక్ష్మి,రేణుక, ఫిజియోథెరపిస్టు డా.నాజర్, శేఖర్,వెంకట లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లలకు,అతిథులకు చాక్లెట్లు, పండ్లు పంచిపెట్టారు .సక్యం తరపున 2025 సంవత్సరం కేలండర్లు డా.శ్రీమన్నారాయణ రావు అందజేశారు.

# ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



**పి.గన్నవరం ( అంబాజీపేట ) , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

పి.గన్నవరం నియోజవర్గంలోని నాలుగు మండలాలలో నూతన సంవత్సర వేడుకలు ఉల్లాసంగా జరిగాయి.పి. గన్నవరంలోని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ క్యాంప్ కార్యాలయం బుధవారం సందడిగా మారింది. పి. గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట , అయినవిల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల ఉద్యోగులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీస్ సిబ్బంది, ఎంపీపీలు జడ్పీటీసీలు,ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, రాష్ట్ర కార్పోరేషన్ల డైరెక్టర్లు, నీటి సంఘాల చైర్మన్ లు, డైరెక్టర్లు,ఉమ్మడి కూటమి శ్రేణులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు పోలబోకెలు, మిఠాయిలు తీసుకురావద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునివ్వడంతో పూల బొకేల స్థానంలో పుస్తకాలు... మిఠాయిల స్థానంలో కలాలు (పెన్నులు) అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి కూటమి శ్రేణులతో పాటు పి. గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.భీమ రాజు ఆధ్వర్యంలో పి.గన్నవరం,నగరం, అంబాజీపేట,అయినవిల్లి ఎస్ఐలు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో జి.సరోవర్ లకు ఉపాధ్యాయ సంఘాలు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ, సచివాలయ ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తహసిల్దార్ జె.వెంకటేశ్వరికి రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు శుభాకాంక్షలు అందజేశారు.అలాగే మాచవరం గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంత కుమారికి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది,నాలుగు గ్రామ సచివాలయాల సిబ్బంది, స్థానికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావుకు మాచవరంలో ఆయన స్వగృహం వద్ద పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు, టిడిపి,జనసేన,బిజెపి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## అట్టహాసంగా మల్లాడి కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు



**కాకినాడ రూరల్ , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

రాజకీయ రంగంతోపాటు సేవారంగంలోనూ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న మల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కార్యాలయం వద్ద అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకొని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా బుధవారం ఆయనను పలువురు జనసేన కార్యకర్తలు, అభిమానులు కలిసి పూలబొకేలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ నూతన సంవత్సరంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలుచేయాలని ఆకాంక్షించారు. మల్లాడిని కలిసిన వారిలో గంపల సత్యానందం, గరికిన రాంబాబు, దోని చిట్టిబాబు, కాటాడి ఆదినారాయణ, మల్లాడి సత్తిరాజు, వినాయక యూనియన్ వెంకటేశ్వరరావు, కిరణ్ , లంకాడి రాజు, వీర దుర్గాప్రసాద్, భాస్కర్, కోటేశ్వరరావు, రామకృష్ణ, కర్రి ప్రసాద్, ముక్కా సత్తిబాబు, చింతాకుల శ్రీను, పినపోతు నూకరాజు తదితరులున్నారు.

# ఘనంగా మంత్రి వాసంశెట్టి నూతన సంవత్సర వేడుకలు

**- నూతన సంవత్సరంలో ఆంధ్రరాష్ట్రం స్వర్ణాంధ్ర రాష్ట్రం కానుంది మంత్రి సుభాష్**

**రామచంద్రపురం , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

వి.ఎస్.ఎం కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి .నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వచ్చారు.అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులుతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.తమ అభిమాన నాయకుడు, మంత్రి వాసంశెట్టి సుభాష కి శుభాకాంక్షలు తెలిపేందుకు కూటమి నాయకులు,ప్రజలు, అభిమానులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగు



రాష్ట్రం స్వర్ణాంధ్ర అవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు. తెలుగు ప్రజలు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. 2025 సంవత్సరం అందరికీ ఆనంద కరమైన, ఆరోగ్యకర మైన జీవితం కలగాలని ఆకాంక్షించారు .2024 లో సంవత్సరంలో ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పని చేస్తోంది అన్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలను ఆవిష్కృతం చేసి, పేదవాడి భవిష్యత్కు భరోసా ఇస్తూ పింఛన్ల మొత్తాన్ని పెంచామన్నారు.ప్రతి ఇంట కట్టెల పొయ్యి కష్టాలు తీరుస్తూ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, ధాన్యం సేకరణ డబ్బులు 48 గంటల్లో చెల్లించి రైతన్నలో సంతోషాన్ని నింపా మన్నారు. మీ ప్రయాణం సాఫీగా సాగా లని రాష్ట్రంలో రహదారులన్నీ గుంతలు లేకుండా చేస్తున్నాం అని తెలిపారు. కొత్త ప్రభుత్వ పాలసీలతో మళ్లీ పెట్టుబడులు తెచ్చి ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్లు కృషితో నాంది పలికామన్నారు.

## భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తున్న అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయం సిబ్బంది

**అమలాపురం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

నూతన సంవత్సర సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు. మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన భక్తులు దర్శనం చేసుకుని అనంతరం భోజనశాలకు వెళ్లిన వారిని ఆలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆందోళన. భోజనానికి వచ్చిన భక్తులపై ఆలయ సిబ్బంది ఒకరు తమని బూతులతో తిట్టారని ఆవేదన. కొత్త సంవత్సరంలో విఘ్నాలు తొలగి సంవత్సరం అంతా మంచి జరగాలని మొక్కుకునేందుకు వచ్చిన భక్తులపై సిబ్బంది దుర్భాషలాడరని ఆలయం బయట ఆందోళన. అయినవిల్లి ఆలయంలో ఇదే మాదిరిగా గతంలో కూడా భక్తులపై సిబ్బంది విరుచుకు పడుతున్నారని పలు పిర్యాదులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపణలు. ఆలయంలో అధికారుల నిఘా లేకపోవడం సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆరోపణ.

## రేషన్ డిపో డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం : ఆర్డీవో శ్రీ రమణి

**పెద్దాపురం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

పెద్దాపురం డివిజన్ పరిధిలో వివిధ కారణాలు చేత ఖాళీలు ఏర్పడిన రేషన్ డిపో డీలర్ల నియామకానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో శ్రీ రమణి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఒకటో తేదీ నుండి ఈనెల 8వ తేదీ వరకు డీలర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. శాశ్వత ప్రాతిపదికన జరిగే ఈ నియామకాలు రాత పరీక్ష ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహించినట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుల మనకోసం స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయం ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రత్యక్షంగా గాని రిజిస్టర్ పోస్టు ద్వారా గాని దరఖాస్తులను ఈనెల 8వ తేదీలాగా ఆర్డీవో కార్యానికి అందజేయాలని సూచించారు. అంగీకరించబడవని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇది విధానాలు దరఖాస్తు ఫారం నందు వివరించబడి ఉంటాయన్నారు.అర్హత ఆసక్తిగల నిరుద్యోగులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## కార్తికేయుని ఆలయంలో లలితా పారాయణం

**శంఖవరం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

పవిత్ర ధనుర్మాసం పురస్కరించుకుని కార్తికేయని ఆలయంలో లలితా పారాయణం గావించారు మండలంలోని కత్తిపూడి లో గల స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గ్రామానికి చెందిన శ్రీ పార్వతి దేవి సత్సంగ భజన మండలి సభ్యులు లలిత విష్ణు సహస్రనామం భగవద్గీత పారాయణం చేపట్టారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ భగవత్ నామస్మరణతోనే అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చని హైందవ ధర్మం అన్నింటికన్నా గొప్పదని, నేటి ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక భావనల ద్వారానే మనసుకు ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీలకర్ర చక్ర కామేశ్వరరావు జిలకర లక్ష్మణరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు



## కొత్త సంవత్సరంలో రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దామని అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చిన మంత్రి దుర్గేష



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

కొత్త సంవత్సరంలో రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేసి సరికొత్త ఆంధ్ర ప్రదేశ్ ను నిర్మించుకుందామని ప్రజలందరికీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. బుధవారం నిడదవోలు లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ ను వేద మంత్రోచ్ఛరణల మధ్య వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం మంత్రి దుర్గేష్ ప్రజలతో కలిసి న్యూ ఇయర్ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల ప్రభుత్వ అధికారులు, మీడియా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు మంత్రి దుర్గేష్ కు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ తో కరచాలనం చేసిపలువురు ఫోటోలు దిగారు. పలువురు అభిమానులు మంత్రి దుర్గేష్ తో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలుపుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని అధికారులు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలు చూస్తారని మంత్రి వివరించారు.

ఈ సందర్భంగా న్యూ ఇయర్ క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలు, పలువురు అభిమానులు తమ అభిమాన నేత మంత్రి దుర్గేష్ ను కలిసామని ఆనందం వ్యక్తం చేస్తూ మురిసిపోయారు.

## నూతనోత్సాహంతో ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేద్దాం

### కలిసి కట్టుగా అడుగులు వేద్దాం : కలెక్టర్ పి. ప్రశాంతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

నూతన సంవత్సర వేళ ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను, ప్రజా ప్రయోజన పథకాలను అమలు చేయడంలో నూతనోత్సాహంతో పని చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్



ఛాంబర్ లో సాదాసీదాగా నూతన సంవత్సర వేళ అభినందనలు అందజేసేందుకు తనను కలిసిన అధికారులతో కలెక్టరు మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు అమలు చేయడం జరుగుతోందనీ, వాటిని విజయవంతంగా ప్రజలకి చేరవేయడం లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తితో సమిష్టిగా పని చెయ్యడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా సమిష్టిగా అడుగులు వేద్దాం అన్నారు. నూతన సంవత్సర సందర్భంగా కలెక్టర్ ను కలిసిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్, ఆర్డీఓ లు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, సమాచార



శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, అధికార, అనధికారులు కలవడం జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందిన కారణంగా సంతాప దినాలు నేపధ్యంలో ఆడంబరాలకు దూరంగా నూతన సంవత్సర కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఏపీఈఆర్‌సీ సభ్యునిగా 'జమీల్ '



**అంబాజీపేట , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సభ్యునిగా అంబాజీపేట మండలం మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ముత్యాల శ్రీరామ నాగేంద్ర ప్రసాద్ (జమీల్) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 967ను డిసెంబరు 27న విడుదల చేసిందని జమిల్ బుధవారం తెలిపారు. ఏపీఈఆర్‌సీ సభ్యునిగా జమీల్ మూడేళ్ళు సేవలందించనున్నారు. విద్యుత్ ఛార్జీల టారిఫ్‌ను ఏపీఈఆర్‌సీ తయారు చేస్తోంది.దీని ఆదేశాల మేరకు రాష్ట్రంలోని నాలుగు డిస్కంలు పనిచేస్తుంటాయి. ఇంతటి కీలకమైన పదవికి తనను ఎంపిక చేయడం పట్ల జమీల్ రాష్ట్ర ప్రభుత్వానికి, భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్)కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, నాణమైన్య విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి ఏటా బహిరంగ విచారణ నిర్వహించే ఏపీఈఆర్‌సీకి రైతులకు సంబంధించిన పలు సమస్యలను జమీల్ వారికి నివేదించేవారు .ఇప్పుడు ఇదే సంస్థకు సభ్యుడు కావడం విశేషం. జమీల్ తొలి నుంచి రైతు ఉద్యమ నాయకునిగా పని చేస్తున్నారు. బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యాక్షునిగా ఉన్న ఆయన ప్రస్తుతం నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, జనరల్ కౌన్సిల్ సభ్యునిగా గత నాలుగు సంవత్స రాల నుంచి సేవలందిస్తున్నారు. ఏపీఈ ఆర్‌సీ సభ్యునిగా నియమించ బడిన జమీల్ కు బికేఎస్ సభ్యులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

## వివాదాలకు వేదికగా మారుతున్న అక్రమ రవాణా

**సీతానగరం , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

మండలంలో బొండు మట్టి అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది. సీతానగరం కైలాసగిరి ఇసుక రేవు నుంచి రవాణా పెద్ద ఎత్తున సాగుతుంది. అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ దందా అడ్డూ అదుపూ లేకుండా సాగుతుండగా రెవెన్యూ అధికారులు కనీసం స్పందించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. అనుమతులు, అధికారులు అనేవి ఏమీ పట్టించుకోకుండా కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టా రాజ్యంగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు అపరిమిత వేగంతో మట్టి రవాణా చేస్తూండగా రహదారిపై వెళ్ళే ప్రయాణికు ల్లో భయభ్రాంతులకు గురవుతున్నారు. మట్టి కళ్ళల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీస పట్టించుకోవడం లేదని



అంటున్నారు. మట్టి కళ్ళల్లో పడితే అడుగుతుంటే గొడవలకు దిగుతున్నారని ప్రయాణికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణా లో ఎక్కువ సార్లు లోడు వేయాలనే ఉద్దేశంతో వేగంగా వెళ్ళడం ర్యాంపు లో గొడవలు జరుగుతుండడం సాధారణంగా మారింది. వివాదాలు పెద్దవి కాకుండా ప్రమాదాలు జరగకుండా అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కంచి మేక బండి..చూద్దాం రండి

### - వినూత్నంగా తయారుచేసిన మీటర్ పరిమానం గల బండి

**అంబాజీపేట , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

మీటర్ కొలబద్ద పరిమానంలో ఇనుప గొట్టాలు, రేకులు, ప్లాస్టిక్, కలప వస్తువులతో వినూత్నంగా తయారుచేసిన బండి ఆకట్టుకుంటుంది.ఆ బండికి కంచి మేకను కట్టి, నాలుగేళ్ల చిన్నారి బండిని తోలుతున్న దృశ్యం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. అంబాజీపేట పశువుల సంత ఆవరణలో ఉన్న కార్ మెకానిక్ యర్రంశెట్టి శ్రీను సుమారు పదివేల రూపాయల ఖర్చుతో ఒంటెద్దు బండి మాదిరి తయారు చేయించారు.ఆ బండికి కంచి మేకులు కట్టి తన నాలుగేళ్ల కుమార్తె భవ్యశ్రీని కూర్చోబెట్టి బండిని తోలించి



మురిసిపోయాడు. ఈ విషయం తెలిసిన స్థానికులు బండిని, కంచి మేకను చూసేందుకు వస్తున్నారు.

## తోట త్రిమూర్తులు ఆద్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

### - భారీ జన సందోహం...
### - తరలి వచ్చిన వైసిపి కార్యకర్తలు...



**మండపేట , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను కలిసేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు మండపేట తరలి వచ్చారు. జిల్లా వైసిపి అధ్యక్షులు, మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కార్యలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు బుదవారం ఘనంగా నిర్వహించారు. మండపేట, రామచంద్రపురం నియోజక వర్గాలు తో పాటు జిల్లా లోని మిగిలిన ఐదు నియోజకవర్గాలు నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యలయం కు పోటెత్తారు. ఉదయం నుంచే అభిమానులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ లు, జెడ్పీటీసీ లు, ఎంపిపి లు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఉద్యోగులు తరలివచ్చారు. కార్య కర్తలు భారీ గజ పూల మాలలతో ముంచెత్తారు. జై తోట నినాదాలు మిన్నంటాయి. వివిధ కుల సంఘాల నాయకులు ఆయన్ను సత్కరించారు. ఆటో యూనియన్ నాయకులు ,వివిధ కార్మిక కర్షక సంఘం నాయకులు శుభాకంక్షలు తెలిపారు. వచ్చిన వారందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

## నియోజవర్గం లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**పెద్దాపురం , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధాన పార్టీల నేతలు కార్యకర్తలకు అభిమానులకు అందుబాటులో ఉండడంతో ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకరంగా జరిగాయి. ఆయా పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు పోటీలు పడ్డారు పెద్దాపురం నియోజవర్గం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అచ్చంపేటలో కార్యకర్తలకు అందుబాటులో ఉండగా నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తలు కూటమి సభ్యులు అధిక సంఖ్యలో అచ్చంపేట చేరుకొని ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు అందజేశారు. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు తన స్వగృహంలో సామర్లకోటలో అందుబాటులో ఉండగా వైసిపి చెందిన సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు వివిధ సంఘాల నేతలు పార్టీ కార్యకర్తలు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొని దొరబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు

## జనసేన విస్తృతస్థాయి సమావేశం

**ముమ్మిడివరం , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

ముమ్మిడివరం నియోజవర్గ జనసేనపార్టీ విస్తృతస్థాయి సమావేశం ముమ్మిడివరం మండలం కొమానపల్లి గెస్ట్ హౌస్ నందు జరిగింది.ఈ కార్యక్రమానికి నియోజవర్గం నుండి భారీగా మండల, గ్రామ కమిటీ సభ్యులు కార్యకర్తలు హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గత ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఏమీ ఆశించకుండా శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు కి మద్దతు తెలిపి గ్రామాల్లో వారి గెలుపుకై కృషి చేసిన జనసేన కార్యకర్తలను నాయకులను గౌరవించే విధంగా నామినేటెడ్ స్థానిక సంస్థల్లో జనసేన పార్టీకి 30% పదవులు కేటాయించే విధంగా పార్టీ అధిష్టానానికి, శాసనసభ్యుని దృష్టికి తీసుకువెళాలని నిర్ణయించుకున్నారు.ఈ సందర్భంగా పలు కార్యకర్తలు గ్రామాల్లో తెలుగుదేశం నాయకులతో ఉన్న ఇబ్బందులను పరిష్కరించే విధంగా నాయకులు మండల అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కార్యకర్తలకు ఎటువంటి సమాచారం అందటం లేదని మండల అధ్యక్షులని, నాయకుల్ని నిలదీశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు,



నాయకులు మాట్లాడుతూ సమాచారం మాకు కూడా పూర్తిగా అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ,ఇకనుంచి అటువంటివి జరగబోవని, శాసనసభ్యులు బుచ్చిబాబు చెప్పినట్లు కార్యకర్తలకు తెలిపారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న మండల అధ్యక్షులకు, నాయకులకు తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామని శాసనసభ్యులు హామీ ఇచ్చారని తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నీటి సంఘం సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులుగుద్దటి జమ్మి,గోదశి పుండరీష్,కుడిపూడి శివన్నారాయణ, మండల అధ్యక్షులు దూడల స్వామి,మద్దింశెట్టి పురుషోత్తం, అత్తిలి బాబురావు,కర్రా దుర్గాప్రసాద్,మోకా బాల ప్రసాద్,పుణ్యమంతులసూరిబాబు, లంకలపల్లి జమ్మి, ఓగూరి భాగ్యశ్రీ, బద్రి రమ,మాదాల శ్రీధర్,నూకలదుర్గ,గాలిదేవర బుల్లి,విళ్ల వీరా,కొప్పిశెట్టి గణేష్, సవరపు వెంకట్, ఎలమంచిలి బాలరాజు, త్సవటపల్లి మణికుమార్, వలవల శ్రీను,విత్తనాల అర్జున్,పెన్నాడ శివ ,దూళిపూడి గోపి,చోడిశెట్టి నాగు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



**అమలాపురం , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

నూతన 2025 సంవత్సర ఎఫ్ఎన్పివో పోస్టల్ యూనియన్ క్యాలెండర్ ను అమలాపురం డివిజన్ పోస్టల్ ఎస్పీ ఆర్ నవీన్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ నవీన్ కుమార్ మాట్లాడుతూ పోస్టల్ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని అండగా ఉంటానని హామీ ఎస్పీ ఇచ్చారు.ఉద్యోగుల సమస్యలేంవున్నా తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తా అని తెలిపారు.డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి వేడుక జరుపుకున్నారు.

ఈనూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీధరం,పోస్టల్ ఇన్స్పెక్టర్ లు వంశీ,ఆమర్నాథ్, ఎఫ్ ఎన్ పి ఓ యూనియన్ నాయకులు ఎం.ఏకాంబరం, ఎం.నరసింహం ,బి.అనిల్,సురేష్, సాయిక్రిష్ణ, శివకృష్ణ,రవి కృష్ణ, మహాలక్ష్మి,పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎండిఓకు శుభాభినందనలు తెలిపిన వెల్ఫేర్ అసిస్టెంట్లు

**రౌతులపూడి , జనవరి 01, ( ప్రభాతవార్త ) :**

ఆంగ్ల నూతన సంవత్సర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎండిఓ జి శివరామకృష్ణకు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పుష్పగుచ్చం ఇచ్చి శుభాభినందనలు తెలిపారు. ఒకరోజు ముందుగానే సామాజిక పింఛన్లు పంపిణీ చేయడంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు చూపిన చొరవ ను ఎండిఓ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్థాయిలో వారందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి కలిసి శు



భాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వెల్ఫేర్ అసిస్టెంట్లు పి దుర్గా ప్రసాద్, బి కొండబాబు, డి రాజేంద్రప్రసాద్, జి. కుసరాజు, ఆర్ శ్రీనివాస్, కే సత్యవతి, ఆర్ అరుణశ్రీ, పంచాయతీ కార్యదర్శులు ఎం. వి. ఎస్.రెడ్డి, శివ బాబు, శ్రీనివాస్, శివ, శివ శంకర్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

### - ఎమ్మెల్యే సత్యానందరావుకు శుభాకాంక్షల వెల్లువ

**కోనసీమ బ్యూరో , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు .నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వాడపాలెం వెంకటేశ్వర స్వామివారి ఆలయ





అధికారుల ఆధ్వర్యంలో వేద పండితులు ఎమ్మెల్యే స్వగృహం వద్ద సత్యానందరావు కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందజేశారు. కొత్తపేట నియోజకవర్గం ప్రజలు, తెలుగుదేశం,జనసేన,భాజపా కూటమి నాయకులు, అధికారులు,ఉద్యోగులు భారీ సంఖ్యలో సత్యానందరావు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చి ఎమ్మెల్యేకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరం అందరికీ విజయాలను ప్రసాదించాలని సత్యానందరావు ఆకాంక్షించారు.

## పోటెత్తిన జనం..ఎమ్మెల్యే యింట న్యూ ఇయర్ సందడి

**మండపేట , జనవరి 01 ( ప్రభాతవార్త ) :**

రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు యింట న్యూ ఇయర్ సందడి నెలకొంది. ప్రతి ఏడాది ఆయన యింటి వద్ద న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కేపి రోడ్డు పాటి మీద ఆయన నివాసం వద్ద జనం పోటెత్తారు. జాతర ను తలపించే విధంగా నియోజక వర్గ వ్యాప్తంగా ప్రజలు తరలి వచ్చారు.ఇక అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయం, మునిసిపాలిటీ ఇలా అన్ని శాఖల ఉద్యోగులు అధికారులు ఎమ్మెల్యే వద్ద కు క్యూ కట్టారు.శుభాకంక్షలు తెలిపారు. శాలువా తో ఎమ్మెల్యే ను సత్కరించారు. కొందరు కేకులు తీసుకు వచ్చి కట్ చేయమంటే ఎమ్మెల్యే సున్నితంగా తిరస్కరించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలకు ఆలస్యం అవుతుందని వారించారు. ఇక ఫోటోలు కూడా తీయకుండా వరసగా అందరినీ నుండి శుభాకంక్షలు అందుకున్నారు. పూల మాలలు వేయవద్దని కోరారు. వచ్చిన వారందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



జీసెల్ పెలికో సాధారణ మహిళ ఎన్నడూ స్త్రీవాదిగా మారాలనుకోలేదు. లైంగిక హింసకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడతాననీ అనుకోలేదు. కాని వచ్చింది. మాట్లాడింది. తన మీద భర్త జరిపిన అకృత్యం, , ఆరాచకం అమానుషం అందరికీ తెలిసేలా చేసింది. పోయించి నా సిగ్గు కాదు... నేరస్థులదే.. చూడాల్సింది నన్ను కాదు వాళ్లనే' అంటూ నిక్కచ్చిగా చెప్పింది. 72 ఏళ్ల వయసులో ఆమె ధైర్యం, పోరాటం ప్రపంచాన్ని కదిలించాయి. ఆ దేశాధ్యక్షుడూ మంత్రులు ప్రపంచ నాయకులూ మెచ్చుకునేలా చేశాయి. ఫెమినిస్ట్ ఐకాన్‌ని చేశాయి.

**2004 సెప్టెంబరు 2...**దక్షణ ఫ్రాన్స్‌లోని అవిగ్నాన్ ప్రావిన్స్ కోర్టు మెట్లు ఎక్కేవరకు ఆమెవరో లోకానికి తెలియదు. ఆ తరవాతే అంతర్జాతీయ పత్రికలన్నీ జోసెల్ గురించి ప్రముఖంగా రాశాయి.కోసిల్. మేం మీతో ఉన్నాం. మేలో నన్ను నేను చూసుకుంటున్నా 'ధన్యవాదాలు' అంటూ కోర్టు బయట ప్లకార్డులు పట్టుకుని ఎందరో ఆమెకు మద్దతిచ్చారు.

# ఆమె ధైర్యం, పోరాటం ఓ సంచలనం..

అసలేం జరిగింది? 2011-2020 దాదాపు పదుళ్లు.. భర్త డొమినిక్ రహస్యంగా మత్తుమందులిచ్చి జీసెల్‌పై అత్యాచారం చేశాడు. అక్కడితో ఆగలేదు. ఓ వెబ్‌సైట్ ద్వారా మరో 83 మందిని ఆహ్వానించి అపస్థాపన చేసిన ఆమెపై అత్యాచారం చేయించాడు అవన్నీ చిత్రీకరించాడు. ఇవేమీ తెలియని ఆమె తన పని చేసుకోనేది. జీసెల్ ఫెంచ్ సైనికుడి కుమార్తె స్టేట్ ఎలక్ట్రిసిటీ కంపెనీలో ఉద్యోగి డొమినిక్ ఎలక్ట్రిషియన్ రియల్ ఎస్టేట్ ఏజెంట్ వీళ్ల వివాహం 1973లో జరిగింది ముగ్గురు పిల్లలు తరవాత వివిధ వ్యాపారాలు చేసి విఫలమయ్యాడు డొమినిక్ 2001లో ఆర్థికపరమైన గొడవలతో ఇద్దరూ విడాకులు తీసుకునా కానీ సర్దుబాటు చేసుకుని 2007లో మళ్లీ పెళ్లి చేసుకున్నారు. జీసెల్ రిటైరయ్యాక... ఆగ్నేయ ఫ్రాన్స్‌ని మాజెన్ అనే గ్రామంలో నివసించసాగారు. సెలవుల్లో వచ్చే పిల్లలూ మనవలతో వారి జీవితం హాయిగానే సాగేది. ఆరోగ్యరీత్యా జీసెల్ నిద్రపట్టడం కోసం కొన్ని మందులు వాడేది అదే అవకాశంగా ఆహారం, పానీయాల్లో మత్తు మందులు కలిపేవాడు డొమినిక్, జీసెల్ తెలుసుకోలేకపోయింది. అయితే తరచూ మతిమరపునకు గురయ్యేదామె. అల్జీమర్స్ లేదా బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందేమో అనుకునా పరీక్షలు చేయిస్తే... లేదని తేలింది. అక్కడికి అనుమానం వచ్చి మత్తుమందు ఏమైనా ఇస్తున్నా అని భర్తని అడిగింది. అతను కాదనడంతో వయసుతో వచ్చిన సమస్యలేమో అనుకుంది. 2020లో స్థానిక సూపర్ మార్కెట్లో కొందరు మహిళల్ని అశ్లీలంగా ఫొటోలు తీస్తూ పోలీసులకి చిక్కాడు డొమినిక్, దర్యాప్తులో భాగంగా అతని కుప్యూటర్లోని ఫోల్డర్లు చూసి పోలీసులు విస్తుబోయారు. హర్ రేష్, అబ్యూజ్, నైట్ అలోన్... వంటి పేర్లతో ఉన్న వాటిల్లో రెండువేలకు పైగా ఫొటోలూ వీడియోలూ ఉన్నాయి. వాటిల్లో ఆమెపై అత్యాచారం చేసినవే కాదు, కూతురు, కోడళ్ల నిద్రిస్తున్నప్పుడూ వాష్‌రూమ్‌లో ఉన్నప్పుడూ రహస్యంగా తీసిన ఫొటోలూ ఉన్నాయి. అవి చూసిన క్షణం జీసెల్ మానసికస్థితి ఏ ఊహకి అందనిది. యాభయ్యేళ్ల నమ్మకం నిలువునా కూలిపోయింది. భూమి బద్ధలై అందులో కుంగిపోతే బాగుడు అనుకుంది. కుటుంబసభ్యుల అండతో ధైర్యాన్ని కూడగటుకుంది. భర్తకు విడాకులిచ్చింది. డొమినిక్తోపాటు తనమీద అత్యాచారం చేసిన మరికొందరిపై కేసు పెట్టింది. ఈ ఏడాది సెప్టెంబరులో కేసు తుది విచారణకు వచ్చింది. అప్పుడు తొలిసారిగా అజ్ఞాతం నుంచి జనం ముందుకు వచ్చింది జీసెల్, కోర్టు విచారణ బహిరంగంగా జరగాలని కోరింది. మీడియాని ఆహ్వానించింది. పేరు, ఫొటో ప్రచరించమంది. ఇదే.. ఈ కేసులో అతిపెద్ద సంచలనం.లైంగిక నేరాల్లో నేర సాక్ష్యాలు ఉండవు. అదృష్టంకొద్దీ నాకు ఉన్నాయి. నిజానికి నా ప్రపంచం చాలా చిన్నది. దీన్ని తట్టుకోవడం అత్యంత కష్టమైన విషయమే. కానీ నిరసన హింసకు గురైనవాళ్లకు మద్దతు తెలిపేందుకూ, నా కుటుంబం, మనుమరాళ్ల ధైర్యంగా ఉంచేందుకే ఈ పోరాటం, నా మీద అకృత్యం జరిపినవాళ్లలో నా మనవడి వయసున్న వాణ్ణి చూసి గుండె పగిలిపోయింది. అతనికి నేను బామ్మలా కనిపించలేదా.... అందుకే అనిపించింది... షేమ్ మస్ట్ చేంజ్ సైడ్స్... లైంగకనేరాల విచారణలో అందరి చూపులూ బాధితుల నుంచి నేరస్థులవైపు మళ్లాలి" అన్న జీసెల్ జనం నీరాజనం పలికారు. వీధుల్లో ఆమె చిత్రాలే... గోడలపై ఆమె గురించిన నినాదాలే... స్త్రీవాదులు, మీటూ ఉద్యమకారులు... ఇలా ప్రపంచమంతా జీసెల్కు న్యాయం జరగాలని ఆశించింది.

**తీర్పు వచ్చింది.** 10 డిసెంబరు 2004న... డొమినిక్కి 20 ఏళ్ల శిక్ష పడింది. మరో యాభై మందికి 3 నుంచి 15 ఏళ్ల శిక్ష ఖరారైంది. అది విన్నా... నేను కోర్టు తీర్పుని గౌరవిస్తాను. నాలాంటి సాధారణ మహిళకి మద్దతునిచ్చిన అందరికీ కృతజ్ఞతలు. స్త్రీపురుషులిద్దరూ గౌరవంగా పరస్పర అవగాహనతో కలిసి జీవిస్తారనే నమ్మకం కలిగింది అంటూ తొణకని ఆత్మవిశ్వాసంతో చెప్పింది జీసెల్, మున్ముందు ఈ కేసు మరెన్నో మలుపులు తిరగొచ్చు. బాషకు సైతం అందని ఆ మృగాళ్ల దారుణానికి పడిన శిక్ష సరిపోదనే వాదనలూ ఉన్నాయి. అవన్నీ ఎలాగున్నా ఆమె ధైర్యానికి పోరాటస్ఫూర్తికి ప్రతి మహిళా హ్యాట్సాప్ చెప్పాల్సిందే..

## తిరుప్పావై

### 19వ పాశురము



కుత్తువిళక్కెరియ క్కోట్టుక్కాల్
కట్టిన్మేల్,
మెత్తైన పణ్యశయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూంగుళల్ నప్పిన్నై
కొంగైమేల్
వైత్తుక్కిడన్ద మలర్‌మార్ పా!
వాయ్ తిరవాయ్,
మైత్తడం కణ్ణినాయ్! నీ ఉన్
మణాళనై,
ఎత్తనైపోదుమ్ తుయిలెళ
వొట్టాయా కాణ్,
ఎత్తనై యేలుమ్ పిరివాత్త
కిల్లాయాల్,
తత్తువమన్ను తగవేలో
రెమ్బావాయ్

ఆ గదిలో గుత్తిదీపములు వెలుగు చూస్తున్నవి. అందులో దంతకోళ్ళు గల మంచము. వేసవిలో చల్లదనము శీతాకాలములో వెచ్చదనము యివ్వగల, తెల్లదనము, మెత్త ధనము, పరిమళముగల విశాలమైన పడక ఉన్నది. కాటు కను విశాలమైన కనులకు అలంకరించుకొన్న, గుత్తులు గుత్తులుగ పూలను తన కొప్పులో అలంకరించుకొన్న నీలా దేవి పడుకొని యున్నది. ఆమె స్థానములపై, విశాల వక్ష స్థలముగల కృష్ణుడు తన శరీరమును ఆనించినాడు.ఒక క్షణమైన కృష్ణుని నీ నుండి ఎడబాటు చేయవా? అది నీ స్వభావమునకు తగదమ్మా ! అని నీల దేవితోను, ఒకమారైనా పలకవా అని కృష్ణునితోను, వెలుపలి గోపికలు అంటున్నారు. ఫలం: "పరమాత్మ తత్తం"

# పరిశుభ్రతలో పండ్ల తొక్కలు !

విటమిన్లు పుష్కలంగా ఉండే పండ్లు ఆరోగ్య పరిరక్షణకే కాదు, ఇంటి పరిశుభ్రతనే. పనిచేస్తాయని తెలుసా అయితే ఈ మాయ చేసేది మాత్రం వాటి తొక్కలు, సాధారణంగా ఇంటి క్రిమింగ్‌లో రసాయనాల ద్రావణాలను వినియోగించి రకరకాల అలర్జీలకు గురి అవుతుంటాం. ఇవి వాటి నుంచి మనల్ని కాపాడటమే కాదు... పర్యావరణానికి హాని కలిగించవు. అదెలాంటే...

నిమ్మ, నారింజ పండ్లలో సిట్రిక్ యాసిడ్ పుష్కలం. దీంతో వీటి



తొక్కలు క్లీనింగ్ ఏజెంట్‌గా మురికిని ఇట్టే పోగడతాయి. ఈ పండ్ల తొక్కలను గుప్పెడు తీసుకుని ఓ ప్లాస్టిక్ పాత్రలో వేయాలి. ఇందులో అయిదారు చెంచాల వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి మూతపెట్టాలి. ఈ మిశ్రమాన్ని రెండు లేదా మూడువారాలు నాననివ్వాలి. ఆ తర్వాత దీన్ని వడకట్టి సమపాళ్లలో నీటిని కలిపితే అల్పర్పస్ క్లీన సిద్ధమవుతుంది. దీన్ని స్ప్రేబాటిల్లో నింపి తలుపులు, కిటికీలు, టీపాయి అద్దాలు, పొయ్యి చుట్టుపక్కల దిమ్మ వంటింట్లోని సింక్ వంటివాటిపై స్ప్రేచేసి పదినిమిషాల తర్వాత తుడిస్తే చాలు. మురికి దూరమవుతుంది.

**అద్దాలకు ప్రత్యేకం...**అరటిపండు తొక్క అర్ధాలకు ప్రత్యేక క్లీనర్గా పనిచేస్తుంది. మురికి ఉన్న చోట ఈ పండు తొక్క లోపలివైపుతో మృదువుగా రుద్దాలి. ఆ తర్వాత మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు. ఈ తొక్కలోని స్టార్చ్ మురికిని, మచ్చలను తొలగిస్తుంది.

**మైక్రోవేవ్ అవెన్‌ను..** ఇందులో ఆహారపదార్థాల అవశేషాలు ఉండిపోయి వేడికి ఎండిపోతాయి. వాటిని సాధారణంగా క్లీన్ చేయడం కష్టమవుతుంది. గుప్పెడు నిమ్మతొక్కల ముక్కలను నీటిని నింపిన బౌల్లో వేసి అయిదు నిమిషాలపాటు మైక్రోవేవ్లో ఉంచి వేడి చేయాలి. నిమ్మరసం ఆవిరి లోపలంతా వ్యాప్తి చెందుతుంది. అపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాలు ఎండిపోయి అవెన్కి పట్టేసిన పదార్థాలన్నింటినీ తేలికగా తుడిచేయొచ్చు.

**ఫర్నిచర్ :** సోఫా, టీపాయి, డైనింగ్ టేబుల్‌వంటి చెక్క ఫర్నిచర్‌పై దుమ్ము ఎక్కువగా పేరుకుంటుంది. క్రమేణా ఇది మరకలుగా మారుతుంది. కొన్నిసార్లు నూనె జిడ్డు అంటుకుని ఎంత శుభ్రం చేసినా పోదు. ఇటువంటి మరకలను దూరం చేయడానికి పండ్ల తొక్కలు చాలు. నారింజ, నిమ్మ లేదా అరటి పండు తొక్క లోపలివైపుతో మరకలున్న చోట మృదువుగా రుద్ది, ఆపై మెత్తని వస్త్రంతో తుడిస్తే చాఉ. ఆ ప్రాంత మంతా క్షణాల్లో శుభ్రపడు తుంది.

# వేడి ఆవిర్లను తగ్గిస్తాయి

మహిళల్లో వివిధ దశల్లో ఏర్పడే హార్మోన్ల అసమతౌల్యత, గ్యాస్ సమస్యల్ని తగ్గించుకోవడానికి ఆహారమూ కొంతమేర సాయపడుతుంది. అదెలాగంటే..

ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి, ముఖ్యంగా పాలకూర, ముల్లంగి ఆకు, యాపిల్, దోస, బొప్పాయిల్లో ఎక్కువగా పీచు ఉంటుంది. వీటిల్లోని ఫైబర్ జీర్ణ సమస్యల్ని తగ్గిస్తుంది. ఇందులోని పోషకాలు హార్మోన్ల పనితీరునీ క్రమబద్ధీకరిస్తాయి.

సంప్రదాయ ఆహారంగా, సుగంధ ద్రవ్యాల్లో ఒకటిగా పిలిచే జీల కర్రకు జీర్ణ వ్యవస్థ పనితీరుని మెరుగుపరి చేశక్తి ఎక్కువట. ఇందులోని ఐరన్ రక్తహీనత సమస్య ను రానివ్వదు. జీలకర్ర లో ప్లాంట్ బేస్డ్ కాంపౌండ్స్ అధికం. ముఖ్యంగా ఫైటో ఈస్ట్రోజన్లు... మహిళల్లో మెనోపాజ్ దశలో కనిపించే మూడ్ స్వింగ్స్, వేడి ఆవిర్లను తగ్గిస్తాయి.



హార్మోన్ల అసమతౌల్యతను సక్రమంగా చేసే సహజ మూలికగా అల్లానికి పేరు. ఇందులోని జింజిరోల్స్ జీర్ణశక్తిని మెరుగు పరిచి హార్మోన్ల పనితీరుని బాగు చేస్తాయి.

# అభద్రతా భావం బయటపడాలంటే..

కొంతమంది తమలో సమర్థత ఉన్న తమను తాము తక్కువగా అందూ వేసుకుని అభద్ర లోనవుతుంటారు. ఇలా వివిధ కారణాలతో అభద్రతా భావానికి లోనై మానసిక వేదన పడేవారి సంఖ్య ఇటీవల పెరిగి పోతోందని నిపుణులు చెబుతున్నారు. దీనిని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ మనలోని అభద్రతా భావాన్ని ఎలా. గుర్తించాలి? దీన్నుంచి ఎలా బయటపడాలి?

వాటిని చేరుకోలేక పోతే కుంగి పోవడం అభద్రతకు లోనయ్యే వారిలో కనిపించే ముఖ్య లక్షణాలను నిపుణులు చెబుతున్నారు. తెలుసుకుందాం రండి..

**తక్కువ చేసి చూసుకొని..**
ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉం టుంది. కానీ కొంతమంది మాత్రమే దానిని సరైనది. పద్ధతిలో వినియోగించు కుంటారు. అయితే అభద్రతా భావం ఉన్న వారిలో కూడా మంచి నైపుణ్యాలున్నా.. తమను తాము తక్కువగా అంచనా వేసుకుంటారని నిపుణులు అంటున్నారు. వాడు సరిగా పని చేసిన తరచుగా ఇతరుల అభిప్రాయం అడుగుతుంటార! అవతలి వారి నుంచి సానుకూల స్పందన వస్తేనే సంతృప్తి పడడం.. లేదంటే బాధపడడం జరుగుతుందిట. అయితే వారు ఇలాంటి స్వీయ నమ్మకం పెంపొందించు కోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



**ఇతరులతో పోల్చుకుంటూ...**
అభద్రతకు లోనయ్యే వారు ఇతరులతో ఎక్కువగా పోల్చు కుంటారు. వారు సాధిం చిన విజయా లను సాధించా లని ఆరాట పడడం, వారిపై అసూయ పడడం, ఒకవేళ కనపడకపోతే

**నిందించడమే పనిగా..!**
అభద్రతా భావం ఉన్న వారు తమ సమస్యను పరిష్కరించు కోవడానికి బదులుగా కప్పిపుచ్చు కోవడానికి ఎక్కువగా ప్రయత్నిస్తారు ఈ ఆశిస్తున్న వారి లోపాలకు ఇతరులను బాధ్యులను చేస్తూ వారిని నిందిస్తుంటారు. అయితే వీరు అప్పటికప్పుడు సంతృప్తి పొందినా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కాబట్టి ఇలాంటి స్వభావం ఉన్న వారు తమ సమస్యను. పరిష్కరించేందుకు నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది.

**భవిష్యత్తు గురించి ఆందోళన..** అభద్రతాభావం ఉన్నవారిలో భవిష్యత్తు గురించిన ఆందోళనలు ఎక్కువగా ఉంటాయి. ఈ ప్రతి చిన్న విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. ఇది క్రమంగా ఒత్తిడికి దారి తీస్తుంది. ఆ ఒత్తిడిని ఇతరులపై చూపించడం వల్ల రిలేషన్‌లోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే వీరు ఇతరులను, చివరికి సన్నిహితులను కూడా నమ్మడానికి వెనకాడుతారు! ఇది క్రమంగా మానసిక సమస్యలకు దారి తీసే అవకాశం ఉంటుంది.కాబట్టి ఇలా అభద్రతా భావంతో బాధపడే వారు.. దీన్నుంచి బయటపడాలంటే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, స్వీయ ప్రేమను పెంచుకోవడం ముఖ్యం. వీటికి తోడు నిపుణుల సలహాలు పాటిస్తే ఈ సమస్య నుంచి త్వరగా బయటపడచ్చు.

## ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా
ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్,
డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
e mail: cheli@vaartha.com

# ఉన్నట్టుండి ఏడుస్తున్నారా?

పసిపిల్లలు విద్రలో ఉన్నట్టుండి ఏడుస్తుంటారు. అసలు వాళ్లు ఎందుకు ఏడుస్తున్నారో తెలియక కొత్తగా తల్లైనవారు కంగారు పడుతుంటారు. అయితే నెలలు నిండుతున్న పిల్లలు రాత్రుళ్లు ఏడవడానికి ఖిసెపరేషన్ యాంగ్జైట్ ఒక కారణమంటు న్నారు నిపుణులు. అదేంటి? దాన్ని ఎలా అధిగమించాలంటే...

6 నుంచీ 10 నెలల వయసున్న పిల్లలు నెమ్మదిగా చుట్టూ ఉన్న వాతావరణాన్నీ మనుషుల్నీ గుర్తుపట్ట డం ప్రారంభిస్తారు. వాళ్ల అలనాపాలనా చూసుకునే తల్లిని అంటిపెట్టుకుని ఉండాలను కుంటారు. వాళ్ల కనపడకపోతే ఏడుస్తారు. అదే రాత్రుళ్ల నిద్రలోనూ గుర్తొస్తుందట. అందుకే ఉన్నట్టుండి ఉలిక్కిపడటం, ఏడవడం చేస్తుంటారు. దీన్నే సెపరేషన్ యాంగ్జైటీ అంటారు. అయితే ఇది పసిపిల్లల్లో సర్వసాధారణం. కంగారుపడ కుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్ని పెద్దవాళ్లకు నెమ్మదిగా అలవాటు చేయాలి. రోజులో కాసేపైనా కనిపించకుండా ఉండాలి. బయటకు వెళ్లొస్తుండాలి. అలాఅని వాళ్ల నిద్రపోయేట ప్పుడో, మిమ్మల్ని గమనించకుండా ఆడుకునేటప్పుడో కాదు. అలా చేయడం వల్ల నిద్రలేచేటప్పటికి మీరు లేకపోతే వారిలో ప్రతికూల భావాలు ఏర్పడతాయి. అవే వాళ్లలో భయాన్నీ పెంచుతాయి. మీరు బయటకు వెళ్తున్నారు. తిరిగి వచ్చేప్పటికి కొంత సమయం పడుతుంది అన్న భావన వాళ్లలో కలిగేలా బయలుదేరాలి. అప్పుడే వారికి ఆ పరిస్థితి అర్థమవుతుంది. ఈ ఆందోళనా దూరమవుతుంది. అయితే ఇది నెలల పిల్లల్లోనే కాదు మూడేళ్ల వయసు వచ్చేవరకూ ఉంటుంది. అందుకే గృహిణులైనా, ఉద్యోగినులైనా పిల్లలతో కాసేపయినా ఎడబాటూ ఉండటం



# పంచరతన్ లడ్డు

కావలసిన పదార్థాలు: తెల్ల నువ్వులు: అర కప్పు, అవిసెలు: అర కప్పు, గుమ్మడి గింజలు: అర కప్పు, పొద్దు తిరుగుడు గింజలు: అర కప్పు, సబ్జా: అర కప్పు, ఎండు ద్రాక్ష : ఒక కప్పు, యాలకులు: రెండు లేదా మూడు.



తయారీ విధానం: ముందుగా అన్ని రకాల గింజల్నీ విడివిడిగా నూనె లేకుండా దోరగా వేయించుకోవాలి. చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి మెత్తగా పొడి చేసుకుని చివరగా ఎండుద్రాక్ష, యాలకులు వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. మెత్తగా అయిన మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని చిన్నచిన్న లడ్డూలు చుట్టుకుంటే సరి.

# జుట్టు ఆరోగ్యానికి జామాకు

ఈమధ్య కాలంలో చాలామందిలో కామన్గా కనిపిస్తోన్న సమస్య జుట్టు రాలడం. విపరీతమైన ఒత్తిడి, పోషకాహార లోపం, కాలుష్యం ప్రభావం.. ఇందుకు కారణ మవుతున్నాయి. అయితే జామాకుతో ఈ సమస్యకు చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు, జామాకుల్లో ఉన్న ఔషధ గుణాలు జుట్టు రాలడాన్ని అరికట్టి ఒత్తుగా పెరిగేలా చేస్తాయంటున్నారు.





జామాకుల్లో విటమిన్ 'సి' ఉంటుంది. ఇది శరీరంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచు తుంది. ఫలితంగా జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగు తుంది. ఈ ఆకుల్లో యాంటీ అక్సిడెంట్ గుణాలు సైతం ఉంటాయి. ఇవి ఫ్రీరాడికలేని శరీరం నుంచి బయటకు పంపించి వెంట్రుకలు డ్యామేజ్ కాకుండా కాపాడతాయి. అలాగే జామాకుల్లో ఉండే లైకోపీన్ హానికారక అతి నీలలోహిత కిరణాల నుంచి జుట్టుని సురక్షిస్తుంది. గిన్నెలో లీటరు నీటిని పోసి వేడి చేయాలి. ఇంట్లో శుభ్రం చేసిన జామాకులు వేసి 20 నిమిషాల పాటు మరిగించాలి. దీన్ని చల్లారనిచ్చి మరో గిన్నెలోకి వడకట్టుకోవాలి. ఈ మిశ్రమం హెయిర్ కండిషనర్గా పనిచేస్తుంది. షాంపూతో తలస్నానం చేసిన తర్వాత జుట్టు బాగా ఆరనివ్వాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేయాలి. అలాగే కుదుళ్లకు పట్టేలా పది నిమిషాల పాటు మర్ధన చేసుకోవాలి. ఇలా రెండు గంటలు ఉంచుకొని తర్వా త గోరువెచ్చని నీటితో జుట్టును కడిగేస్తే సరి. కురులు మృదువుగా, సిల్కీగా మారతాయి..

**చుండ్రుకు చెక్!** ఒత్తిడి, కాలుష్యం కారణంగా చాలామంది ఎదుర్కొంటున్న సమస్య చుండ్రు. దీనివల్ల దురదతో పాటు వెంట్రుకలు బాగా రాలిపోతుంటాయి. జామాకులతో తయారుచేసుకున్న హెయిర్ ప్యాక్ ఈ విషయంలో మంచి ఫలితాన్నిస్తుంది. జామాకులను బాగా ఎండబెట్టి పొడి చేసుకోవాలి. నీటిలో కొద్దిగా నీటిని కలిపి పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు సమస్య తగ్గుతుంది.




# రంగవల్లి





- శాంతి నర్వా
సరూర్‌నగర్

16 చుక్కలు
6 వరసలు
ఇటు అటు
వదిలి 6 వరకు





సూజాత పి.వి.ఎల్
సైనిక్‌పురి,
సికింద్రాబాద్

21 చుక్కలు
1 వరసలు
1 వచ్చే వరకు
సరి చుక్కలు

తెర

# మలయాళంలో భారీ ప్రాజెక్ట్ అనౌన్స్

గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా మలయాళంలో ఓ హ్యూజ్ మూవీని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి ఆవేశం ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో మంజుమ్మెల్ బాయ్స్ చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా, నిర్మాత వెంకట్ కె నారాయణ మాట్లాడుతూ, భాషలకు అతీతంగా ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనేది మా సంస్థ లక్ష్యం.



ఈ క్రమంలోనే మల యాళ చిత్ర పరిశ్రమ లోకి భారీ చిత్రాన్ని తీసుకురా బోతు న్నాం. మా సంస్థ నుంచి ప్రేక్షకులు ఆశించే హై క్వాలిటీ మూవీని టాలెంటెడ్ టీమ్‌తో కలిసి నిర్మించ నున్నాం అన్నారు. డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ, ఇలాంటి గొప్ప మూవీ కోసం నేను ఎదురు చూస్తు న్నాను. ప్యాషనేట్ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. మా విజన్‌ను త్వరలోనే ప్రేక్షకులకు చూపించేందుకు సిద్ధమవుతున్నాం అన్నారు. స్క్రిప్ట్ అందించిన జితూ మాధవన్ మాట్లా డుతూ, నా మనసుకు దగ్గరైన కథ ఇది. ఇలాంటి బ్యూటి ఫుల్ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ప్రేక్షకులకు ఒక మంచి మూవీని అందిస్తామని చెప్పగలను అన్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంధించిన కాస్టింగ్, రెగ్యులర్ షూటింగ్ వివరాలు మూవీ మేకర్స్ వెల్లడించనున్నారు. టెక్నికల్ టీమ్: ఎడిటర్: వివేక్ హర్షన్, డీపీవో: షైజు ఖాలిద్, మ్యూజిక్: సుషిన్ శ్యామ్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), రచన: జితూ మాధవన్, నిర్మాతలు: వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్, దర్శకత్వం: చిదంబరం.

# యూట్యూబ్‌ని షేక్ చేస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్

విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ కొలాబరేషన్‌లో హైలీ యాంటిసిపేటెడ్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. విడుదలైన మూడు పాటలు సెన్సేషన్ క్రియేట్ చేశాయి. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన గోదారి గట్టు, మీను, బ్లాక్ బస్టర్ పొంగల్ ట్రాక్స్ యూట్యూబ్, అన్ని మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో మోత మోగి స్తున్నాయి. బ్లాక్‌బస్టర్ పొంగల్ సాంగ్ ప్రస్తుతం 3వ స్థానంలో ఉంటూ పండగ వైబ్ ని రెట్టింపు చేసింది. మీను సాంగ్ 6వ స్థానంలో ఆడి యన్స్ అలరిస్తోంది. విడుదలైనప్పటి నుంచి టాప్ ట్రెండింగ్‌లో వున్న గోదారిగట్టు సాంగ్10వ స్థానంలో అదరగొడుతోంది. ఈ మూడు పాటలకు 85 మిలియన్ల వ్యూస్ దాటాయి, ఈ రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ పాటలకున్న పాపులారిటీని తెలియజేస్తున్నాయి. సాంగ్స్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో ఫ్యాన్స్ డ్యాన్స్ కవర్‌లు, రీల్స్‌లో కూడా టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. ఈ మూడు పాటలు 100 మిలియన్ వ్యూస్‌కి చేరువ య్యాయి. సెన్సేషనల్ హిట్‌గా నిలిచిన సంక్రాంతికి వస్తు న్నాం ఆల్బమ్ ఈ సీజన్‌లో మోస్ట్ సెలబ్రేటెడ్ ఆల్బమ్‌గా అదరగొట్టింది. ఈ మూవీలో వెంకటేష్ ఎక్స్ కాప్‌గా, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షిచౌదరి ఎక్స్ లవర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సమీర్ రెడ్డి నిర్వహిస్తుండగా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్, తమ్మిరాజు ఎడిటర్. చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. తారాగణం: వెంకటేష్, మీనాక్షిచౌదరి,



ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, సాయి కుమార్, నరేష్, జుగి గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్ మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సమర్పణ: దిల్ రాజు బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, నిర్మాత: శిరీష్ సంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ: సమీర్ రెడ్డి.



# 'పినాక' టైటిల్ టీజర్ లాంచ్

గోల్డెన్ స్టార్ గణేష్ అప్‌కమింగ్ మూవీ 'పినాక' మోస్ట్ అవైటెడ్ టీజర్ రిలీజైయింది. టీజర్ అభిమానులను, ప్రేక్షకులను ఆశ్చర్య పరిచే విజువల్ ట్రీట్‌ను అందిస్తోంది. ప్రముఖ నిర్మాత టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాణంలో, గోల్డెన్ స్టార్ గణేష్ క్షుద్ర, రుద్రగా స్టన్నింగ్ న్యూ అవాతర్‌లో తన వెర్సటాలిటీ చూపించబోతున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ బి. ధనంజయ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మైల్ స్టోన్ 49వ ప్రాజెక్ట్ (పిఎంఎఫ్49) కన్నడ సినిమాని రీడిఫైన్ చేయనుంది. కన్నడ సినిమాలో మునుపెన్నడూ లేనివిధంగా గ్రిప్పింగ్ స్టోరీలైన్, విజువల్ స్పెక్లింగ్‌తో బ్లాక్ మ్యాజిక్ ఎలిమెంట్స్‌తో కూడిన గ్రాండ్ పీరియాడిక్ డ్రామాని టీజర్ పరిచయం చేసింది. బ్రెత్ టేకింగ్ వీఎఫ్‌ఎక్స్, అత్యాధునిక విజువల్స్‌తో, పినాక ఒక కొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేసింది, రాంపేజ్ ఆఫ్ క్షుద్ర పోస్టర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో ప్రసిద్ధి చెందిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, హై క్యాలిటీ స్టోరీ టెల్లింగ్, అత్యాధునిక నిర్మాణం ద్వారా కన్నడ సినిమాను నెక్స్ట్ లెవల్‌కి చేర్చాలనే విజన్‌కి ఈ ప్రాజెక్ట్ నిదర్శనంగా ఉండబోతోంది.

# '1000 కోట్లు' రీ రికార్డింగ్

మోహన్ లాల్ హీరోగా శ్రీకర్ మూవీ మేకర్స్ పతాకంపై కాసుల రామకృష్ణ (శ్రీధర్), శ్రీకరగుప్త, సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం '1000 కోట్లు'. గతంలో 100 కోట్లు వంటి హిట్ చిత్రాన్ని నిర్మించిన కాసుల రామకృష్ణ ప్రస్తుతం '1000 కోట్లు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుత ఈ చిత్రం కేరళలో డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రీ రికార్డింగ్





జరుపుకుంటుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కాసుల రామకృష్ణ మాట్లాడుతూ, మలయాళంలో సూపర్ హిట్ అయిన చిత్రాన్ని తెలుగులో 1000 కోట్లు పేరుతో విడుదల చేయుటకు సన్నాహాలు చేస్తున్నాము. మోహన్ లాల్ సరసన కావ్య మాధవన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మరో విశేషమేమిటంటే ప్రముఖ సీనియర్ ఆర్టిస్ట్ నాగ మహేష్ మోహన్ లాల్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ చిత్రానికి ప్రముఖ పీఆర్ ఓ వీరబాబు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. రీ రికార్డింగ్ కార్యక్రమాలు ముగించుకుని చిత్రాన్ని జనవరి ఎండింగ్ లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. అని అన్నారు. మోహన్ లాల్, కావ్య మాధవన్, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాతీష్ వేగ, డిఓపి: ప్రదీప్ నాయర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాసింశెట్టి వీరబాబు, నిర్మాతలు: కాసుల శ్రీకర్ గుప్తా, కాసుల రామకృష్ణ, దర్శకత్వం: జోషి.



శ్రద్ధా శ్రీనాథ్ నయా లుక్

# 'హిట్: ది థర్డ్ కేస్' పోస్టర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్, యాక్షన్ థ్రిల్లర్ హిట్: ది థర్డ్ కేస్. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నాని యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు, కొద్ది రోజుల క్రితం కాశ్మీర్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు మేకర్స్. తాజాగా విడుదలైన న్యూ ఇయర్ పోస్టర్‌లో నాని రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్ నాని పోషిస్తున్న అర్జున్ సర్కార్ పాత్ర ఫెరోషియస్ నేచర్‌ని తెలియజేస్తుంది. అర్జున్ బొటన వేలుపై కనిపించే గాయం అతని బాటిల్స్‌ని సూచిస్తుంది, నెరిసిన జుట్టు క్యారెక్టర్‌ని డెప్త్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈఅద్భుతమైన పోస్టర్ అర్జున్ సర్కార్ జర్నీ, అతని ట్రాన్స్ పర్మేషన్‌పై క్యురియాసిటీని క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో శ్రీనిధిశెట్టి కథానాయికగా నటిస్తోంది. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. సానుజాన్‌వర్గీస్ డీవోపీ, మిక్కీ జె.మేయర్ సంగీతం, కార్తీక శ్రీనివాస్ ఆర్, ఎడిటర్, శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్. ఈ మూవీ మే1, 2025న థియేటర్లలోకి రానుంది.



# పెద్ద విజయాన్ని అందుకుంటున్న 'డ్రింకర్ సాయి'



ఇయర్ ఎండ్‌లో చిన్న చిత్రంగా రిలీజై పెద్ద విజయాన్ని సాధించింది డ్రింకర్ సాయి మూవీ. ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మంచి వసూళ్లు దక్కుతున్నాయి. ప్రేక్షకుల ఆదరణ చూసి స్మాల్ ఫిల్మ్ బిగ్ హిట్ అంటూ అటు ట్రేడ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. డ్రింకర్ సాయిలోని కథా కథనాలు మేకింగ్ అటు మాస్, ఇటు క్లాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. సినిమాలోని ఎమోషన్స్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యింది. తెలంగాణతో చూస్తే ఏపీలో ఈ మూవీకి ఎక్కువగా కలెక్షన్స్ వస్తున్నాయి. రూరల్ ఏరియాల్లో సైతం ఇంప్రెసివ్ కలెక్షన్స్ అందుకుంటోంది డ్రింకర్ సాయి సినిమా. ఫన్ ఎలిమెంట్స్, లవ్ స్టోరీ, సూపర్ హిట్ మ్యూజిక్, ఫైట్స్..ఇవన్నీ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటున్నాయి. డ్రింకర్ సాయి చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. గత నెల 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన డ్రింకర్ సాయి సినిమా యునానమస్‌గా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో విడుదలైన అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. నటీనటులు: ధర్మ, ఐశ్వర్య శర్మ, పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేశ్, రాజ ప్రజ్వల్, తదితరులు. టెక్నికల్ టీమ్: కాస్ట్యూమ్ డిజైనర్స్: ఎస్ఎం రసూల్, జోగు బిందు శ్రీ, స్టిల్స్: రాజు వైజాగ్, వీఎఫ్ఎక్స్: సుమరామ్ రెడ్డి.ఎన్ ఆర్ట్: లావణ్య వేములపల్లి కొరియోగ్రఫీ: భాను, మోయిన్ డీవోపీ: ప్రశాంత్ అంకిరెడ్డి ఎడిటింగ్: మార్తాండ్ కె వెంకటేష్, లైన్ ప్రొడ్యూసర్: లక్ష్మీ మురారి మ్యూజిక్: శ్రీ వసంత్, లిరిక్స్: చంద్రబోస్ పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), ప్రొడ్యూసర్స్: బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ రచన, దర్శకత్వం: కిరణ్ తిరుమల శెట్టి.

# 'పాంచ్ మినార్' ఫస్ట్ లుక్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో ఓ క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ రూపొందుతోంది. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. అందరికీ న్యూ ఇయర్ విషెస్ తెలియజేస్తూ మేకర్స్ ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఈ మూవీకిపాంచ్ మినాం అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. టైటిల్ ఫాంట్ చాలా ఎట్రాక్టివ్‌గా వుంది. హీరో రాజ్ తరుణ్ కార్ టాప్‌పై రిలాక్స్ అవుతున్నట్లు ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అదిరిపోయింది. చెక్ షర్ట్, బ్లూ జీన్స్ ధరించి ఎనర్జిటిక్ లుక్‌లో కనిపించారు రాజ్ తరుణ్. కార్ పై ఓపెన్ చేసి సూట్ కేస్ నుంచి డబ్బు గాల్లోకి ఎగరడం ఇంట్రస్టింగ్‌గా వుంది. మోషన్ పోస్టర్ లో ప్రజెంట్ చేసి థీమ్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి ఆదిత్య జవ్వాది డీవోపీ. ప్రవీణ్ పూడి ఎడిటర్. బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్టర్. నటీనటులు: రాజ్ తరుణ్, రాశి సింగ్, అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ, సుదర్శన్, కృష్ణ తేజ, నంద గోపాల్, ఎడ్విన్ లక్ష్మణ్ మీసాల, జీవా, అజీజ్ తదితరులు, సాంకేతిక సిబ్బంది: బ్యానర్: కనెక్ట్ మూవీస్ ఎల్ ఎల్‌పి, సమర్పణ: గోవింద రాజు రచన, దర్శకత్వం: రామ్ కడుముల నిర్మాతలు: మాధవి, ఎంఎస్ఎం రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి, ఆర్ట్ డైరెక్టర్: బేబీ సురేష్ భీమగాని, డైలాగ్స్: గొరిజాల సుధాకర్, కోడైరెక్టర్స్: పుల్లారావు కొప్పినీడి, టి రాజా రమేష్, పీఆర్వో: వంశీ శేఖర్.



# బ్లాక్ డ్రెస్‌లో కృతి మెస్మరైజింగ్

బ్లాక్ డ్రెస్‌లో కృతి మెస్మరైజింగ్ సరిగ్గా పదేళ్ల క్రితం మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన '1 నేనొక్కడినే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి సనన్. తెలుగులో మొదటి సినిమా నిరాశపరచడంతో పెద్దగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. ఆ తర్వాత చేసిన సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అయితే లక్కీగా ఈ అమ్మడికి బాలీవుడ్‌లో సూపర్ హిట్ సినిమాలు పడ్డాయి. హిందీలో ఈమె చేసిన సినిమాలు కమర్షియల్‌గా విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా నటిగా ఈమెకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టాయి. అందుకే బాలీవుడ్‌లో గత పదేళ్లుగా వెనక్కి తిరిగి చూసుకోకుండా దూసుకు పోతుంది. తెలుగులో చాలా సంవత్సరాల తర్వాత ప్రభాస్‌కి జోడీగా ఆదిపురుష్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆదిపురుష్ సినిమా హిందీలో రూపొందినా తెలుగు ప్రేక్షకుల ముందుకు ఆ సినిమాతో మరోసారి కృతి సనన్ వచ్చింది. సీత పాత్రలో ఆమె నటించడం ద్వారా ఆమెపై చాలా మంది మరింత గౌరవంను అభిమానంను పెంచుకున్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హాలీవుడ్ స్టార్స్‌కి ఏమాత్రం తగ్గకుండా సోషల్ మీడియాలో ఫాలోయింగ్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు అందాల ఆరబోత విషయంలోనూ అదే కొనసాగిస్తూ దూసుకు పోతుంది. మరో వైపు ఈ అమ్మడు ఆకట్టుకునే అందంతో ఫోటోలను షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో కృతి సనన్ అందమైన ఫోటో వైరల్ అవుతోంది. ఒక పార్టీలో సన్ సెట్ సమయంలో తీసుకున్న ఈ ఫోటోలో కృతి మెరిసి పోతుంది. బ్లాక్ డ్రెస్‌లో కృతి సనన్ కనీసం చూపు తిప్ప నివ్వడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, నిజంగా కృతి మెస్మరైజింగ్ బ్యూటీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అందమైన సూర్యాస్తమయం సమయంలోనూ ఈ అమ్మడు అంత కంటే ఎక్కువ అందంగా కనిపించడం ఈమెకే చెల్లింది. విభిన్నమైన మేకోవర్‌తో కృతి గతంతో పోల్చితే మరింత అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం



చేస్తున్నారు. 2024లో మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృతిసనన్ కొత్తగా ప్రస్తుతం చేస్తున్న సినిమాలు ఏమీ లేవు. కానీ కచ్చితంగా ఈ యేడాదిలోనూ ఆమె నుంచి మూడు నాలుగు సినిమాలు వస్తాయంటూ ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్న సినిమాలను వెంటనే మొదలు పెట్టి ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తుందా అనేది చూడాలి. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌లను తన కెరీర్‌లో దక్కించుకున్న ఈ అమ్మడు.

# సామాన్యభక్తులకు ప్రాధాన్యం: ఇఒ కె రామచంద్రమోహన్


మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

**ఇంద్రకీలాద్రి, జనవరి 2, ప్రభాత'వార్త' :** బెజవాడ దుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే సామాన్య భక్తులకు త్వరితంగా, సులభంగా, సౌకర్యవంతంగా సేవలందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని ఇఒ కె రామచంద్ర మోహన్ అన్నారు. గురువారం ఆయన ఆలయ ప్రాంగణమంతా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు వేచివుండకుండా సంతృప్తికరంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. - దుర్గమ్మను దర్శించుకున్న విఐపిలు: దుర్గమ్మవారిని గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆయన దుర్గమ్మ దర్శనం చేసుకున్న తరువాత దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను ఇఒ కె రామచంద్ర మోహన్, ఎండోమెంట్ అదనపు కమీషనర్ టి చంద్రకుమార్, ఎండోమెంట్ ఛీఫ్ ఇంజనీర్ జివిఆర్ శేఖర్, ఆలయ డిప్యూటి ఇఒ ఎం రత్నరాజులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. - నిత్యాన్నదాన పథకానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్షను విరాళంగా చిలకలూరిపేటకు చెందిన నాగండ్ల అద్రిత్ తమ కుటుంబసభ్యులతో కలిసి గురువారం అందించారు. వారికి దుర్గమ్మ దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ్గర్గమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన నృత్యనీరాజనం భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమి ఆచార్యులు వేంకట శివ రామకృష్ణ కుమార్ నేతృత్వంలో 15 మంది శిష్యబృందం గణేశస్తుతి, కొలువైతివా రంగశాయి, అఖిలాండేశ్వరి, ఆనందతాండవం, కాలభైరవాష్టకం, జయజనార్ధన, కృష్ణశబ్దం, బృంద వన నిలయం, అలివేలు మంగా, అణురేణు పరిపూర్ణమైన అన్నమయ్య, కొలుకక నడవరో, సంగీత సామ్రాజ్య, గరుడ గమన, నృత్యశైలితో అద్భుత ప్రదర్శనలిచ్చారు.

# ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ద్వారా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు

## ఇంధన శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్

## - దాదాపు 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం


ట్రాన్స్కో ఏపీ జెన్కో డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇంధన శాఖా మంత్రి శ్రీ గొట్టి పాటి రవికుమార్. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,, జనవరి 2,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ -2024 ద్వారా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా దాదాపు 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఇంధన శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ ట్రాన్స్క, ఏపీ జెన్కో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.విజయానంద్ , ఏపీ జెన్కో ఎండీ శ్రీ కె .వి.యన్.చక్రధర్ బాబుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విజనరీ లీడర్, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా అధిక విద్యుత్ ఉత్పత్తి కోసం, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు, విద్యుత్ సంస్థల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న తిశి బినివిదివీ, తిశి గ్స్సుల్లు కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రభుత్వం విద్యుత్ శాఖను సంస్కరించే దిశగా అడుగులు వేసిందని, సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా పయనించేందుకు ఎన్నో కార్యక్రమాలకు నాంది పలుకబోతుందని మంత్రి చెప్పారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 తీసుకుని వచ్చింది. దీని ద్వారా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి దాదాపు 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. రాబోయే కాలంలో తిశి గి ఎ చ బ ౧ ౨ రూ.15,729 కోట్ల వి ల ౧ ఎ ౨ స ప్రాజెక్టులను అమలు చేస్తుందని, దీని ద్వారా 71 సబ్ స్టేషన్లు, 16,507 ఎ ం వీ ఏ ట్రాన్స్ఫార్మేషన్ సామర్థం, 4696 సీకేఎం టాన్స్మిషన్ లైన్స్ ను జోడిస్తుందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకంలో పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుల (పి.ఎస్.పి.) రంగంలోకి ఏపీ జెన్కో అడుగుపెట్టిందని, ఈ సందర్భంగా ఉద్యోగులందరికీ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఎగువ సీలేరులో 1350 మెగావాట్ల సామర్థంతో సొంతంగా పి.ఎస్.పి. నిర్మించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పీక్ లోడ్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని దశల వారీగా 5000 మెగావాట్ల సామర్థంతో సంయుక్త భాగస్వామ్యంలో అయిదు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు (పి.ఎస్.పి.లు) నిర్మించాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్.హెచ్.పి.సి. తో అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యూ.) కుదుర్చుకోవడం ఏపీ విద్యుత్ రంగంలోనే కీలక ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు అంకితభావం, నిబద్ధతను కనబరుస్తూ.. ఆంధ్రప్రదేశ్ ను విద్యుతాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని.. ఈ క్రతువులో మీ భాగస్వామం కీలకమని తాను నమ్ముతున్నానని , తిశి గ్స్సుల్లు, తిశి బినివిదివీ పేరు ప్రతిష్టలు దేశ వ్యాప్తంగా ఇనుమడింప చేసేలా ఏపీ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తి గతంగా, సమిష్టిగా అంకిత భావంతో కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కొత్త ఏడాది సందర్భంగా విద్యుత్ సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేలా సిబ్బంది ముందడుగు వేయాలని మంత్రి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏపీట్రాన్స్క డైరెక్టర్ శ్రీ ఏకేవీ భాస్కర్, ఏపీజెన్కో డైరెక్టర్ హైడల్ / ఎఫ్ఏసి శ్రీ ఎం.సుజయ్ కుమార్, డైరెక్టర్ థర్మల్/ఎఫ్ఏసి శ్రీ పి. అశోక్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్/ఎఫ్ఏసి శ్రీ పి నవీన్ గౌతమ్, ఏపీట్రాన్స్క , ఏపీజెన్కో చీఫ్ ఇంజనీర్లు, సీజీఎం లు పాల్గొన్నారు.

## బిజెపి, ఆర్ఎస్ఎస్, పోలీసులపై విరుచుకుపడ్డ జెసి ప్రభాకర్ రెడ్డి

### అప్పుడు బస్సులు ఆపించారు అంతే - ఇప్పుడు బస్సులనే కాల్చారు : జెసి

**అనంతపురం, జనవరి 2, (ప్రభాతవార్త** బ్యూరో)అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో కేవలం మహిళల కోసం ప్రత్యేకంగా డిసెంబర్ 31 రాత్రి నేను నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల కార్యక్రమాలపై విమర్శలు చేసిన ఆర్ఎస్ఎస్,బిజెపి, వీహెచ్పీ నాయకులపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. ఈ కార్యక్రమం పై విమర్శలు చేసిన ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు థర్డ్ జెండర్ కంటే ఇంకా తగ్గ నాకొడుకులంటూ జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దివాకర్ ట్రావెల్స్ షెడ్ లో ఉన్న రెండు దివాకర్ ట్రావెల్స్ బస్సులు బుధవారం రాత్రి ఒకటో తేదీ అగ్నికి ఆహుతి అయ్యింది.. ఈ సంఘటనకుగల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.. ఈ నేపథ్యంలో గురువారం తాడపత్రి లో తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సినీనటి మాధవి లత కు తాడిపత్రి గురించి ఏం తెలుసు అని ఆమె దుస్తులు లేకుండా ఫోటోలు విడుదల చేస్తాదని ఆయన ఆరోపించారు..ఇక అనంతపురంలో తన బస్సులు పథకం ప్రకారం దగ్ధం చేసినా పోలీసులు షార్ట్ సర్క్యూట్ అంటూ కేసు నమోదు చేయడంపై జేసీ పోలీసుల తీరుపై తప్పుబట్టారు. పోలీసులకు చేతకాదు కాబట్టే నేను ఫిర్యాదు చేయలేదు, మీకు చేతనైతే సుమోటోగా కేసు నమోదు చేసి నా బస్సులు పథకం ప్రకారం నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. పోలీసుల పై నాకు నమ్మకం లేదు, మీకు నిందితులు ఎవరో పట్టుకునేకి చేతకాదు కాబట్టే షార్ట్ సర్క్యూట్ అంటూ కేసు నమోదు చేశారు అని తీవ్ర విమర్శలు చేశారు.. వైసిపి ప్రభుత్వం లో 450 కోట్లు డబ్బులు పోగొట్టుకున్నానని, ఇప్పుడు రెండు బస్సులు అంటిస్తే ఏమి అవుతుందంటూ జెసి అన్నారు. వీరి కంటే వైఎస్ జగన్ చాలా మేలని, జగన్ తన ప్రభుత్వంలో కేవలం బస్సులు మాత్రమే నిలబెట్టా డని , మీ బిజెపి ప్రభుత్వంలో నా బస్సులు తగలబెట్టిచారని జెసి సంచలన ఆరోపణలు చేశారు.

## అనంతలో 4న 10వేల మందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఈ నెల 4వ తేదిన ఉదయం 10 గంటలకు 10వేల మందితో సామూహిక హనుమాన్ ఛాలీస్ పారాయణం కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హనుమాన్ ఛాలీసా పారాయణ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అనంతపురం నగర ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు. హనుమాన్ ఛాలీసా పారాయణ సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వడియం పేటలోని అభయాంజినేయస్వామి దేవాలయం వ్యవస్థాపకులు ప్రబోదస్వామి, సుంకు వేణుగోపాల్, ఆకుల రాఘవేంద్ర, హర్ష జయన్, ఇంజినీరింగ్ పవన్‌కుమార్, రిటైర్డ్ టీచర్ వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమం విజయవంతానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హంపి స్వామిజీ విద్యారంగ భారతి, మంత్రాలయం స్వామిజీ సుదీంధ్ర తీర్థ, భగవత వ్యవస్థాపకులు ఎల్‌వి.గంగాధర్‌శాస్త్రి, తదితరులు హాజరవుతున్నారు. 4వ తేదిన ఉ దయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 10వేల మందితో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆరు వేల మంది స్కూల్ పిల్లలు, ముఖ్యంగా 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనే విధంగా నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా స్కూళ్లకు సంబంధించి బ్యాడ్జీలను సైతం ఇచ్చారు. గత కొన్ని రోజులుగా అనంతపురం నగరంలో 60 పాఠశాలల్లో ప్రతి మంగళవారం ఉదయం 6:30 గంటలకు ఆసక్తి ఉన్న విద్యార్థులతో హనుమాన్ ఛాలీసా పారాయణం నిర్వహిస్తూ వచ్చామని నిర్వాహకులు తెలిపారు. 10వేల మందితో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆరు వేల మంది విద్యార్థులు కాగా మిగతా 4వేల మంది అనంతపురం నగరంలోని వివిధ ఆలయాలకు చెందిన ప్రతినిధులు, భక్తులు హాజరవుతారన్నారు.

## ఒకరిది శపథం.. మరొకరి పంతం.. ఇంకొకరిది పట్టుదల..!

**ఒంగోలు, ప్రభాతవార్త** 2024 ఎన్నికల్లో కొన్ని చారిత్రాత్మకమైన తీర్పులకు వేదికగా నిలిచింది. 2019 ఎన్నికల తరువాత టీడీపీ ఓటమి పట్ల చంద్రబాబుతో వైసీపీ నడుచుకున్న విధానం ఆ పార్టీలోని మంత్రులు, నాయకులు, ఒక మాజీ ముఖ్యమంత్రి అనే కనీస గౌరవం ఇవ్వకుండా సంస్కారాన్ని మరిచి చేసిన వ్యాఖ్యలు బాబు రాజకీయ జీవితంలోనే చీకటి రోజుగా చెప్పవచ్చు. టీడీపీ పార్టీని రాజకీయంగా దెబ్బకొట్టడానికి, బాబును మానసికంగా వేదించింది జగన్ అండకో. అతనే కాక రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేని ఆయన సతీమణి భువనేశ్వరిని కూడా రాజకీయ వేదికల మీదకు లాక్కొచి మరి అసెంబ్లీ సాక్షిగా అవమానించారు. అయితే ఆనాడు తన కుటుంబానికి అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానానికి కళ్లుచమర్చిన చంద్రబాబు ఈ కౌరవ సభను గౌరవ సభగా మార్చి ముఖ్యమంత్రిగానే తిరిగి ఇక్కడ అడుగుపెడతాను అంటూ శపథం చేసి చట్టసభల నుంచి ప్రజాక్షేత్రానికి వచ్చారు. అయితే ఆ చట్టాన్ని కూడా తమ చుట్టంగా మార్చుకున్న వైసీపీ బాబును అరెస్టు చేసి సుమారు 60 రోజుల పాటు జైలులో నిర్బంధించగలిగారు. ఆనాడు అవమాన భారంతో బాబు చేసిన శపథం నేడు 164 సీట్ల అఖండ మెజార్టీతో నెరవేర్చుకుని ముఖ్యమంత్రిగా గౌరవ సభలో అడుగు పెట్టారు చంద్రబాబు. ఇక పార్టీ పెట్టి పదేళ్లు గడిచింది. పోటీ చేసిన రెండు చోట్ల ఓటమి ఎదరైంది. ఇటువంటి వారు రాజకీయాలకు పనిరారంటూ వైసీపీ జనసేనఅధినేత పవన్‌కళ్యాణ్‌పై విరుచుకుపడిపోయింది. ప్యాకేజీలు తీసుకుంటూ భార్యలను మారుస్తూ, స్థిమితం లేని రాజకీయం చేస్తూ చివరికి బాబు పల్లకి మోసే ఒక దత్త పుత్రిడిగా మిగిలిపోతావంటూ వైసీపీ చేసిన అవమానాలకు, అవహేళనకు బదులు చెప్పే రోజుల కోసం వైసీపీ లేని ఆంధ్రప్రదేశ్ అంటూ పట్టుదలతో పని చేసిన పవన్ కళ్యాణ్ మూడు పార్టీల పొత్తులతో హండ్రెడ్ శాతం స్ట్రైక్ రేట్‌తో జనసేనను గెలుపించుకుని వైసీపీ మీద పై చెయి సాధించారు.

# హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తోన్న సర్కారు


గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాతో మాట్లాడుతున్న బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

### విపక్షాల గొంతునొక్కడం ఇప్పటికైనా మానుకోవాలి

### రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారు : బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నూతన యేడాదిలో అయినా హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రైతు బరోసా ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారని, కౌలు రైతులకు 1200 కోట్ల రూపాయలు కూడా ఇవ్వకుండా మార్చేస్తున్నారన్నారు. రైతు కూలీల సంగతి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గుత్తేదారుల కోసం ఏమైనా దాస్తున్నారో డిప్యూటీ సిఎం సమాధానం చెప్పాలన్నారు. డబ్బు ఇవ్వకుండా ఎవరైనా ఆపుతున్నారా సమాధానం చెప్పాలన్నారు. రైతు భరోసాపై వేసిన మంత్రివర్గ సబ్ కమిటీ నివేదిక ఎందుకు ఇవ్వలేదన్నారు. కేబినెట్ మీటింగ్‌లో రైతు బరోసాపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎకరాకు 12వేల రూపాయలు రైతు బరోసా ఎప్పుడు ఇస్తారో కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కౌలు రైతులకు ఇస్తానన్న 12వేలు ఇవ్వలేము అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని, అయితే కాంగ్రెస్‌లో లేని కారణంగా గతంలో ఆ పార్టీ తీసుకున్న నిర్ణయం తుమ్మల నాగేశ్వరరావు కు తెలియదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు పొంతన లేకుండా మాట్లాడటం దారుణం అన్నారు. పెట్టుబడి రాక ఇబ్బందులు ఎక్కువగా పడేది కౌలు రైతులేనని, 35వేల కోట్ల రూపాయలు రైతన్నలకు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. వాటిని ఈ నెలలోనే రైతులు, కౌలు రైతు చెల్లించాలన్నారు. రూ. 1,38,117 కోట్ల రూపాయల అప్పు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం, రోజుకు 354కోట్ల రూపాయల అప్పు చేస్తుందన్నారు. 30వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది వాస్తవం కాదా అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసికూడా ఒక్క సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడంలేదన్నారు. రుణమాఫీ కూడా 60 నుంచి 65శాతం మాత్రమే చేసిందన్నారు. రూ.1.18లక్ష కోట్ల రూపాయలు దేనికి ఖర్చు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం అమలు గురించి కూడా మాట్లాడటం లేదన్నారు. రూ.14వేల కోట్ల రూపాయలు కేటాయించి మహిళలకు న్యాయం చేయాలని కోరుతు న్నామన్నారు. పెన్షన్‌ను రూ.4వేలకు పెంచి ఇచ్చేలా ఈ కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇల్లు ఇస్తారా గ్రామ సభ పెట్టి నిజమైన లబ్దిదారులను ఎంపిక చేస్తారా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

# ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

### వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఎం నేతల విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సర్వే నెం.255లోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలు ఇచ్చి.. వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీపీఎం నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. సీఎంని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జి నాగయ్య, టి సాగర్ రాష్ట్ర నాయకులు వెంకట్రాములు ఉన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెం.255లోని 220 ఎకరాల ప్రభుత్వ భూమిలో 150 ఎకరాల భూమిని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాంలో కొంతమంది పేద రైతులకు అగ్రిమెంటు పట్టాలు ఇచ్చారని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మిగిలిన 70 ఎకరాల భూమి గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంఎల్ఏ బానోత్ శంకర్‌నాయక్, అతని బినామీలు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. పైన పేర్కొన్న సర్వేనంబర్‌లో పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని రెండేళ్ళుగా నివసిస్తున్నారని... అయితే మాజీ ఎంఎల్ఏ శంకర్‌నాయక్, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్భలంతో ఆనాటి అధికారులు పేదల గుడిసెలను తొలగించి, ఆ భూమిని ఆక్రమణదారులకు అప్పగించడం కోసం గుడిసెవాసులపై 18సార్లు దాడులు చేశారని సీఎం దృష్టికి సీపీఎం నేతలు తీసుకొచ్చారు. గుడిసెలను కూల్చివేసి 200మందిపై అక్రమ కేసులు పెట్టారని.. వారిలో 20మందిని జైలుకు పంపారని.. వారిలో 10మంది మహిళలను అర్ధరాత్రి చిత్రహింసలు పెట్టి 15 రోజులు జైలుకు పంపారని పేర్కొన్నారు. ఇంత నిర్బంధం ప్రయోగించినా కూడా పేదలు గత్యంతరం లేక అట్టి గుడిసెల్లోనే నేటికీ జీవిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి ప్రశాంతంగా ఉన్నప్పటికీ.. ఈమధ్య కాలంలో గుడిసెలు ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు పేదలపై ఒత్తిడి చేస్తున్నారని నేతలు తెలిపారు. కాబట్టి తమరు జోక్యం చేసుకుని, గుడిసెలు వేసుకుని నివాసముంటున్న స్థలంలోనే పేదలకు పట్టాలు ఇచ్చి.. వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఎం నేతలు కోరారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్టు నేతలు తెలిపారు.

# నీటిపారుదల ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి

### ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణలో నీటిపారుదల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాలను సకాలంలో సాధించడానికి అంకిత భావంతో పనిచేయాలని నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (పరిపాలన,సాధారణ అంశాలు) జి అనిల్‌కుమార్ అన్నారు. జలసౌధలో గురువారం టిఎస్ ఎంఇఎస్ ఏ రూపొందించిన క్యాలెండర్‌ను ఇఎన్‌సి జి.అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. విజిలెన్స్ ఇఇ శారద, అసోసియేషన్ ప్రెసిడెంట్ జమీర్‌పాష, సెక్రటరీ మహ్మద్‌గౌస్, సలహాదారు అజ్మల్‌ఖాన్, వర్కింగ్ ప్రసిడెంట్ అస్మత్‌అలీలకు తొలి క్యాలెండర్‌లు ఇఎన్‌సి లాంఛనంగా అందజేశారు. 2025 క్యాలెండర్‌లోని ప్రతిరోజును వృథా చేయకుండా పనిచేస్తేనే నీటిపారుదలశాఖ సకాలంలో ప్రాజెక్టులు కాల్వలు, ఇతర మరమ్మతులు పూర్తి చేసుకోగలదని అనిల్ ఈ సందర్భంగా ఉద్యోగులకు ఉద్బోదించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ అస్మాత బుస్సుమ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# హైకోర్టులో పూర్తిస్థాయి న్యాయమూర్తుల నియామకానికి చర్యలు చేపట్టాలి

### బిఆర్ఎస్ మాజీ ఎంపి వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో జడ్జిల నియామకానికి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఈ విషయంపై సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపినట్లు పేర్కొన్నారు. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు వచ్చింది. కేసీఆర్ హయాంలోనే మేము పార్లమెంట్‌లో ఒత్తిడి చేసిన ఫలితంగా హైకోర్టు జడ్జిల సంఖ్యను 42కు పెంచారని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా.. ఎప్పుడూ 23 మందికి మించి భర్తీ చేయడం లేదని తెలిపారు.తెలంగాణ జడ్జిల్లో ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జిలను నియమిస్తే దళిత, గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.
హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది.. జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటే తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావన్నారు. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థలో కూడా పాటించాల్సిందేనని డిమాండ్ చేశారు. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హైకోర్టులో నలుగురు జడ్జిలు ఉన్నారు.
జడ్జిలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు డబుల్‌డెక్ ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేయాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

### పేదలు గుర్తుపెట్టుకొనే ఒక పథకం పదేళ్ల బిజెపి పాలనలో ఉందా?

### రూ.15 లక్షలు జన్‌ధన్ ఖాతాల్లో ఎందుకు వేయలేదు?! :

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం కాదు.. కెసిఆర్ కుటుంబ అక్రమాలపై నోరు మెదపండి

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం కాదు, కెసిఆర్ కుటుంబ అక్రమాలపై నోరు మెదపండని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ తెలంగాణ బిజెపికి సలహా ఇచ్చారు. అసెంబ్లీలో గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చౌకబారు విమర్శలు, బ్లాక్ మెయిల్ రాజకీయాలు ఆపాలని సూచించారు. మహేశ్వర్‌రెడ్డి రెండు నెలలకోసారి మీడియా ముందకు వచ్చి నోటికొచ్చిన ఆరోపణలు చేసి హడావిడి చేస్తున్నాడని ఆయన ఆవేదన చెందారు. అవినీతి, అక్రమాలు అంటు అర్థంపర్థంలేని ఆరోపణలు మీడియాలో చెప్పు తున్నాడని విమర్శించారు. బిజెపి నాయకుడు మహేశ్వర్‌రెడ్డి అర్థం పర్థం లేని ఆరోపణలు, ఆధారాలు లేని విమర్శలు ఆపాలి అని ఆయన ఖరాఖండిగా చెప్పారు. ప్రజా ప్రభుత్వం పైన చవకబారు విమర్శలు చేయడం కాదు, దమ్ముంటే సాక్ష్యాలు ఆధారాలు ఏమైనా ఉంటే చూపించు అని ఆయన సవాల్ విసిరారు.నీ దగ్గర అవినీతికి ఆధారాలు ఉంటే కోర్టు కు పోయి కొట్లాడు,లేకుంటే మా సీఎం కి ఇవ్వు విచారణ జరిపించడానికి సిద్ధంగా ఉన్నారు అని ఆయన వివరించారు.
ఏడున్నర లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్న రాష్ట్రాన్ని మా సీఎం రోజుకు 18 గంటలు కష్టపడి గాడిలో పెడుతున్నారని ఆయన గుర్తుచేశారు.మీరు తిన్నది అరగక వేల కోట్ల అవినీతి ని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ అవినీతి, కేటీఆర్ ఫార్ములా ఈ రేస్ అక్రమాలను మేం బయటపెడుతుంటే మీరు వాళ్లను వెనకేసుకువస్తున్నారని ఆయన ఆపాదించారు.కేసీఆర్ కుటుంబ అక్రమాల ఎందుకు నోరు మెదపడం లేదు అని ఆయన నిలదీశారు. ప్రజా ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం ఆపండి.. మేం రైతును రాజు ను చేస్తున్నాం,మీరు నలుబై రోజులుగా రైతు నాయకుడు నిరాహాదీక్ష చేస్తున్న కనీసం చర్చలుజరపడంలేదని ఆవేదన చెందారు. ఢిల్లీలో మీ పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్న మీరు పేదలు గుర్తు పెట్టుకునే ఒక్క సంక్షేమ కార్యక్రమం ఉందా..? రైతు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని ఆయన గుర్తుచేశారు. రెండు లక్షల లోపు రుణ మాఫీ ఏక కాలంలో చేసినం అని స్తోత్కర్షలు చెప్పుకున్నారు.బీజేపీ దేశంలో ఎక్కడైనా రుణమాఫీ చేసిందా..? అని నిలదీశారు.
రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకువచ్చిన మీరా రైతుల గురించి మాట్లాడేది? ప్రజా ప్రభుత్వం పైన విమర్శలు చేయడం కాదు, కేంద్రంతో మాట్లాడి నిధులు తెప్పించు అని ఆయన అన్నారు.మాది ప్రజా ప్రభుత్వం అని మరోమారు ఆదిశ్రీనివాస్ ప్రకటించుకున్నారు. నల్లధనం, మనిలాండరింగ్ ద్వారా ఇతర దేశాలకు వెళ్లిన ధనం తీసుకొచ్చి జన్ ధన్ ఖాతా లో రూ. 15 లక్షలు వేస్తామన్నారు..ఎక్కడ..? వేశారు అనిఆయన ప్రశ్నించారేఉ. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు,ఎక్కడ ఇచ్చారో చూపించండి అని ఆయన నిలదీశారు.బీజేపీ ప్రభుత్వాలు ఎక్కడైనా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా.. ? అని ఆయన ప్రశ్నించారు.

# సిడ్నీ మ్యాచ్‌కి వరుణుడి అడ్డంకి

## నేడు టెస్ట్ మ్యాచ్ భారత్‌కు కీలక పరీక్ష




ఢిల్లీ: వర్షం ప్రభావంతో సిడ్నీ టెస్ట్ కష్టాల్లో పడే అవకాశం ఉంది. సిడ్నీ టెస్ట్ వేదికపై వాతావరణం గడ్డు పరీక్షగా నిలుస్తుందని తెలుస్తోంది. ప్రధానంగా నాల్గవ, ఐదవ రోజులు ముఖ్యంగా ఆటకు ఆటంకం కలిగించనున్నాయి. ఐకానిక్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో టీమిండియా, ఆస్ట్రేలియా మధ్య చివరి టెస్ట్ ఈ నెల 3వ తేదీన ప్రారంభమవుతోంది. ఈ టెస్ట్ భారత్‌కు కీలకమైనది. ఈ మ్యాచ్ గెలవడమే వారికి సిరీస్‌ను డ్రా చేయడమేకాక, వచ్చే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవడానికి టీమిండియాకు చావో రేవో సమరం అవుతుంది. కానీ ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. వరసగా నాల్గవ, ఐదవ రోజులు వర్షం ప్రభావానికి గురయ్యే అవకాశముందని విజ్డెన్ నివేదిక తెలిపింది. ఈ మ్యాచ్ జేన్ మెక్‌గ్రాత్ డే సందర్భంగా ప్రత్యేకంగా జరగనుంది, ఇది క్యాన్సర్ అవగాహనకు మద్దతుగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం. బిబిసి వాతావరణ నివేదిక ప్రకారం, తొలి రోజు తక్కువ మేఘాలు ఉండగా, రెండవ రోజు ప్రకాశవంతమైన ఆకాశం కనిపిస్తుంది. అయితే నాల్గవ రోజున సాయంత్రం నుంచి వర్షం ప్రారంభమవుతుందని, ఐదవ రోజు ఇది మరింత తీవ్రంగా ఉండనుందని అంచనా. ఇదిలా ఉండగా, భారత్ జట్టు ప్రధాన బ్యాటర్లయిన రోహిత్, కోహ్లీ, రిషబ్ పంత్ రాణించడంలో విఫలమవడంతో, జస్ప్రీత్ బుమ్రా అద్భుత బౌలింగ్ చేసినప్పటికీ, జట్టు మొత్తం ప్రదర్శన లోపించింది. మరోవైపు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉంది. అలాగే టీమ్ ఇండియా మూడో స్థానంలో నిలిచింది. ఈ మూడు జట్లలో రెండు జట్లు ఈసారి ఫైనల్ ఆడడం దాదాపు ఖాయం. ప్రధానంగా భారత్ జట్టు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుందా లేదా అనేది పెద్ద ప్రశ్న అయింది.

# శ్రీలంకకు తప్పిన క్లీన్‌స్వీప్ గండం

## నామమాత్రపు మ్యాచ్‌లో కివీస్‌పై గెలుపు

ఢిల్లీ: న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ గండం నుంచి శ్రీలంక తప్పించుకుంది. గురువారం నెల్సన్ వేదికగా జరిగిన నామమాత్రపు మ్యాచ్ లో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపింది. చివరకు ఏడు పరుగుల స్వల్ప తేడాతో శ్రీలంక విజయం సాధించింది. కుశాల్ పెరీరా విధ్వంసక శతకంతో దుమ్ము లేపగా, చరిత్ అసలంక ఆల్ రౌండ్ ప్రదర్శనతో రాణించడంతో లంక గట్టెక్క గలిగింది. మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడేందుకు శ్రీలంక న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది. ఇందులో భాగంగా మొదట టీ20లు జరుగగా, తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన న్యూజిలాండ్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ క్రమంలో నామమాత్రపు మ్యాచ్‌లో పర్యాటక లంక ఆతిథ్య కివీస్ జట్టుకు ఊహించని షాకిచ్చింది. సాక్స్‌టన్ ఓవెల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ తొలుత బౌలింగ్‌ను ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించిన ఓపెనర్ పాతుమ్ నిస్సాంక (14), కుశాల్ మెండిస్ (22) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు.అయితే, వన్డౌన్ బ్యాటర్ కుశాల్ పెరేరా మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగి కివీస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడు. కేవలం 46 బంతుల్లోనే 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 219కి పైగా స్ట్రైక్‌రేటుతో 101 పరుగులు సాధించాడు. తద్వారా శ్రీలంక తరఫున అంతర్జాతీయ టీ20లలో ఫాస్టెస్ట్ సెంచరీ (44 బంతుల్లో) నమోదు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఇక మిడిలార్డర్‌లో అవిష్క ఫెర్నాండో (17) విఫలమైనా, చరిత్ అసలంక (46) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. మిగిలిన వాళ్లలో భనుక రాజపక్స, చమిందు విక్రమసింఘే జెరో ఆరు పరుగులతో ఆఖరివరకు అజేయంగా నిలిచారు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి శ్రీలంక 218 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫీ, జకారీఫౌల్క్స్, మిచెల్ సాంట్నర్, డారిల్ మిచెల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఘనంగానే ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. ఓపెనర్లలో టిమ్ రాబిన్సన్ (37) ఫర్వాలేదనిపించగా, రచిన్ రవీంద్ర (69) అర్ధ శతకంతో రాణించాడు. కానీ వీరిద్దరు ఔటయిన తర్వాత కివీస్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. వన్‌డౌన్‌లో వచ్చిన మార్క్ చాప్మన్ (9), గ్లెన్ ఫిలిప్స్ (6) పూర్తిగా విఫలమయ్యారు. అయితే డారిల్ మిచెల్ (35) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా, నువాన్ తుషార అతడికి చెక్ పెట్టాడు. మిగతా వాళ్లలో మిచెల్ హే (8), మైకేల్ బ్రాస్వెల్ (1) విఫలమయ్యారు. ఆఖర్లో సాంట్నర్ (14), జకారీ ఫౌల్క్స్ (21) మెరుపులు మెరిపించినా విజయానికి కివీస్ ఏడు పరుగుల దూరంలో నిలిచిపోయింది. 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 211 పరుగులే చేయగలిగింది.



# ఆసిస్ టెస్టు తర్వాత ప్రక్షాళన!

## కెప్టెన్, ప్రధాన కోచ్‌లపై కీలక నిర్ణయం

## గౌతమ్ గంభీర్‌కు బిసిసిఐ డెడ్‌లైన్



ఢిల్లీ: ఆస్ట్రేలియాతో చివరి టెస్టు తర్వాత టీమ్‌ఇండియాలో ప్రక్షాళన సీజన్ ప్రారంభంకానుంది. రోహిత్ శర్మ, గౌతమ్ గంభీర్‌ల జోడీ సంయుక్తంగా టీమ్‌ఇండియా నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ జట్టు గెలిచిన దానికంటే ఎక్కువగా ఓడిపోయింది. వీరిద్దరి నాయకత్వంలో టీమిండియా ఇప్పటి వరకు చరిత్రలో ఇంత చెత్త పదర్శన ఎప్పుడు చేయలేదు. లంకలో వన్డే సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌ను చవిచూసిన రోహిత్ సేన, న్యూజిలాండ్‌పై స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఆస్ట్రేలియాలో టీమిండియా చెత్త ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) గరం గరంగా ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో టీమిండియా జట్టు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాడు. మెల్‌బోర్న్ టెస్టు సందర్భంగా రోహిత్ శర్మ కెప్టెన్సీ రిటైర్‌మెంట్ గురించి ఆయన చర్చించినట్లు తెలిసింది. ఈ నెల 3 నుండి ప్రారంభమయ్యే సిడ్నీ టెస్టులో రోహిత్ టీమిండియా కెప్టెన్‌గా కనిపిస్తాడు. అతను జట్టులో ఆడటం ఖాయంగా కనిపిస్తుంది. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తర్వాత రోహిత్ సారథ్యంలో జట్టు ప్రదర్శన, టెస్టు జట్టులో అతని స్థానం, రిటైర్‌మెంట్‌పై చర్చ జరుగుతుంది. అయితే ఇంతటి కీలకమైన ఈ సిరీస్ మధ్యలో తొందరపడి



ఎలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదని అందరూ సిరీస్ ముగిసే వరకు వేచి చూస్తున్నారని సమాచారం. రాహుల్ ద్రవిడ్ తర్వాత టీమిండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ గంభీర్ నాయకత్వంలో భారత జట్టు శ్రీలంకలో వన్డే సిరీస్‌ను కోల్పోయింది. బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్ విజయంతో పాటు, గెలిచిన దానికంటే ఎక్కువ ఓడిపోయింది. అంతే కాకుండా ఆస్ట్రేలియా టూర్ మధ్యలో టీమిండియా అనుభవజ్ఞుడైన స్పిన్నర్ అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో ఏది సరైనదో అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బిజిటి టెస్ట్ సిరీస్‌కు జట్టు ఎంపికపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. అయితే అశ్విన్ నిర్ణయంలో భారత జట్టు ప్రధాన కోచ్ పాత్ర లేదని తెలుస్తుంది. గంభీర్‌ను పరిమిత ఓవర్లకు కోచ్‌గా కొనసాగిస్తూనే టెస్టు ఫార్మాట్‌కు మరొకరిని తీసుకొచ్చే పనిలో బీసీసీఐ ముందుకు వెళ్లే అవకాశం ఉందని సమాచారం. త్వరలో బోర్డుకు శాశ్వత సెక్రటరీ రాబోతున్నాడని, ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ప్రదర్శన మెరుగుపడకుంటే గంభీర్‌ను తొలగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుండి ప్రారంభమై మార్చి 9 వరకు కొనసాగుతుంది. అంటే జనవరి 1 నుంచి మార్చి 9 వరకు పరిస్థితిని మార్చేందుకు గంభీర్‌కు ఇంకా 68 రోజుల సమయం మాత్రమే ఉంది.




# ఇంగ్లండ్‌తో టి20 సిరీస్

## భారత్ జట్టులో స్వల్ప మార్పులు

ఢిల్లీ:బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 3 నుంచి ఆస్ట్రేలియాతో భారత్ ఆఖరి టెస్టు ఆడనుంది. ఆ తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్ టీమ్ ఇండియా టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. టీ20 సిరీస్‌లో భాగంగా ఇరు జట్లు మొత్తం 5 మ్యాచ్‌లు ఆడనున్నాయి. ప్రస్తుతం టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ ఆడుతోంది. ఆ తర్వాత స్వదేశానికి చేరుకుంటుంది. ఆ తర్వాత స్వదేశానికి వచ్చి ఇంగ్లండ్ తో తలపడనుంది. భారత పర్యటనలో భాగంగా ఇంగ్లండ్ టీమ్ టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. టీ20 సిరీస్ లో మొత్తం 5 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ తర్వాత 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు టీ20 సిరీస్‌ను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 6 నుంచి 12 వరకు జరిగే వన్డే సిరీస్ జరగనుంది. కాగా డిసెంబర్ 22న భారత పర్యటనతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఇంగ్లండ్ జట్టును ప్రకటించింది. రెండు సిరీస్‌లకు జోస్ బట్లర్ ఇంగ్లండ్‌కు నాయకత్వం వహించనున్నాడు. అయితే ఇంగ్లండ్ తో సిరీస్ కోసం భారత్ క్రికెట్ బోర్డు సెలక్షన్ కమిటీ త్వరలోనే భారత జట్టును ప్రకటించనుంది. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ టీ20 జట్టుకు రెగ్యులర్ కెప్టెన్. కాబట్టి టీ20 సిరీస్‌కు అతనే సారథిగా ఉండనున్నాడు. అయితే సెలక్షన్ కమిటీ ఏ కొత్త ముఖాలకు అవకాశం ఇస్తుంది? ఎవరు పునరాగమనం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వచ్చే వారంలో భారత జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఇందులో నితీశ్ కుమార్, తిలక్ వర్మలకు కచ్చితంగా స్థానం లభించే అవకాశముంది. ఇక ఇంగ్లండ్‌తో జరిగే మొదటి మ్యాచ్ ఈ నెల 22నఈడెన్ గార్డెన్స్‌లోను, రెండవ మ్యాచ్ 25న చెన్నై, మూడవ మ్యాచ్, 28న రాజ్‌కోట్, నాల్గవ మ్యాచ్ 31న పూణె, ఐదవ మ్యాచ్ ఫిబ్రవరి 2న ముంబైలో జరగనున్నాయి. కాగా ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌కు భారత జట్టులో సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అవేష్ ఖాన్, యష్ దయాల్ ఉండే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఇంగ్లండ్ జట్టులో జోస్ బట్లర్ (కెప్టెన్) రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, బెన్ డకెట్, జామీ ఓవర్టన్, జేమీ స్మిత్, లియామ్ లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్ ఉంటారు.

# అన్య పాలిటెక్ బంపర్ లిస్టింగ్

ముంబై, జనవరి 2: అన్య పాలిటెక్ అండ్ ఫెర్టి లైజర్ ఎస్ఎమ్ఈ కేటగిరీలో ఐపీవో కంపెనీ షేర్లు గురు వారం ఎన్ఎస్ఈలో 22శాతం ప్రీమియం లిస్టింగ్ నమోదు చేశాయి. దీంతో ఒక్కో షేరు రూ.17.10 రేటు వద్ద గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాయి. అయితే లిస్టింగ్ తర్వాత కూడా కంపెనీ షేర్లను కొనుగోలు చేయటం కోసం ఎగబడటంతో స్టాక్ 5 శాతం అప్పర్ సర్క్యూట్ ధర రూ.17.95కి ఇంట్రాడేలో తాకింది. ఈ ఐపీవో ఇష్యూ నుంచి భారీగా సబ్ స్క్రిప్షన్ చూసింది. పెట్టుబడిదారుల కోసం తెరచి ఉన్న మూడు రోజుల కాలంలో 440 కంటే ఎక్కువ రెట్లు దరఖాస్తులను పెట్టుబడిదారుల నుంచి అందుకుంది. అన్యా పాలిటెక్ కంపెనీ ఐపీవో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు పెట్టుబడిదారులకు బెట్టింగ్ వేసేందుకు అందుబాటులో ఉంచబడింది. తాజా ఐపీవో ద్వారా కంపెనీ దేశీయ స్టాక్‌మార్కెట్ల నుంచి రూ.44.80 కోట్లను విజయవంతంగా సమీకరించింది. పూర్తిగా ఫ్రెష్ ఇష్యూగా వచ్చిన కంపెనీ ఐపీవో ఇందుకోసం 320 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేసింది. ఈ క్రమంలో కంపెనీ తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను రూ.1314గా నిర్ణయించింది. లాట్ పరిమాణాన్ని 10,000 షేర్లుగా నిర్ణయించటంతో రిటైల్ పెట్టుబడిదారులు ఒక లాట్ కొనుగోలు కోసం కనీసం రూ.1.40 లక్షల షేర్లను కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇదేక్రమంలో కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.12.74 కోట్లను సమీకరించింది. ఐపీవో బిడ్డింగ్ సమయంలో రిటైల్ భాగం 321.53 సార్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు తమ కోసం కేటాయించిన 45.68 లక్షల షేర్లకు వ్యతిరేకంగా 502.81 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి. కంపెనీ వ్యాపారం.. అన్య పాలిటెక్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ 2011లో స్థాపించబడింది. కంపెనీ ప్రధానంగా ఎరువులు, సంచుల తయారీ వ్యాపారంలో నిమగ్నమై ఉంది. దీనికి తోడు పర్యావరణ పరిష్కారాలను కూడా అందిస్తుంది. కంపెనీ అధిక నాణ్యత గల హై డెన్సిటీ పాలిథిలిన్ పాలీప్రొఫైలిన్‌సంచులు, జింక్ సల్ఫేట్ ఎరువులను తయారు చేస్తోంది.




# రూ. 6 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై, జనవరి 2: చాలారోజుల తర్వాత దలాల్ స్ట్రీట్ కళకళలాడింది. అయితే నష్టాలు.. లేదంటే ఓ మోస్తరు లాభాలకే పరిమితమైన సూచీలు.. చాలా రోజుల తర్వాత భారీ లాభాలను నమోదు చేశాయి.ముఖ్యంగా ఫైనాన్షియల్ ఆటో, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్ల మేర పెరగగా.. నిఫ్టీ దాదాపు 45లో పాయింట్లు రాణించి 24,200 మార్కుకు చేరు కుంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒకేరోజు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.450 లక్షల కోట్లకు చేరింది. చివరికి 1400 పాయింట్లు పెరిగి 66,380 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 450 పాయింట్లు పెరిగి 24,188.65 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ బ్రాడ్ బ్యారెల్ ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారు ఔన్సు 2649 డాలర్ల వద్ద కొనసాగింది. డిసెంబర్ నెలకు సంబంధించి ఆటోబైల్ టోకు విక్రయాలు ఇన్వెస్టర్లను మెప్పించాయి. సాధారణంగా డిసెంబర్ విక్రయాలు నెమ్మదిస్తుంటాయి. అందుకు అంచనాలు మించి విక్రయాలు



నమోదు కావడం సానుకూల సెంటిమెంట్‌కు కారణమైంది. ఐషర్ మోటార్స్ 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, మారుతీ సుజుకీ 30 శాతం వృద్ధిని కనబరిచింది.దీంతో ఐషర్ మోటార్స్ 8శాతం మేర రాణించగా, మారుతీ సుజుకీ షేరు విలువ ఐదు కంటే ఎక్కువ పెరిగింది. డిసెంబర్ త్రైసికంతో పాటు 2025లోనూ ఐటీ కంపెనీలు అనూహ్యంగా ప్రోద్బలమైన వృద్ధిని కనబరచే అవకాశం ఉందన్న సీఎస్ఏ, సిటీ బ్రోకరేజీ సంస్థల అంచనాలు ఐటీ స్టాక్స్లో కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది. దీంతో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు గురువారం రాణించాయి. డిసెంబర్ నెలకు సంబంధించి విడుదలైన జీఎస్టీ కూడా ఇన్వెస్టర్లను మెప్పించాయి. డిసెంబర్ రూ.7 శాతం వృద్ధితో 1.77 లక్షల కోట్లుగా జీఎస్టీ వసూళ్లు నమోదు కావడం, ఆర్థిక వ్యవస్థ మెరుగవుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ బలంగా పుంజుకోవడంతో సూచీలు రాణిం చాయి. ముఖ్యంగా బజాజ్ ఫిన్సర్వ్, బజాజ్ ఫైనాన్స్‌తో పాటు హెచ్ఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది.

# మార్కెట్‌కు హ్యుండాయ్ క్రెటా 'ఇవి'

ముంబై, జనవరి 2: ప్రముఖకార్ల తయారీ కంపెనీ హ్యుండాయ్ మోటార్ ఇండియా క్రెటా విద్యుత్ కారును ఆవిష్కరించింది. భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025 వేదికగా దీన్ని జనవరి 17న విడుదల చేయనుంది. ఈ క్రమంలో కారు రూపాన్ని, ఇతర వివరాలను వెల్లడించింది. క్రెటాఈవీ ద్వారా ఈవీ సెగ్మెంట్‌లో టాటా కర్వ్, మహీంద్రా బీఈ 6, ఎంజీ జడ్ఎస్ ఈవీ వంటి కార్లకు హ్యుందాయ్ పోటీ ఇవ్వనుంది. దేశంలో పాపులర్ కార్లలో హ్యుందాయ్ విక్రయిస్తున్న క్రెటా ఒకటి. ఇదే పేరుతో ఈవీ వెర్షన్‌ను హ్యుందాయ్ తీసుకొస్తోంది. సాధారణ క్రెటాను పోలిన డిజైన్‌తోనే క్రెటా ఈవీని తీసుకొస్తుండడం గమనార్హం. అందుబాటు ధరలో దీన్ని తీసుకొస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ కారుకు ముందువైపు ఛార్జింగ్ తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారుకు ముందు వైపు ఛార్జిర్‌పోర్ట్ ఇస్తున్నారు. డిజిటల్ కీ లెవెల్ 2 ఎడిఎఎస్, 360 డిగ్రీ కెమెరా వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్, స్మార్ట్, ప్రీమియం, ఎక్స్‌లెన్స్ వంటి నాలుగు వేరియంట్లలో ఈ కారు రానుంది. ఇక ఈ కారు ఛార్జింగ్ విషయానికొస్తే.. ఇది రెండు రకాల బ్యాటరీ ప్యాక్స్ వస్తోంది. 23 బ్యాటరీతో వస్తున్న కారు సింగిల్ ఛార్జ్390 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇక 514 బ్యాటరీ ప్యాక్ వస్తున్న కారుతో 473 కార్లు కొనుక్కోవచ్చు. డీసీ ఛార్జర్‌తో కేవలం 28 నిమిషాల్లో 10శాతం నుంచి 80 శాతం వరకు చార్జ్ చేయొచ్చు.

# ప్యాసివ్ ఫండ్స్‌పైసెబి కార్యాచరణ

ముంబై, జనవరి 2: ప్యాసివ్ ఫండ్స్‌ను ప్రోత్సహించే విధంగా సినీ మ్యూచువల్ ఫండ్స్ లైట్ (ఎంఎఫ్ లైట్) నిబంధనల కార్యాదరణను ప్రకటించింది. ప్యాసివ్ ఫండ్స్ విభాగంలో కొత్త సంస్థల ప్రవేశాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడుల వైవిధ్యాన్ని విస్తృతం చేయడమైన లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. ఇండెక్స్ ఎండ్స్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫ్రెండ్స్ (ఈటిఎవిలు), ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ (ఏఫివోఎఫ్) సహా ప్యాసివ్ పథకాలకు ఈ కార్యాచరణ అమలవుతుందని సెబి తెలిపింది. ప్యాసివ్ ఫండ్స్‌ను మాత్రమే నిర్వహించే సంస్థలకు అవరోధాలను తొలగించడం, మార్కెట్లో లిక్విడిటీని పెంచడం, కొత్త సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం ఇందులో లక్ష్యాలని పేర్కొంది. ఎంఎఫ్ లైట్ నిబంధనలు 2025 మార్చి 16 నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిపింది. ప్రైవేటు ఈక్విటీ ఫండ్స్ సైతం ఎంఎఫ్ లైట్ సంస్థలకు మద్దతుగా (స్పాన్సర్) నిలవొచ్చని ప్రకటించింది. కాకపోతే కీలక స్థానాల్లోని ఉద్యోగులకు 20 ఏళ్ల అనుభవాన్ని అర్హతగా ఖరారు చేసింది. స్పానర్లకు సంబంధించి భిన్నమైన అర్హత ప్రమాణాలను నిర్ణయించింది. ఎంఎఫ్ లైట్ కార్యావరణ తొలుత దేశీ ఈక్విటీ సూచీల ఆధారిత ప్యాసివ్ ఫండ్సకు వర్తిస్తుందని తెలిపింది. యాక్టివ్ ఫండ్స్, ప్యాసివ్ ఫండ్స్ అందించే ప్రస్తుత సంస్థలు సైతం నూతన కార్యాచరణ కింద తమ ప్యాసివ్ ఫుడ్స్ పోర్ట్‌ఫోలియాను మరొక సంస్థ కింద నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. **ప్యాసీస్ ఫండ్స్ ఏమిటి?** నిఫ్టీ 50 లేదా ఎస్ అండ్ పీ 500 వంటి ఒక నిర్దిష్ట మార్కెట్ ఇండెక్స్ పనితీరును ప్రతిబందించడాన్ని ఉద్దేశించిన పెట్టుబడి సాధనాల ప్యాసివ్ ఫండ్స్, యాక్టివ్ పండ్ల(ప్రత్యేకంగా ఫండ్ మేనేజర్ ఉండే మ్యూచువల్ ఫ్రెండ్స్ ) కాకుండా, ప్యాసివ్ ఫండ్స్ మార్కెట్ ఇండెక్స్‌లు ఉన్నాయి. వీటికి ఎక్కువగా నిర్వహణ ఖర్చులు అవసరం లేదు. కాబట్టి కొంటి యాక్టివ్ పండ్లతో ప్రస్తుత రాబడులు మారవచ్చు. ఇది ఇండెక్స్‌లను అనుసరిస్తూ ఆయా విభాగాల్లోని మెరుగైన స్టాక్‌లను కలిగి ఉంటుంది. దాంతో డ్రైవర్సిఫికేషన్ ఎక్కువగా ఉంటుంది. నష్టదాయం తక్కువగా ఉంటుంది. ఎక్సపెన్సీ రేషియో తక్కువ ఉంటుంది.



# వొడాఫోన్ ఐడియా 5జి మొబైల్ సేవలు!

ముంబై, జనవరి 2: ప్రైవేటురంగ వొడాఫోన్ ఐడియా ఎట్టకేలకు 5జి బ్రాండెడ్ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది మార్చిలో 5జీ సేవల్ని తీసుకొస్తున్నట్లు వొడాఫోన్ ఐడియా ప్రతినిధి ఒకరు తెలిపారు. తద్వారా దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ సేవల్ని అందిస్తున్న రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. మెరుగైన నెట్‌వర్క్ అనుభవంతో, తక్కువ ధరలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని సమాచారు. టెలికాం రంగంలో నెలకొన్న త్రిముఖపోరులో మొదటినుంచి అంతంత మాత్రంగానే ఉన్న వొడాఫోన్ ఐడియాకు తేజ్ రూపంలో గట్టి సవాలు ఎదురైంది. 5జి స్పెక్ట్రమ్‌ను దక్కించుకున్న ఆ కంపెనీ, నిధుల కొరత కారణంగా 5జీని విస్తరించడంలో ఆలస్యం చేసింది. అదే సమయంలో జియో, ఎయిర్‌టెల్ సేవల్ని వేగంగా విస్తరించి మరింత మంది యూజర్లను ఆకర్షించాయి. దీంతో విఐ పెద్దసంఖ్యలో యూజర్లను కోల్పోయింది. ఇప్పుడు కాస్త ఆలస్యంగానైనా 5జీ సేవల్ని తీసుకొచ్చి తన ఉనికిని కాపాడుకోవడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎయిర్‌టెల్,జియోతో పోలిస్తే ఎంట్రీ లెవల్ ప్లాన్లు 15 శాతం చౌకగా తీసుకురానున్నట్లు సంబంధితవర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్రీపెయిడ్ యూజర్లను ఆకర్షించేందుకు డీలర్ కమీషన్లు, ప్రచార ఖర్చుల్ని పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తొలుత 75 నగరాల్లో 5జీ నెట్‌వర్క్ పరిచయం చేయాలని వొడాఫోన్ ఐడియా చూస్తోంది. అధిక డేటా వినియోగించే పారిశ్రామిక కేంద్రాలపై దృష్టిసారించనుంది.




# వాణిజ్యం

## ఐపిఒకు రిలయన్స్ జియో

ముంబై, జనవరి 2: బిలియనీర్, ఇండియాలోని అత్యంత సంపన్న పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఐపిఒ ఎంట్రీకి సన్నాహాలు ప్రారంభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఐపిఒ ద్వారా 35,000నుండి 40,000 కోట్ల రూపాయలను సమీకరించగలదని అంచనా. చరిత్ర సృష్టించనున్న రిలయన్స్ జియో ఐపిఒ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఐపిఒ భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపిఒగా నిరూపించనుంది, దీనిని ముఖేష్ అంబానీ 2025లో తీసుకురావచ్చు. ఈ ఐపిఒ కేవలం ఆఫర్ ఫర్ సేల్ కాంపో నెంట్ మాత్రమే కాదు, కొత్త షేర్లను జారీ చేయడం ద్వారా కూడా ఫండ్స్ సమీకరించ నుంది. ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ 2025 ద్వితీయార్థంలో ఐపిఒని తీసురావాలని టార్గెట్‌గా పెట్టుకుంది. నివేదికల ప్రకారం ప్రీఐపిఒ ప్లేస్‌మెంట్‌కు సంబంధించి చర్చల దశ ప్రారంభమైంది. ప్రస్తుతం 2024 అక్టోబర్‌లో ఐపిఒ ద్వారా రూ.28000 కోట్లు సేకరించిన హ్యుండాయ్ మోటార్ ఇండియా పేరిట అతిపెద ఐపిఒ రికార్డు ఉంది. ఐపిఒలో పెట్టుబడిదారుల ఎగ్జిట్ రిలయన్స్‌జియోలో ఇన్వెస్ట్ చేసిన చాలా మంది ఇన్వెస్టర్లు ఐపిఒ నుండి ఎగ్జిట్ కావచ్చు కాబట్టి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఐపిఒలో ప్రైమరీ ఆఫర్ ఫర్ సేల్ కాంపోనెంట్ ఉండవచ్చు. రిలయన్స్ జియోలో విదేశీ పెట్టుబడిదారులకు దాదాపు 33 శాతం వాటా ఉంది. 2020లో కరోనా మహమ్మారి సమయంలో రిలయన్స్ పెట్టుబడి దారు అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, కెకెఆర్ అండ్ సిల్వర్ లేక్ వంటివి కంపెనీలో సుమారు 18 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టాయి. గ్లోబల్ బ్రోకరేజ్ హౌస్ జెఫరీస్ రీసర్చ్ రిపోర్టులో 2025 సంవత్సరంలో రిలయన్స్ జియోకి లిస్టింగ్ చేసే అన్ని అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., atD.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999.Fax: 040-27642512, RNI No. 62142/95,Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi: 40 Ps.